**సాహితీ** గత వారం రోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

WWW.VAARTHA.COM

epaper.vaartha.com

నిజామాబాద్

: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-12-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 325 పేజీలు: 10+4 వెల: 6.50



కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మి మీ వెంటే

KAPIL GROUP

కపిల్ చిట్స్

Visit Us: www.kapilchits.com

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


## ఆర్టికల్ 370 రద్దు గర్వకారణం



### ప్రేరణ స్థల్ ప్రారంభోత్సవ సభలో ప్రధాని మోడీ

**శ్యామ్ ప్రసాద్, దీన్‌దయాళ్, వాజ్‌పేయి విగ్రహాలను ఆవిష్కరించిన ప్రధాని**

**లక్నో, డిసెంబరు 25:** ఆర్టికల్ 370 గోడను కూల్చివేసే అవకాశం తమ ప్రభుత్వానికి లభించినందుకు బిజెపి గర్విస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా లక్నోలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రేరణ స్థల్‌ను ప్రారంభించిన అనంతరం మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. శ్యామ్ ప్రసాద్, దీన్‌దయాళ్, వాజ్‌పేయి విగ్రహాలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మోడీ

>>2



## క్రిస్మస్ వేడుకలకు వెల్లువెత్తిన జనం

### ప్రతిష్టాత్మక మెదక్ చర్చిలో ఉదయం నుంచి మార్మోగిన ప్రార్థనలు

**500 మంది పోలీసులతో భారీ బందోబస్తు**

**మెదక్ ప్రభాతవార్త ప్రతినిధి:** ఆసియాలోనే రెండో అతి పెద్ద చర్చిగా పేరుగాంచిన మెదక్ కెథడ్రల్ చర్చిలో 101, క్రిస్మస్ వేడుకలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆనవాయితీ ప్రకారం ఏసుక్రీస్తు జన్మదినాన్నీ పురస్కరించుకుని తెల్లవారు జామున చర్చికమిటీ బాధ్యులుశిలువను ఊరేగింపుగా

>>2



ఘటనస్థలంలో పాక హనుమంత మృతదేహం, ఫైల్ ఫోటో

## ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

### మావోయిస్టు అగ్రనేత గణేశ్ సహా ఆరుగురి మృతి

**భారీగా ఆయుధాలు స్వాధీనం**

**నక్సల్ రహిత దిశగా భారత్: అమిత్‌షా**

**చింతూరు (ఒరిస్సా) డిసెంబర్ 25 ప్రభాతవార్త:** మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒరిస్సాలోని కంధమాల్, గంజామ్ జిల్లా సరిహద్దుల్లోని రంబాల అటవి ప్రాంతంలో గురువారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నాయకుడు, కేంద్రకమిటి సభ్యుడు పాక హనుమంతు (69) అలియాస్ గణేష్ ఉయికె హతమయ్యాడు. ఆయనతో పాటు

>>2

మళ్లీ తెరపైకి వస్తున్న

## ఎమ్మెల్యేల కొనుగోలు కేసు!

### దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్ వాంగ్మూలం సిట్ రికార్డు

**ప్రభాకర్‌రావు కుమారుని ఆర్థిక లావాదేవీలపై ఆరా**

**నేడు సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక**

**ఫోన్ ట్యాపింగ్‌లో ఇంకా తొలగని సందేహాలెన్నో!**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్25:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్‌ను కూడా సిట్ విచారించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నందకుమార్ గతంలో అరెస్ట్ అయ్యారు. ఫాన్ ట్యాపింగ్ కారణంగా ఎమ్మెల్యేలు కొనుగోలు అంశం తెరపైకి వచ్చింది. దీంతో నందకుమార్ వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులందరినీ సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. గురువారం రాధాకిషన్ రావు, తిరుపతన్న,శ్రవణ్‌రావులను పిలిచిన సిట్.. వారిని విచారించారు. రెండు రోజుల క్రితం ప్రణీత్‌రావు, భుజంగరావులను సిట్ పోలీసులు విచారించారు. వీరందరని ప్రభాకర్‌రావు సమక్షంలోనే విచారించారు. ప్రభాకర్‌రావు కుమారుడు నిశాంత్‌రావు ఆర్థిక లావాదేవీలపై కూడా ప్రశ్నించారు. గురువారంతో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ముగియనుండటంతో అందిరితో కలిపి సిట్ దర్యాప్తు చేసింది. గురువారంతో ప్రభాకర్ రావు 14 రోజుల విచారణ ముగిసింది. శుక్రవారం 10 గంటలకు పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్‌రావు విడుదల కానున్నారు. 14 రోజుల కస్టడీలో

>>2

## తెలంగాణలో ఇద్దరు మంత్రులు వేలకోట్లు కొల్లగొట్టారు

వారు జైలుకెళ్లడం ఖాయం: కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు 3



## సంక్రాంతిలోగా కాంగ్రెస్‌కు ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్25:** ఎన్నికల సమయంలో మాత్రం పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్స్, సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యత అంటూ రాష్ట్ర కాంగ్రెస్‌లో హడావుడి జరిపి ఇటీవల ఆ ఊసే ఎత్తడం లేదు. తాజాగా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకంపై అధిష్ఠానం దృష్టి సారించింది. శీతాకాల అసెంబ్లీ సమావేశాల తర్వాత సంక్రాంతి పండుగ లోగా వర్కింగ్ ప్రెసిడెంట్లను నియామకం చేసేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డిసిసి అధ్యక్ష పదవుల నియామకాలు పూర్తి కావడంతో డిసిసి కార్యవర్గం

>>2






గురువారం ఢిల్లీలోని ప్రఖ్యాత క్యాథడ్రల్ చర్చ్ ఆఫ్ రిడెంక్షన్‌లో క్రిస్మస్ ప్రార్ధనల్లో పాల్గొన్న ప్రధాని మోడీ

# వాజ్‌పేయికి ప్రధాని నివాళి

## దేశ ప్రజలకు ప్రధాని క్రిస్‌మస్ శుభాకాంక్షలు

## ఢిల్లీలో వేడుకలకూ మోడీ హాజరు

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:** మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా వాజ్‌పేయి స్మృతివనం 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీతోపాటు పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు జెపి నడ్డా, నిర్మలా సీతారామన్, రాజీవ్ రంజన్ సింగ్, ఇతర మంత్రులు, ఎంపిలు, ఢిల్లీ సిఎం రేఖా గుప్తా, బిజెపి కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు వాజ్‌పేయికి నివాళి అర్పించారు. "వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన స్మారక చిహ్నం సదైవ్ అటల్‌ను సందర్శించి నివాళి అర్పించే అవకాశం లభించడం తన అదృష్టం. ప్రజాసేవకు, దేశ సేవకు అంకితమైన ఆయన జీవితం దేశ ప్రజలను ఎల్లప్పుడూ ప్రేరేపిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోడీ అన్నారు. అలాగే సోషల్ మీడియా ఎక్స్‌లో "వాజ్‌పేయి తన జీవితాన్నంతా సుపరిపాలన, దేశ నిర్మాణానికి అంకితం చేశారు" అని ట్వీట్ చేశారు.

**క్రిస్మస్ ప్రార్థనల్లో ప్రధాని మోడీ**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని దేశ ప్రజలకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అందరూ శాంతి, కరుణ, ఆశలతో జీవితాల్లో పురోగమించాలని ఆకాంక్షించారు. ఆనందోత్సాహాలతో క్రిస్మస్‌ను జరుపుకోవాలన్నారు. యేసు క్రీస్తు బోధనలు సేవాభావాన్ని, సామాజిక సామరస్యాన్ని, సోదరభావాన్ని, పరస్పర గౌరవాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని ప్రధాని తెలిపారు. అలాగే గురువారం ఉదయం ఢిల్లీలోని ప్రఖ్యాత క్యాథడ్రల్ చర్చ్ ఆఫ్ రిడెంపక్షన్‌లో నిర్వహించిన క్రిస్మస్ ప్రార్థనల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రధాని మోడీ శ్రేయస్సు కోసం ఢిల్లీ బిషప్ పాల్ స్వరూప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈవివరాలను తెలుపుతూ ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ ఒక ట్వీట్ చేశారు.

# ఆర్టికల్ 370 రద్దు గర్వకారణం

>> మాట్లాడుతూ, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం సృష్టించిన సుపరిపాలన వారసత్వాన్ని ఇప్పుడు, కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో కొత్త శిఖరాలకు తీసుకువెళ్తున్నామని అన్నారు. దేశ మహనీయులను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని విమర్శలు గుప్పించారు. "స్వాతంత్ర్యం తర్వాత జరిగిన మంచి పనులన్నీ ఒకే కుటుంబానికి ఆపాదించారు. అంతటా ఒకే కుటుంబానికి చెందిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. దేశంలో ఇద్దరు దేశాధినేతల వ్యవస్థను శ్యామ్ ప్రసాద్ తిరస్కరించారు" అని ప్రధాని అన్నారు. ప్రభుత్వ పథకాలు వివక్ష లేకుండా పేదలందరికీ చేరేలా చూడటానికి తమ ప్రభుత్వం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ స్ఫూర్తిని తన లక్ష్యంగా చేసుకుందని మోడీ వివరించారు. 2014కు ముందు సుమారు 25 కోట్ల మంది ప్రజలు సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉండేవారు, అయితే నేడు ఈ సంఖ్య 95 కోట్లకు పెరిగిందన్నారు. అటల్‌జీ హయాంలోనే గ్రామగ్రామాన రోడ్ల నిర్మాణానికి బీజం పడిందన్నారు. 2000 ఏడాది నుంచి గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామాల్లో 8 లక్షల కి.మీ మేర రోడ్ల నిర్మాణం జరిగాయని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలోనే దాదాపు 4 లక్షల కి.మీ మేర గ్రామాల్లో రోడ్ల నిర్మాణం జరిగిందని తెలిపారు. దేశంలో ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణం మరింత పుంజుకుందని, అటల్ జీ హయాంలోనే ఢిల్లీలో మెట్రో ప్రారంభమైందని చెప్పారు. ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ కారిడార్ రక్షణ ఉత్పాదనలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందే రోజు ఎంతో దూరంలో లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత 12ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్లువెత్తిన జనం

>> తీసుకువచ్చి చర్చిలోని ప్రధాన వేదిక మీద ప్రతిష్టించారు. ఉదయం తెల్లవారు జామున 4:30 గంటలకు ప్రాతఃకల ఆరాధనాతో మెదక్ చర్చిలో క్రిస్మస్ మహోత్సవ్వా ప్రారంభం అయ్యింది. ఇంచార్జ్ బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ భక్తులకు దైవ వాక్యాన్ని ఇచ్చారు. దక్షిణ ఇండియా సంఘం, మెదక్ అధ్యక్ష మండలం సంఘం తరపున క్రైస్తవ సోదరులకు బిషప్ ఏసుక్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లోకంలో ఏసుక్రీస్తు జన్మదినం జరుపని దేశమంటూ ఉండదని అన్ని దేశాలు ఆయన లోక రక్షకుడిగా భావించి జన్మదినాన్ని జరుపుకుంటారని బిషప్ దైవ వాక్యాన్ని అందించారు. సుమారుగా 5 వేల మంది భక్తులు ప్రాతకాల ఆరాధనలో పాల్గొన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలియజేసేలా చర్చిలో ప్రధాన వేదిక ముందు సంప్రదాయ పద్దతిలో పశువుల పాక ఏర్పాటుచేసి దానికి స్టార్ వేలాడదీశారు. మరో పక్కన పెద్ద సైజు క్రిస్మస్ ట్రీని ఏర్పాటుచేసి దానిని శాంత క్లాజ్ బొమ్మలను, బెల్స్, స్టార్స్, గ్రీటింగ్ కార్డ్స్ రంగు రంగుల బాల్స్ తో అందంగా అలంకరించారు. చర్చిలోని విశాలమైన హాలును రంగురంగుల మెరుపు కాగితాలు, బెలూన్‌లు, స్టార్‌లతో శోభాయమానంగా అలంకరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల నుంచి భారీ ఎత్తున భక్తులు మెదక్ చర్చికి తరలి వచ్చారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసింది, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులతో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మహా దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి ప్రధాన గేటు ముందు కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలో చర్చి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గత సంవత్సరం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసి 29 కోట్ల రూపాయలు మంజూరు చేశాడని గుర్తు చేశారు. మహా దేవాలయాన్ని సుందరీకరించడానికి వివిధ పనులు జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# ఆటగాళ్ల ఎంపికలో బంధుప్రీతి లేదు

## సంసద్ ఖేల్ మహోత్సవ్ ప్రారంభోత్సవ సభలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:** యువతలో క్రీడా సంస్కృతి, నాయకత్వ లక్ష్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో 'సంసద్ ఖేల్ మహోత్సవ్' నిర్వహిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలిపారు. సంసద్ ఖేల్ మహోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఆటగాళ్ల ఎంపికలో బంధుప్రీతి 2014లోనే అంతమైందని, ఇప్పుడు కష్టపడేతత్వం, నైపుణ్యం ఉన్న పేద పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని అన్నారు. ఈ సంసద్ ఖేల్ మహోత్సవ్ ద్వారా వేలాది ప్రతిభావంతులైన క్రీడాకారులను దేశం గుర్తిస్తున్నదని ప్రధాని చెప్పారు. 2014కు ముందు క్రీడాకారుల ఎంపికలో అవినీతి, అక్రమాలు ఉండేవని, ఆ విధానానికి ముగింపు పలికి దశాబ్దమైందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మెరుగయ్యాయని తెలిపారు. ప్రస్తుతం పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రతిభ, కష్టపడే తత్వంతో క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు. 2014కు ముందు క్రీడల కోసం దేశ బడ్జెట్లో రూ.1200 కోట్లు కేటాయిస్తే.. ఆ తర్వాతి కాలంలో రూ.3 వేల కోట్ల కంటే ఎక్కువ కేటాయిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. ప్రత్యేక పథకాల ద్వారా అర్హులైన అథ్లెట్లకు నెలకు 25 వేల నుంచి రూ.50 వేల వరకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు.

# వర్కింగ్ ప్రెసిడెంట్లు

>> నియామకానికి సంబంధించి రాష్ట్ర పిసిసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వర్కింగ్ ప్రెసిడెంట్స్‌ను ఈసారి ఐదుగురిని నియమించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఓసి, బిసి, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం. ఓసీలలో సిఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడు రోహిణ్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, జగ్గారెడ్డి పేర్లు వినపడుతున్నాయి, బీసీలలో మధుయాష్కి గౌడ్ తదితరుల పేర్లు వినపడుతున్నాయి. అయితే ఈ పోస్టుల విషయంలో ఆలస్యం కావడంపై పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో పదవులు రాక పోయినా.. కనీసం పార్టీలోని కీలక పోస్టును అయినా భర్తీ చేయకపోతే ఎలా...? అనే చర్చ నడుస్తోంది. పని విభజనతో పాటు.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రచారం.. ఆర్గనైజేషన్ పర్యవేక్షణ లాంటి. అంశాలన్నిటినీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ చూస్తారు.

## వారం - వర్జ్యం

26-12-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
షష్ఠి మ.1.40
శతభిష ఉ.8.58, మూల కార్తె
వర్జ్యం : మ.2.43-4.09
దు.ఉ.8.48-9.33,
2) 12.14-12.58
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** వృత్తి ఉద్యోగాలలో ఎక్కువ శ్రద్ధ కనబరచి అనుకూల ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

**వృషభం:** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తలనొప్పిగా మారుతుంది.

**మిథునం:** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనల వారితో సంబంధ బాంధవ్యములు పెంచుకొంటారు. శ్రమ అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ప్రయాణాలు సౌలభ్యం.

**కన్య:** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**తుల:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఉద్యోగావకాశాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు:** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. జీవితభాగస్వామి నుండి ధనం లభిస్తుంది. వస్త్రలాభం.

**మకరం:** మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో శ్లాఘించబడతాయి. వాహన సౌఖ్యం. నూతన విద్యావకాశాలు లాభిస్తాయి.

**కుంభం:** నైపుణ్యతతో ప్రతిభతో మెదడుకు పదును పెట్టి వ్యాపారంలో లాభము తెస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**మీనం:** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రైతు భరోసా 15 లక్షల ఎకరాలకు బంద్

## రాష్ట్రంలో 1.20 కోట్ల ఎకరాలకే పరిమితం


## గత వానాకాలంలో 1.38 కోట్లకు వర్తింపు

## సాగు యోగ్య భూములకే పెట్టుబడి సాయం

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతు భరోసా పథకంపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం వల్ల సుమారు 15 లక్షలకు పైగా ఎకరాలకు నిధులు కట్ అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 1.20 కోట్ల ఎకరాలకు మాత్రమే రైతు భరోసా పరిమితమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ యాసంగి నుండి రైతు భరోసా నిధుల విడుదలలో భాగంగా పంటలు వేసిన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 70.11 లక్షల మంది రైతులకు చెందిన కోటి 49 లక్షల ఎకరాలకు రైతుభరోసా అందిస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా పంట భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రైతు భరోసా నిమిత్తం దరఖాస్తు చేసుకునే వీలు కల్పించడంతో దాదాపు 5 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన సుమారు 75 లక్షల మంది రైతులకు భరోసా సాయాన్ని అందించాల్సి ఉంది. తెలంగాణలో సాగు చేసే భూములు 1.48 కోట్ల ఎకరాల మేర ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇందులో ఒక్క వానాకాలం సాగు సీజనులో 1.36 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు వేశారు. దీంతో పాటు, మరో 12 లక్షల ఎకరాల్లో కూరగాయలు, పండ్లు, పూల తోటలు సాగవుతున్నాయి. ఇవన్నీ కలిపి మొత్తంగా 1.49 కోట్ల ఎకరాలుగా ఉంది. ఇందులోనే పార్ట్ బి కేటగిరి కింద 18 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. గత ప్రభుత్వం పార్ట్ బి భూములను రైతు బంధు పథకం నుండి మినహాయించింది. ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ రికార్డులను పరిగణనలోకి తీసుకుని పార్ట్ బి కేటగిరీ భూములతో పాటు, రాళ్లు, కొండలు, రప్పలు, గుట్టలు, రోడ్లు మార్చిడి తదితర వివాదాస్పద భూములన్నింటినీ తొలిగించి రైతుకు సంబంధించి సాగుచేసే పట్టా భూములనే లెక్కలేకి తీసుకోనుంది. గత వానాకాలం సీజనులో రాష్ట్రంలో మొత్తంగా 67.01 లక్షల రైతులకు 138.08 లక్షల ఎకరాల భూమికి గాను రూ.8,284.66 కోట్లను జమ చేసింది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఒక ఎకరం లోపల భూమి ఉన్న రైతులు 25 శాతం, అతిపెద్ద కమతం అయిన 15 ఎకరాలకు వరకు ఉన్న వారు 0.05 వాతం మాత్రమే ఉన్నట్టు లెక్కకట్టింది. ఒక ఎకరం ఉన్న రైతులు 24.22 లక్షల మంది ఉండగా, 15.54 లక్షల ఎకరాల ఉంది. వీరికి రూ.812.63 కోట్లు అవసరం ఉంది. అలాగే 2 ఎకరాలు కలిగిన 17.02 లక్షల మందికి 25.62 లక్షల ఎకరాలు ఉండగా, ఇందుకు రూ.537.20 కోట్లు, 3 ఎకరాలు ఉన్న వాళ్లు 10.45 లక్షల మందికి 25.86 లక్షల ఎకరాలకు రూ.1,551.89 కోట్లు, 4 ఎకరాలు ఉన్న రైతులు 6.33 లక్షల మందికి 21.89 లక్షల ఎకరాలకు రూ.1,313.54 కోట్ల నిధుల అవసరం ఉంది. ఇక 5 ఎకరాలు ఉన్న 4.43 లక్షల మందికి 19.82 లక్షల ఎకరాలకు రూ.1,189.43 కోట్లు, 6 ఎకరాలు ఉన్న 1.71 లక్ష మందికి 9.16 లక్షల ఎకరాలకు రూ.549.80 కోట్లు, 7 ఎకరాలు ఉన్న 33 వేల మందికి 5.93 లక్షల ఎకరాలకు రూ.356.09 కోట్లు, 8 ఎకరాలు కలిగిన 67 వేల మందికి 4.43 లక్షల ఎకరాలకు రూ.265.91 కోట్లు, 9 ఎకరాలు కలిగిన 39 వేల మందికి 3.23 లక్షల ఎకరాల భూమికి రూ.194.32 కోట్లు రైతు భరోసాగా ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అయితే ఇందులో వ్యవసాయ యోగ్యం కాని అటు ఇటుగా 10 లక్షల ఎకరాలు ఉంటుందని వ్యవసాయ అధికారులు లెక్క తేల్చారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ ఎక్స్టెన్షన్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా జరిపిన సర్వేలో 2.10 లక్షల ఎకరాలు సాగు యోగ్యం కానివిగా గుర్తించారు. అలాగే గ్రామ సభల్లో వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదుల అనంతరం వాటితో పాటు, ఇతర వడపోత కార్యక్రమాలతో ఇవన్నీ కలిసి సుమారు 1లక్షల ఎకరాలకు పెరిగినట్లు సమాచారం.

# ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

>> మరో ముగ్గురు ఇదే ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా, ఇదే ప్రాంతంలో జరిగిన మరో ఎన్‌కౌంటర్ మరో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందినట్టు పోలీసు వర్గాలు ప్రకటించాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాక హనుమంతు అలియాస్ రూపా అలియాస్ రాజేష్ తివారీ మావోయిస్టుల్లో కీలక నేత, చాలా సీనియర్ నాయకుడు ఒరిస్సాలో అన్ని డివిజన్ల పరిధిలో మావోయిస్టు కార్యకలపాలకు ఆయన కేంద్ర బిందువు. ఆయనపై దాదాపు 1.1కోట్ల రివార్డు ఉంది. ఒరిస్సాలోని కంధమాల్ అటవి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్టు పసిగట్టిన ఇంటిలిజెన్స్ బలగాలు(యస్.ఐ.డబ్ల్యు)) భద్రతబలగాలను రంగంలోకి దింపారు. దాదాపు 20 యస్.ఒ.జి, బృందాలు, 2 సిఆర్‌పియఫ్ బృందాలు, 1 బియస్‌యఫ్ బృందంతో కలిపి మొత్తం 23 బృందాలు మావోయిస్టుల కదలికలు ఉన్న కంధమాల్ జిల్లాలోని చెక్‌పాడ పోలీసు స్టేషన్ పరిధితో పాటు గంజామ్ జిల్లాలోని రంబాల అటవి ప్రాంతాన్ని గత రెండు రోజులుగా జల్లెపడుతున్నాయి. ఈ నేపథ్యంలో పలుమార్లు మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు జరిగాయని, గురువారం తెల్లవారుజాము నుంచి జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఘటన స్థలం నుంచి నాలుగు మృతదేహాలు, 2ఇన్‌సాస్ రైఫిళ్ళు, ఒక 303 తుపాకిని స్వాధినం చేసుకున్నాట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. వారిలో ఒకరు గణేష్ ఉయికె కాగా మరో మూడు మృతదేహాలను గుర్తించాల్సి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఒరిస్సా ఎన్‌కౌంటర్‌ను ఊటంకిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఎన్‌కౌంటర్ నక్సల్స్ రహిత భారతదేశం దిశగా ఒక మైలురాయి అని ఆయన తన ఎక్స్‌లో అభివర్ణించారు. ఈ విజయంతో ఒరిస్సా నక్సలిజం నుంచి పూర్తిగా విముక్తి పొందినట్టె అని, 2026మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించటానికి కట్టుబడి ఉన్నట్టు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. మావోయిస్టు కేంద్రకమిటి సభ్యులు కేవలం ఆరుగురు మాత్రమే మిగిలారని, వారిలో పాక హనమంతు ఒకరని పోలీసు వర్గాలు భావిస్తున్నాయని ఒరిస్సా అడిషనల్ జనరల్ ఆఫ్ పోలీస్(ఒపియస్) సంజీవ్ పాండా అభిప్రాయపడ్డారు. పాక హనుమంతు తెలంగాణాలోని నల్లగొండ జిల్లా, చందూరు మండలం పుల్లెంల గ్రామస్తుడు. మొత్తం ఈ ఏడాది వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 9మంది సిపిఐ(మావోయిస్టు) కేంద్రకమిటి సభ్యులు మృతిచెందారు. వారిలో1. రామచంద్రరెడ్డి అలియాస్ జైరామ్ అలియాస్ చలపతి, 2.గౌతమ్ అలియాస్ సుధాకర్, 3.రాజు దాదా అలియాస్ కట్టా రామచంద్రారెడ్డి, 4.కోసా దాదా అలియాస్ కదారి సత్యనారాయణరెడ్డి, 5.సహదేవ్ సోరెన్ అలియాస్ ప్రవేష్, 6.వివేక్ అలియాస్ మనోజ్, 7.మడివి హిడ్మా, 8.మొట్టురి జోగారావు అలియాస్ టేక్ శంకర్, 9.మోడెం బాలక్రిష్ణ వంటి తొమ్మిది మంది కేంద్రకమిటి సభ్యులు ప్రాణాలు కోల్పోవటం ఆ పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ. భారత దేశంలో ఎలాగైనా మావోయిస్టు రహిత భారతదేశంగా చూడాలన్నదే ధ్యేయంగా కేంద్రం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలను రంగంలోకి దింపి మావోయిస్టుల కోసం జల్లెడపడుతుంది. కొందరు లొంగుబాటు కాగా చాలామంది ప్రాణాలు కోల్పోయారు. కంధమాల్ ప్రాంతానికి సమీపంలోనే జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వారిలో రాయగడ్ ఏరియా కమిటికి చెందిన భారి అలియాస్ రాకేష్, అమృత్ అనే మరో దళసభ్యుడుగా గుర్తించారు. మొత్తం రెండు వెర్వేరు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో భారీ ఎత్తున బలగాలను మోహరించి గాలింపు చేపడుతున్నారు. ఈ ఆపరేషన్‌ను ఒరిస్సా డిజి ఆపరేషన్స్ అఖిలేశ్వర్ సింగ్, కంధమాల్ యస్.పి. పర్యావేక్షిస్తున్నారు.



పండిట్ మదన్ మోహన్ మాలవ్య జయంతి సందర్భంగా గురువారం న్యూఢిల్లీలో ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్

# కరెంటుకోతలతో విసుగుచెందిన ఎమ్మెల్యే

## ఏకంగా విద్యుత్ అధికారుల ఇళ్లకే కరెంట్ కట్‌చేసి నిరసన

**హరిద్వార్, డిసెంబరు 25:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్ జిల్లాలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. వరుసగా కరెంటు కోతలతో విగుసు చెందిన ఓ ఎమ్మెల్యే ఏకంగా విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ శాఖకు చెందిన ముగ్గురు అధికారుల ఇళ్లకు కరెంటు సరఫరా నిలిపివేశారు. జిల్లాలోని జాబ్రేడా కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర జాతి ఈ చర్యకు పాల్పడ్డారు. ఆ ప్రాంతంలో వరుస విద్యుత్ కోతలపై ఎమ్మెల్యే తన మద్దతుదారులతో కలిసినిరసన తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం ఎక్కి మొదట బోట్ క్లబ్‌లోని సూపరింటెండెంట్ ఇంజినీర్ వివేక్‌రాజ్‌పుత్ అధికారిక నివాసానికి కనెక్షన్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత చీఫ్ ఇంజినీర్ అనుపమ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వినోద్ పాండే అధికారిక నివాసాలకు కూడా కరెంట్ కనెక్షన్ కట్ చేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా నిరంతరం కరెంటు పోతోందన్నారు. రోజుకు 5నుంచి 6గంటలు పవర్ కట్ చేస్తున్నారన్నారు. దీంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్యేపై కేసు నమోదైంది.

# డ్రగ్స్‌కు బానిసై సరిహద్దు దాటిన చండీగఢ్ రెజ్లర్!

**చండీగఢ్, డిసెంబరు 25:** డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తి సరిహద్దు దాటడంతో పాకిస్థాన్ రేంజర్లు అతడ్ని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తమ కుమారుడి విడుదలకు సహాయం చేయాలని అతడి కుటుంబం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భోయ్‌పూర్ గ్రామానికి చెందిన శరణ్‌జిత్ సింగ్ పదేళ్లుగా రెజ్లర్‌గా ఉన్నాడు. అయితే 2024 నుంచి మాదకద్రవ్యాలకు బానిస అయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు, ఇతరులతో తరచుగా గొడవ పడేవాడు. గత నవంబర్ 2న సాయంత్రం వేళ శరణ్‌జిత్ సింగ్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే పాకిస్థాన్ సరిహద్దు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖేమ్కరన్ వద్ద ఫ్రెండ్ మన్దీప్ అతడ్ని వదిలి వెళ్ళాడు. శరణ్‌జిత్ ఇంటికి తిరిగి రావకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. స్నేహితుడు మన్దీప్‌ను ఆరా తీయగా చాలా రోజులు అతడు అబద్ధం చెప్పాడు. ఈ నేపథ్యంలో నవంబర్ 7న మిస్సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) శరణ్‌జిత్ గురించి పాకిస్థాన్‌ను సమాచారం కోరింది. అతడు సరిహద్దు దాటడంతో పాక్ రేంజర్లు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. నవంబర్ 21న శరణ్‌జిత్ చేతికి సంకెళ్లు వేసిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇది తెలుసుకుని అతడి కుటుంబం షాక్ అయ్యింది. తమ కుమారుడ్ని విడిపించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అయితే ఒక ఘర్షణకు సంబంధించి శరణ్‌జిత్‌పై తొలి కేసు నమోదైనట్లు పోలీస్ అధికారి తెలిపారు. అరెస్టైన అతడు అక్టోబర్ 17న జైలు నుంచి విడుదలైనట్లు వెల్లడించారు.

# ఎమ్మెల్యేల కొనుగోలు కేసు!

>> ప్రభాకర్‌రావు ఏం చెప్పారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అనేక ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సమాధానం చెప్పనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పెన్ డ్రైవ్‌ను సిట్ అధికారులు కీలక ఆధారంగా భావించారు. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన కాలంలో పెన్ డ్రైవ్‌లో ట్యాపింగ్ వివరాలు స్టోర్ చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ పెన్ డ్రైవ్ డేటాను ప్రభాకర్ రావు ముందు పెట్టి సిట్ విచారించింది. అయితే 6 వేల ఫోన్ నెంబర్లు ఉన్నప్పటికీ పెన్‌డ్రైవ్‌పై ప్రభాకర్ రావు ఎలాంటి జవాబు ఇచ్చారని ఆసక్తిగా మారింది. మొత్తం 14 రోజుల సుదీర్ఘ విచారణలో ప్రభాకర్‌రావు ఏం చెప్పారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పనట్లు తెలుస్తోంది. ఈ కేసులో పూర్తి నివేదికను శుక్రవారం సుప్రీంకోర్టులో సిట్ సమర్పించనుంది. ఈ కేసుకు సంబంధించి పెన్ డ్రైవ్‌ను సిట్ అధికారులు కీలక ఆధారంగా భావించారు. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన కాలంలో పెన్ డ్రైవ్‌లో ట్యాపింగ్ వివరాలు స్టోర్ చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ పెన్ డ్రైవ్ డేటాను ప్రభాకర్ రావు ముందు పెట్టి మరీ విచారించింది.

# రవాణా శాఖలో 198 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

## 84 ట్రాఫిక్ సూపర్ వైజర్, 114 మెకానికల్ సూపర్‌వైజర్ పోస్టులు

## 30 నుంచి జనవరి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 25:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ ఆర్‌టిసి)లో ఉద్యోగాల భర్తీ కోసం మరో నోటిఫికేషన్ జారీ అయింది. రవాణా శాఖలో 198 పోస్టులను తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ గురువారం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు జారీ చేసింది. ఇందులో 84 ట్రాఫిక్ సూపర్ వైజర్ ట్రెయినీ పోస్టులు ఉండగా.. 114 మెకానికల్ సూపర్ వైజర్ ట్రెయినీ పోస్టులు ఉన్నాయి. వీటికి సంబంధించి ఈ నెల 30 నుంచి జనవరి 20 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ రెండు పోస్టుల వేతనం రూ. 27,080 నుంచి రూ. 81,400 వరకు ఉండనున్నట్టు నోటిఫికేషన్‌లో వెల్లడించారు. రెండు పోస్టులకి కూడా తెలంగాణకి చెందిన స్థానికత కలిగి ఉన్న ఎస్‌సి, ఎస్‌సిలకి రూ. 400 ఫీజుగా నిర్ణయించగా.. ఇతరులకు రూ. 800గా నిర్ణయించారు. ఒక్కో పోస్టుకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

# ట్రంప్ మద్దతుతో హోండురాస్ అధ్యక్షుడుగా నార్సీ ఆస్ఫ్యూరా ఎన్నిక!

**తెగూచికల్ప(హోండురాస్), డిసెంబరు 25:** ఉత్తర అమెరికా దేశం హోండురాస్‌లో ఎట్టకేలకు అమెరికా అధ్యక్షుడు మద్దతు పొందిన నార్సీ ఆస్ఫ్యూరా గెలిచారు. సాంకేతికసమస్యలు అవినీతి మోసం జరిగిందన్న ఆరోపణలపై ఫలితాలు జాప్యం జరిగిన హోండురాస్‌లో ఎట్టకేలకు కన్సర్వేటివ్ నేషనల్ పార్టీ అబ్యర్థి 40.3శాతం ఓట్లుసాధించినట్లు నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్‌ప్రకటించింది. సెంటర్‌రైట్ లిబరల్‌పార్టీ అభ్యర్థి సల్వాడార్ నస్రల్లా కేవలం 39.5 శాతం ఓట్లుమాత్రమే సాధించగలిగారు. విజయం సాధించినట్లుప్రకటన వెలువడిన వెంటనే అస్ఫ్యూరా సోషల్‌మీడియాలో ప్రజలారా నేను పాలన అందించేందుకు సిద్ధంగా ఉన్నాను. మిమ్మల్ని ఎక్కడా తలొంచనీయను అన్న సందేశంతో పోస్టుచేసారు. విపక్షనేత నస్రల్లా మాత్రం ఈఎన్నికలఫలితాలను తాము అంగీకరించలేమని, కొన్ని తొలగింపులతో చట్టవిరుద్ధంగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయని ఆరోపించారు. అయితే తన మద్దతుదారులంతా శాంతియుతంగా ఉండాలని ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దని ఆయన పిలుపునిచ్చారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మాట్లాడుతూ హోండురా ఫలితాలను అన్ని పార్టీలు గౌరవించాలని దానితో హోండురాస్‌లో అధికార బదలాయింపు శాంతియుతంగా జరుగుతుందని పిలుపునిచ్చారు. పోలింగ్ నవంబరు 30వ తేదీనే జరిగినా లెక్కింపులో మాత్రం రెండుపర్యాయాలు జాప్యం జరిగింది. సాంకేతిక అవాంతరాలు తలెత్తడంతో వాయిదాపడ్డాయి. ఎన్నికల సంఘం సిఎన్ఇ అనా పావోలా హాల్ ఈ ఎన్నికల లెక్కింపువ్యవస్థను, పట్టికలు వేసేందుకు ప్రైవేటు కంపెనీకి అప్పగించడాన్ని విమర్శించారు. ఈ సంస్థ ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా మెయింటెనెన్స్‌కు వెళ్లిందని ఆమె చెప్పారు. హోండురాస్ కాంగ్రెస్ అధ్యక్షుడు లూయిస్ రెడోండో ఈఫలితాలు పూర్తిగా అక్రమంగా ఉన్నాయని, చట్టవిరుద్ధమని ఆరోపించారు. ప్రస్తుత అధ్యక్షుడు గియోమారా క్యాస్ట్రో మాట్లాడుతూ గతనెలనుంచే దేశంలో ఎన్నికల దోపిడీ జరుగుతోందని ట్రంప్ జోక్యంతోనే ఎన్నికల్లో విపరీతమైన అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

# డిటిసి అవినీతిలో రూ. 200 కోట్లు!

## ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసు

## మహబూబ్‌నగర్ డిటిసి కిషన్ భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు

## ఆయనపై కేసు నమోదు చేసిన ఎసిబి

**నారాయణఖేడ్, డిసెంబరు 25, ప్రభాతవార్త :** నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట్ మండలం బల్కం చల్క తాండ సొంత గ్రామంలో 31 ఎకరాల వ్యవసాయ భూమి గుర్తింపుఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తోంది. కేసు నమోదు చేసి దాడులు నిర్వహించి ఆస్తుల చిట్టా బయటకు తీస్తోంది. ఇందులో భాగంగా మహబూబ్నగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ కిషన్ భారీగా ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఇళ్లు, కార్యాలయాలు సహా స్వగ్రామం నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట మండలం బల్కంచల్క తండాలో దాడులు చేశారు. 15 బృందాలుగా ఏర్పడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సికింద్రాబాద్‌లోని కిషన్ ఇళ్లు, కార్యాలయాలు, బంధువులు, స్నేహితుల సహా మొత్తం 12 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేశారు.మొత్తం రూ.12.72 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు లభ్యమయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ వందల కోట్లు ఉంటుందని అంచనా. ఏసీబీ చరిత్రలో ఇంత భారీ మొత్తంలో అక్రమాస్తులు బహిర్గతం కావడం ఇదే తొలిసారి. ఆ మధ్య నీటిపారుదలశాఖ ఇంజినీర్ల అక్రమాస్తులను ఏసీబీ గుర్తించినా, వాటన్నిటి కంటే కిషన్ ఆస్తిపాస్తులే అధికమని అంచనా.సోదాల సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయమే బోయిన్‌పల్లిలోని కిషన్ ఇంటి తలుపుతట్టారు. విశ్వసనీయ సమాచారంమేరకు. ఆ సమయంలో కిషన్ కొంతసేపు స్నానాల గదిలోనే ఉండిపోయారు. బయటికి వచ్చాక సోదాలు ప్రారంభించగా ఆస్తుల పత్రాలేవీ లభ్యం కాకపోవడంతో ఏసీబీ అధికారులకు అనుమానమొచ్చి లోతుగా ఆరా తీశారు. కిషన్ సెల్‌ఫోన్‌లో బంగారు ఆభరణాలకు సంబంధించిన ఓ పత్రం లభ్యమైంది. సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లోని ఓ దుకాణానిది కావడంతో విచారించారు.

కిషన్ ముందు రోజే బంగారు ఆభరణాల్ని తన దుకాణానికి తెచ్చి అప్పగించారని ఆ వ్యాపారి చెప్పడంతో ఏసీబీ అధికారులు వాటిని తెప్పించారు. అలాగే ముందు రోజు రాత్రే ఓ బంధువు ఇంటికి వెళ్లి ఆస్తుల పత్రాలు అప్పగించినట్లు విచారణలో తేలడంతో వాటిని తెప్పించి స్వాధీనం చేసుకున్నారు.


**మొదటి నుంచి అవినీతి ఆరోపణలే:**

1994లో అసిస్టెంట్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా రవాణా శాఖలో అడుగుపెట్టిన కిషన్‌పై మొదటి నుంచి అవినీతి ఆరోపణలున్నాయి. బోధన్‌లో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అక్కడే మద్నూర్‌లో చెక్‌పోస్ట్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించారు. నిజామాబాద్‌లోనూ ఎంవీఐగా పనిచేశారు. తాజా సోదాల్లో నిజామాబాద్‌లో అక్రమాస్తులు బహిర్గతం కావడంతో తొలినాళ్లలోనే వాటిని కూడబెట్టినట్లు బహిర్గతమైంది. ఆ తర్వాత మేడ్చల్, మెహిదీపట్నం ఆర్టీవోగా కిషన్ పని చేశారు. ఏడాదిక్రితమే మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడాబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆయనపై కేసు నమోదు చేశారు. నిజామాబాద్‌లోని లహరి ఇంటర్నేషనల్ హోటల్‌లో 50శాతం వాటా, 3వేల చదరపు గజాల విస్తీర్ణంలోని రాయల్‌ఓక్ ఫర్నిచర్‌షాప్‌లో ఓనర్‌షిప్, అశోకటౌన్‌షిప్‌లో 2 ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో 31 ఎకరాల వ్యవసాయభూమి, 4వేల గజాల్లో పాలీహౌజ్, నిజామాబాద్ మున్సిపాలిటి పరిధిలో 10 ఎకరాల వాణిజ్య స్థలం ఉన్నట్లు నిర్ధారించారు. కిషన్ బ్యాంకు ఖాతాలో రూ. 1.37 కోట్లు, బ్యాంకు లాకర్లలో కిలోకు పైగా బంగారం, రెండు కార్లు ఉన్నట్లు తేల్చారు. కిషన్ కూడబెట్టిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లపైగానే ఉంటుందని అంచనాకి వచ్చారు. సోదాల అనంతరం ఆయన్ను అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

**10 నెలల వ్యవధిలో ఇద్దరు**

**జిల్లా స్థాయి అధికారులపై ఎసిబి కేసులు**

ప్రజల ప్రాణాలకు, రహదారి భద్రతకు అత్యంత కీలకమైన రవాణాశాఖలో యథేచ్ఛగా అవినీతి దందా సాగుతోంది. 10 నెలల వ్యవధిలో ఇద్దరు జిల్లా స్థాయి అధికారులపై ఏసీబీ కేసులు నమోదవడం అవినీతి తీవ్రతకు అద్దం పడుతోంది. డ్రైవింగ్ లైసెన్స్, బండి రిజిస్ట్రేషన్, యాజమాన్య బదిలీ, వాహనం ఫిట్‌నెస్ ఇలా ఏ పనికావాలన్న రవాణాశాఖ కార్యాలయాల్లో అధికారిక ఛార్జీలతో పాటు అదనంగా ఇవ్వాల్సిందే. ప్రతి సేవకి, ఫైల్‌కి ఒక రేటు ఉంటుంది. ఆ మేరకు కోడ్ ఉంటుంది. అందులో ఏజెంట్ ఎవరు, వచ్చే లంచం ఎంతన్న వివరాలుంటాయి.కోడ్ ఉన్న దరఖాస్తులైతే నిమిషాల్లో పనైపోతుంది. ఏజెంట్ ద్వారా కాకుండా నేరుగా వెళ్తే సిబ్బంది కొర్రీలపై కొర్రీలు వేస్తూ రోజుల తరబడి తిప్పించుకుంటారు. ఈ అక్రమాల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ముఖ్యంగా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌లు కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. లంచాలు డిమాండ్ చేసే ప్రభుత్వ అధికారులపై వాట్సప్ నెంబర్ 9440446106 కు ప్రజలు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.



## కంబోడియాలో విష్ణుమూర్తి విగ్రహం కూల్చివేత!

**ఫ్నోమ్‌ఫెన్, డిసెంబరు 25:** థాయిలాండ్, కంబోడియా మధ్య సరిహద్దు వివాదం కొనసాగుతుండగానే మరో కొత్త వివాదం రగిలింది. తమ భూభాగంలోని విష్ణుమూర్తి విగ్రహాన్ని థాయిలాండ్ ధ్వంసం చేసిందని కంబోడియా తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ అంశం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. వివాదాస్పద అన్ సెస్ ప్రాంతంలో ఉన్న విష్ణుమూర్తి విగ్రహాన్ని థాయిలాండ్ కూల్చివేసిందని కంబోడియాలోని ప్రీ విహార్ ప్రతినిధి లిమ్ చన్‌పన్హా ఆరోపించారు. 2014లో నిర్మించిన ఈ విగ్రహం కంబోడియా భూభాగంలోనే ఉందని, థాయిలాండ్ సరిహద్దుకు కేవలం 100 మీటర్ల దూరంలో సోమవారం ఈ ధ్వంసం జరిగిందని ఆయన వివరించారు. హిందువులు, బౌద్ధులు పూజించే పురాతన ఆలయాలు, విగ్రహాలను కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు.

విగ్రహాన్ని బుల్డోజర్ (బ్యాక్‌హో లోడర్) తో కూల్చివేస్తున్న దృశ్యాలున్న వీడియో ఒకటి వైరల్ అయింది. ఈ వీడియోను కృత్రిమ మేధస్సు (ఎఐ) తో ఎడిట్ చేయలేదని ఏఎఫ్‌పీ తన నివేదికలో పేర్కొంది. ఈ ఆరోపణలపై థాయిలాండ్ అధికారులు ఇంకా స్పందించలేదు. ఘటనపై భారత్ కూడా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదని బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించడంపై సైనిక అధికారులు చర్చలు ప్రారంభించారు. గత 16 రోజులుగా జరిగిన భీకర ఘర్షణల్లో 86 మంది మరణించడంతో ఈ చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి



## మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సినీ డైరెక్టర్, ఎంపి విజయేంద్రప్రసాద్ భేటీ

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** ప్రముఖ సినీ రచయిత, దర్శకుడు, రాజ్యసభ సభ్యులు(ఎంపి) విజయేంద్ర ప్రసాద్ గురువారం హైదరాబాద్‌లో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిశారు. కేవలం మర్యాద పూర్వకంగానే కలిసినట్టు మంత్రి కార్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధిపై తన ఆలోచనలను మంత్రి పొన్నం డైరక్టర్, ఎంపి విజయేంద్ర ప్రసాద్ పంచుకున్నారు.

## తెలంగాణలో ఇద్దరు మంత్రులు

# వేల కోట్లు కూడబెట్టారు

వారు జైలుకెళ్లడం ఖాయం: బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

కాళేశ్వరం స్కామ్‌ను తప్పించుకునేందుకు కెసిఆర్ కృష్ణా జలాల అంశం తెరపైకి తెస్తున్నారు

కెసిఆర్‌పై సిఎం రేవంత్ మాట్లాడిన భాష సరికాదు, భాషపై పునరాలోచన చేయాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 25:** తెలంగాణలో ఇద్దరు మంత్రులు రూ. వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. వారిపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందన్నారు. ఎప్పటికైనా ఆ ఇద్దరు రాష్ట్రమంత్రులు జైలుకెళ్లడం ఖాయమని సంచలన కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం వద్ద అధారాలు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది మంత్రులు వేల కోట్ల భూములను అమ్ముకుంటున్నారని.. దీన్ని ఎప్పటికైనా బయటపెడతామని హెచ్చరించారు. ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులు జైలుకెళ్లడం ఖాయమని ఆయన చెప్పారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేస్తూ పలు విషయాలపై స్పందించారు. కాళేశ్వరం స్కామ్ నుంచి తప్పించుకోవడానికే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని కొత్తగా తెరమీదకు తెచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం లాగే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. అప్పుడు పథకాల అమలుపై ప్రజలు నిలదీస్తారని కేసీఆర్ కొత్త అంశాలను తెరపైకి తెచ్చేవారని.. ఇప్పుడు రేవంత్ సైతం అదే డ్రామా ఆడుతున్నారని కేంద్రమంత్రి



విమర్శించారు. కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దృష్టి మళ్లించడానికి కృష్ణా జలాల అంశం కేసీఆర్ లేవనెత్తుతున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా. తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించా అని చెప్పారు.

ఇక కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్ మాట్లాడిని భాష సరికాదన్నారు. కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష కరెక్ట్ కాదు. మనం మాట్లాడే భాష ఎదుటి వ్యక్తులను కించపరిచే విధంగా ఉండకూడదన్నారు. సీఎం తన భాషపై పునరాలోచన చేయాలి. ప్రతీ వ్యక్తి సుఖ సంతోషాలతో ఉండాలని హిందూ ధర్మం కోరుకుంటుందన్నారు. కేసీఆర్ కుమారుడు కెటిఆర్ అహంకారం తలకెకినట్టు మాట్లాడుతారు. గతంలో కేసీఆర్ మాట్లాడితే మేము ఖండించామన్నారు. 'తెలంగాణకు నంబర్ వన్ ద్రోహి కేసీఆర్. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ ఏమి చేశారో ఆధారాలతో సహా బయట పెట్టింది ముందు నేనే. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకి ఒప్పందం చేసుకున్నారు. ముడుపుల కోసం 575 టీఎంసీలు అడగలేదు. కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి నూట్లాడే హక్కు లేదన్నారు. అప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నేనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించానని గుర్తు చేశారు. కాళేశ్వరం స్కాల నుంచి దృష్టి మరల్చేందుకు కేసీఆర్ కృష్ణ జలాలు ఇష్యూ తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్, కేసీఆర్ మధ్య ఏం ఒప్పందం జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజన్ సర్కార్తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## బండి సంజయ్!

# నీతులు ఆ దద్దమ్మలకు చెప్పు

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఒకరిని ఒకరు గౌరవించుకోవాలని బండి సంజయ్ అంటున్నారని, నీతులు ఆ దద్దమ్మలకు చెప్పాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ దయ్యాలు వేదాలు వల్లించినట్లు హరీశ్‌రావు వ్యవహార శైలి ఉందని దుయ్యబట్టారు. నీతులు ఎదుటి వారికి మాకు కాదు అన్నట్లు హరీష్ రావు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.మీ మామ కెసిఆర్ తిట్ల పురాణం,బూతులు ఒకసారి చూడు హరీష్ రావు అని ఆయన అన్నారు. ఉద్యమం సమయంలో నోటికి వచ్చిట్లు కెసిఆర్ మాట్లాడారని గుర్తుచేశారు. బూతులు మాట్లాడే పేటెంట్ హక్కులు కెసిఆర్‌కు వచ్చాయా అని ప్రశ్నించారు. అసలు రాజకీయాల్లో తిట్ల పురాణం మొదలుపెట్టిందే కెసిఆర్‌కదా అని అన్నారు.

రాజకీయంగా మాట్లాడితే రేవంత్ రెడ్డి రాజకీయాలు మాట్లాడతారు కెసిఆర్ తిట్ల పురాణం మాట్లాడితే రేవంత్ రెడ్డి మీకంటే ఎక్కువ తిట్లు తిట్టగలరని ఆయన అన్నారు. కెసిఆర్ ఓడిపోయిన తర్వాత రెండు ఏళ్ల తర్వాత బయటకు వచ్చి తోలు తీస్తామంటే చూస్తూ ఊరుకోవాలా? సిఎం స్థాయి వ్యక్తిని తోలు తీస్తామంటే మర్యాదగా మాట్లాడాలా...? అని ఆయన ప్రశ్నించారు. చెట్టుకు కట్టివేయాలు,లాగులో తొండలు విడవాలి అని హరీష్ రావు మాట్లాడుతున్నారనీ, హరీష్ రావు వేదాంతాలు,పాండిత్యం వల్లిస్తున్నారనీ ఆయన కెటిఆర్ చిన్న,పెద్ద తేడా లేకుండా మాట్లాడుతున్నారనీ అన్నారు.

ఐటీ,అయినా ఇరిగేషన్ అయినా నాకు తప్ప ఎవరికి తెలియదని కెటిఆర్ భావిస్తున్నారనీఆయన మండిపడ్డారు. హరీష్ రావు నీతులు కెసిఆర్‌కెటిఆర్‌కు చెప్పాలనీ కోఆరు. మీరు పద్ధతిగా మాట్లాడితే రేవంత్ రెడ్డి పద్ధతిగా సమాధానం చెప్తారు అసెంబ్లీకి రావాలినీళ్లు,నిజాలపై అసెంబ్లీలో చర్చ చేద్దామని అన్నారు మీ పదేళ్ల పాలనలో జరిగిన అవకతవకలు,అవినీతిపై చర్చ చేద్దామని అన్నారు. మీరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మీకు రేవంత్ రెడ్డి అదే స్థాయిలో సమాధానం చెప్తారని ఆయన తెలిపారు. రేవంత్ రెడ్డి ఛాలెంజ్ చేసి మిమ్మల్ని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు.2029 అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని రేవంత్ రెడ్డి ఇంటికి పంపిస్తారని ఆయన జోస్యం చెప్పారు. మీరు మారండి ప్రతిపక్ష నాయకులుగా సలహాలు, సూచనలు ఇవ్వండని కోరారు.



# హసీనా పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం

మరో హిందూ యువకిడిపై దాడి.. మృతి

## హసీనా స్థానం నుంచి హిందూ నేత పోటీకి

**ఢాకా, డిసెంబరు 25:** నెల రోజుల్లో ఎన్నికలు జరగనున్న వేళ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ప్రభుత్వంపై నిషేధం ప్రకటించింది. ప్రజాగ్రహానికి తలొగ్గి దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ పై నిషేధం నిర్ణయంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం అవామీ లీగ్‌పార్టీ కోల్పోయింది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక చైర్మన్ తారిక్ రెహమాన్ దాదాపు 17 ఏండ్ల తర్వాత స్వదేశానికి తిరిగొచ్చిన వేళ ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది.మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక చైర్మన్ తారిక్ రెహమాన్ ఎట్టకేలకు స్వదేశంలో అడుగుపెట్టారు. దాదాపు 17 ఏండ్ల తర్వాత ఇవాళ ఢాకా చేరుకున్నారు. రెహమాన్, అతని కుటుంబ సభ్యులకు ఢాకా విమానాశ్రయంలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ మద్దతుదారులు ఘనంగా స్వాగతం పలికారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ప్రధాని రేసులో తారిక్ ముందు వరుసలో ఉన్నారు.

**మరో హిందూ యువకుడిపై దాడి-మృతి**

అల్లర్లతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో మరో హిందూ యువకుడిని కొట్టి చంపారు. దోపిడీలకు పాల్పడుతున్నట్లు దేశ పోలీసులు ఆరోపించారు. దేశంలోని రాజ్‌బరి జిల్లాలో పంగ్షా గ్రామస్తుడు 29 ఏళ్ల అమృత్ మండల్ అలియాస్‌సామ్రాట్‌క్రిమినల్ ముఠా నడుపుతున్నాడని, దోపిడీలకు పాల్పడుతున్నట్లు బంగ్లాపోలీసులు ఆరోపించారు. ముందురోజు రాత్రి 11 గంటలకు షాహిదుల్ ఇస్లాం ఇంటికి వెళ్లాని, కుటుంబం దొంగలని అరవడంతో స్థానికులు సామ్రాట్‌పై దాడిచేసారని, తీవ్రంగా గాయపడిన సామ్రాట్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు ప్రకటించారు. భారత్‌లో అజ్ఞాతంలో ఉన్న సామ్రాట్ ఇటీవలే గ్రామానికి వచ్చాడని పోలీసులు చెపుతున్నారు. దీనితో అల్లరిమూకల దాడుల్లో మృతిచెందిన వారి సంఖ్య మూడుకు పెరిగింది. మెమెన్‌సింగ్‌లోని భలూకాలో 27 ఏళ్ల హిందూ వస్త్రకార్మికుడు దీపుచంద్రదాస్‌ను కొట్టి చంపిన సంగతి తెలిసిందే.

**హసీనా స్థానంలో హిందూ నేత పోటీ!**

ఇదిలా ఉంటే ఎన్నికలు జరగనున్న క్రమంలో మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రాతినిధ్యం వహించిన గోపాల్‌గంజ్-3 స్థానంనుంచి ఒక హిందూ నాయకుడు పోటీకి దిగుతున్నారు. న్యాయవాది అయిన గోవింద చంద్ర ప్రమాణిక్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. అక్కడమ ఐనార్టీలపై దాడులు జరుగుతున్నవేళ కీలకస్థానంనుంచి హిందూ వ్యక్తిపోటీలోకి రావడం విశేషం. బంగ్లాదేశ్ జాతీయ హిందూ మెహజోతే కీలకసభ్యుడయిన ప్రామాణిక్ తాను సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తానని ప్రకటించారు. దేశంలోప్రస్తుతం హిందూ జనాభా 10శాతం ఉందని, మతమార్పిడిలు, విదేశాలకు వలసలు పోతుండటంతో తగ్గిందని ప్రామాణిక్ చెపుతున్నారు. మైనార్టీలే లక్ష్యంగా జరుగుతున్న దాడులను ప్రతిఘటించి సుస్థిర శాంతిస్థాపన నెలకొల్పే లక్ష్యంతోనే తాను ఎన్నికల బరిలోకి వస్తున్నట్లు ప్రమానిక్‌తెలిపారు.

# శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లాలి

## ప్రపంచ ప్రజలకు పోప్ లియో క్రిస్మస్ సందేశం

**డెస్‌మొనిస్, డిసెంబరు 25:** ప్రపంచ ప్రజలంతా శాంతిసౌఖ్యాలతోసుభిక్షంగా కొనసాగాలని ప్రముఖ క్రైస్తవ మతపెద్ద పోప్ లియో ఆకాంక్షించారు. క్రిస్మస్ అంటేనే ఒక నమ్మకం, ధాతృత్వం, భవిష్యత్తు ఆశలకు వేదిక అని క్రీస్తుజన్మించిన రోజును ప్రపంచ ప్రజలంతా అత్యంత భక్తిప్రపత్తులతో కొనసాగుతారని ఆయన వ్యాఖ్యలు చేసారు. అంతర్జాతీయప్రస్తుత వ్యవహారాలు, దోరణుల జోలికి వెళ్లకుండా క్రైస్తవ మతగురువు కేవలంక్రిస్మస్ ప్రాశస్త్యాన్ని వివరించేందుకు మాత్రమే తన సందేశంలోప్రాధాన్యతనిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వర్షం వస్తుండటంతో సెయింట్ బాసిలికానుంచి ఇచ్చే సందేశానికి కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. దేశప్రజలకు ఆయన డిజిటల్‌ప్రత్యక్షప్రసారాలద్వారా సందేశం ఇచ్చారు. అత్యున్నతస్థాయి చర్చిల ప్రముఖులు, దౌత్య వేత్తలు సుమారు ఆరువేలమందికిపైగా మతపరమైన నమ్మకస్తులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు జన్మదినం అయిన డిసెంబరు 25ను ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఆధ్యాత్మిక పండుగగా జరుపుకోవడంతోపాటు ఏసుక్రీస్తు బోధనలను స్మరించుకునేందుకు వేదిక అవుతుందని పోప్ అభిప్రాయపడ్డారు. అలాగేక్రిస్మస్ సందర్భంగా ఆయన "ఊర్బి ఎట్ ఓర్బి" ఆశీస్సులు కూడా బాసిలికా బాల్కనీనుంచి క్రైస్తవ ప్రజలకు అందించారు. ప్రపంచ ప్రజల మంచికోసం ప్రార్థనలు చేయాలని, ప్రజలందరూ ఒక్కరోజయినా శాంతిని పరిరక్షించేందుకు పూనుకోవడం ఎంతో మంచిదని ఆయన సూచించారు. పోప్ లియో బాద్యతలు స్వీకరించిన తర్వాత చేసిన ఒకే ఒక్క విజ్ఞప్తిని రష్యా తిరస్కరించడాన్ని ఆయన విచారకరమన్నారు. ఉక్రెయిన్‌లోశాంతిస్థాపన జరగాలని అంతకు ముందు పోప్ లియో విజ్ఞప్తిచేసిన సంగతి తెలిసిందే.





## జలాంతర్గాముల నుంచి ప్రయోగించే కె-క్షిపణి పరీక్షలు సక్సెస్

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:** జలాంతర్గామి నుంచి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షలు చేసింది. అణ్వాయుధాలను మోసుకెళ్లగల కె-4 క్షిపణిని ప్రయోగించారు. ఈ క్షిపణిని అరిహాంత్‌శ్రేణి జలాంతర్గామినుంచి ప్రయోగించారు. గోప్యతకోసం ముందస్తుప్రకటనలు కూడా చేయకుండా నోటమ్ కూడా రద్దుచేసారు. ఈ ప్రాంతంలో చైనా నిఘా నౌకలు ఉన్నందున గోప్యతకు ప్రాధాన్యతనిచ్చినట్లు తెలిపారు. ఈ పరీక్ష భారత సముద్ర ఆధారిత అణుత్రయాన్ని మరింత బలోపేతంచేస్తుంది. దాడుల సామర్థ్యం కూడా మరింతగా నిర్ధారణచేస్తుంది. ఈ క్షిపణి శత్రువు మొదటి దాడి తర్వాత ప్రతీకార చర్యకు కూడా పనిచేస్తుందని డిఆర్‌డిఓ ప్రకటించింది. ఈ కె-4 క్షిపణి అత్యంత ముఖ్యమైన లక్షణం స్వదేశీ కె సిరీస్ క్షిపణి కావడం. అరిహాంత్ శ్రేణి అణు జలాంతర్గాములకోసం ఈ క్షిపణిని రూపొందించారు. సుమారు 3500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను కూడా ఛేదిస్తుంది. పొడవు సుమారు 12 మీటర్లు, దాని వ్యాసం 1.3 మీటర్లు. ఈ క్షిపణి బరువు 17-20 టన్నులవరకూ ఉంటుంది. రెండు టన్నులవరకూ పేలోడ్ సామర్థ్యంతో ఉంటుంది. నీటి అడుగున ప్రయోగించగలిగే సామర్థ్యం 3డి టెక్నాలజీ, బాలిస్టిక్‌క్షిసణి రక్షణ వ్యవస్థలనుంచి తప్పించుకునే సామర్థ్యంతో ఈకె4 క్షిపణి ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఎపిలో నియంతపాలన నడుస్తోంది

చంద్రబాబుపై కొట్టేసిన కేసులపై ఉన్నత న్యాయస్థానంలో పోరాడుతాం

వైఎస్సార్‌సిపి ప్రధాన కార్యదర్శి(లీగల్) పొన్నవోలు సుధాకర్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 25,ప్రభాతవార్త:**ఎపిలో నియంత పాలన నడుస్తోందని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి(లీగల్) పొన్నవోలు సుధాకర్ రెడ్డి అన్నారు. కూటమి పాలనలో వ్యవస్థలు కీలుబొమ్మలుగా మారాయని ఆరోపించారు. చంద్రబాబు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ కేసులు కొట్టివేయించుకుంటున్నారని చంద్రబాబుపై కొట్టివేసిన కేసులన్నింటిపై ఉన్నత న్యాయస్థానంలో కొట్లాడుతాం అని హెచ్చరించారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో సుధాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "చంద్రబాబు ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబుపై ఉన్న కేసులన్నీ ఒక్క నెలలో ఎలా కొట్టివేశారో అర్థం కావడం లేదు. కేసు పెట్టిన వ్యవస్థలే చంద్రబాబు నీతిమంతుడు అని క్లీన్ చిట్ ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. చంద్రబాబు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. సీఐడీ, సిట్ సాక్షాదారాలు లేవని చంద్రబాబుపై ఉన్న కేసులు కొట్టివేశారు.

స్కిల్ డెవలప్మెంట్ కేసులో వందల మందిని విచారించి ఆధారాలు సేకరించారు. ఆ ఆధారాలు అన్ని ఏమయ్యాయి?. ఏపీలో దొంగా పోలీసు ఆట నడుస్తుంది.. దొంగలు వారే.. న్యాయ నిర్ణేతలు వారే.. కేసులో స్పష్టమైన ఆధారాలు ఉన్నాయనే కోర్టు చంద్రబాబును జైలులో వేసింది. మరి ఇప్పుడు ఆధారాలు ఏమయ్యాయి?. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులు భవిష్యత్‌లో దోషులుగా నిలబడక తప్పదు. చంద్రబాబుపై కొట్టివేసిన కేసులపై మళ్లీ ఉన్నత న్యాయస్థానాల్లో కొట్లాడుతాం" అని వ్యాఖ్యలు చేశారు.

వార్త


వివేకవంతుడికి, చురుకైన వ్యక్తికీ మధ్య ఒకే ఒక బేధం ఉంది. చురుకైన వ్యక్తికి ఏం మాట్లాడాలో తెలిస్తే, తెలివైన వ్యక్తికి చెప్పాలా చెప్పకూడదా అనే వివేకం ఉంటుంది.

-రోష్ షోకాల్డ్

# పటిష్ఠ వాణిజ్య బంధానికి మెరుగు!

భారతీయ ఆర్థిక చక్రంసజావుగా తిరగాలంటే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఏ)లు పటిష్టంగా ఉండాలి. భారతీయ ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. ఆయా దేశాలతో జరిగే ఒప్పందాలు పరస్పర ప్రయోజనకరంగా ఉంటాయి. ఏమైనా ఎవరితో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నా భారత పాలకులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికాతో 'ట్రేడ్ డీల్' ఆలస్యమవుతోంది. ఏ ఒప్పందమైనా ద్వైపాక్షికంగా ఐదేళ్లలో రెట్టింపు కావాలన్న ఆకాంక్షతో ముందుకెళ్తున్నాం. తాజాగా న్యూజిలాండ్ దేశంతో ఒప్పందం కుదిరింది. దాదాపు అమెరికా పెడుతున్న షరతులే పెట్టినా ముందుగా భారత్ ఆ అవగాహనలోని అంశాలపై అంగీకరించలేదు. పాడికి ఆధరువుగా ఉన్న న్యూజిలాండ్ భారత్‌కు తమ డెయిరీ ఉత్పత్తులను అంటకట్టాలని చూసినా ఒప్పుకోలేదు. అలా చేస్తే భారత్‌లోని పశు సంవర్ధకానికి చేటు తెచ్చినట్లే భావించడం వల్ల ఆ అంశం న్యూజిలాండ్ ఒప్పందాలలో చోటు చేసుకోలేదు. న్యూజిలాండ్ డెరీ ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేయడంలో దిట్ట.భారత్‌లో క్షీర సమృద్ధి, పశుపోషణ అధికంగా ఉన్నందువల్ల న్యూజిలాండ్ నుంచి పాల ఉత్పత్తులు అవసరం లేదు. అమెరికా ట్రేడ్ డీల్స్ ప్రతిపాదించిన సమయంలోనే ప్రధాని నరేంద్రమోడీ వారికి రైతు ప్రయోజనాలను భంగం కలిగించే ఎలాంటి అంశాలూ తమకు సమ్మతం కాదని, సాగు ఉత్పత్తులు కానీ, పశు సంవర్ధక అంశాలు కానీ భారత్ అంగీకరించదు. ఈ మధ్యకాలంలో భారత్, ఒమన్, బ్రిటన్‌లతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. తాజాగా న్యూజిలాండ్ ఒప్పందం ఈ దేశంతో జరిగిన అవగాహనలో భారత్ ఎలాంటి పరిస్థితుల్లోనూ తొట్రుపాటు పడలేదు. జపాన్, మలేసియా, దక్షిణ కొరియా, సింగపూర్‌లతో గతంలోనే అవగాహన కుదిరినా కొన్ని దేశాలతో తాజా ఆలోచనలకు లోబడి కొన్ని అంశాల విషయాలలో సవరించుకోవాల్సి ఉంది. న్యూజిలాండ్ ఒప్పందంలో ఔళి, తోలు, ఇంజినీరింగ్ వ్యవసాయ రంగాల్లో కార్మికుల అవసరం వారికే ఎక్కువగా ఉంటుంది. తద్వారా మనవారికి తగిన జీవనోపాధి లభిస్తుంది. ఈ ఒప్పందానికున్న ప్రత్యేకత ఏమిటంటే ఇకపై జరిగే అవగాహనలకు వీటిలోని విషయాలే మూల అంశాలుగా ఉంటాయి. ఆయా దేశాల్లోని ఉత్పత్తుల దిగుమతులు, మనదేశం నుంచి వెళ్లే దిగుమతుల విషయంలో కొన్ని మార్పులుంటే ఉంటాయి తప్ప స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు మౌలిక రూపం ఇదే అవుతుంది. భారత ప్రధాని మోడీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌లు నేరుగా సంభాషించుకుని ఈ అవగాహనకు రావడం విశేషం. ఇతరత్రా ఎలాంటి అభ్యంతరాలున్నా వాటిపై సమస్యలు తలెత్తే అవకాశం లేదు. భారతీయ విద్యార్థులకు దీర్ఘకాలిక వీసాలు లభిస్తాయి. న్యూజిలాండ్ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులు విరివిగా లభిస్తాయి. ఇరు దేశాల మధ్య సౌహార్ద్ర దౌత్య సంబంధాలు పటిష్టత, వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంటుంది. ఆ దేశానికి ఏటా వివిధ రంగాలకు చెందిన భారతీయులు ఐదువేల మందికి అవకాశం లభిస్తుంది. భవన నిర్మాణ రంగంలో, పాకశాస్త్ర ప్రావీణ్యం ఉన్న వారికి కూడా ప్రవేశం ఉంటుంది. వీటిలో కొన్నిటికి పూర్వమే కొంతమేర అవకాశం లభిస్తున్నా ఇప్పుడా అవకాశాలు విస్తృతపడతాయి. న్యూజిలాండ్ నుంచి ఉన్ని, బొగ్గు, కలపతోపాటు అవకాడో, వైన్, బ్లూ బెర్రీలు వంటి పలు ఉత్పత్తులు 95 శాతం టారిఫ్‌ను తక్షణమే తొలగిస్తుంది. ఈ రకపు వస్తువులు, ఫలాలు భారతీయులకు స్వదేశంలో తక్కువ రేటుకు దొరకుతాయి. అలాగే కివి, ఆపిల్, తేనె దిగుబడిని భారత్ స్వీకరిస్తుంది. వీటికి సంబంధించి సాగు చర్యలు నైపుణ్య సలహాలను భారత్ ఆహ్వానిస్తోంది. ఆయుష్, సంస్కృతి, మత్స్య, శ్రవణ దృశ్య, అటవీ, ఉద్యానవనాలతో పాటుగా సాగు విశేషాలపైనా పరస్పర సహకారం తీసుకోబోతోంది. అక్కడి మార్కెట్‌కు ఉల్లి, చక్కెర, మసాలా దినుసులను ఎగుమతి చేసి సరసమైన ధరలకే సరఫరా చేస్తారు. భారతదేశంలో పశు పోషకుల ప్రయోజనాలకు వెన్న, చీజ్‌ల విషయంలో గతంలో ఉన్న టారిఫ్‌లను భారత్ కొనసాగిస్తుంది. ఆయుధ సంపత్తి, కృత్రిమ తేనె, బాదం, వజ్రాభరణాలు కాపర్, అల్యూమినియం ఉత్పత్తులపైకూడా ప్రస్తుతమున్న సుంకాలనే భారత్ కొనసాగిస్తుంది. భారత్ ,న్యూజిలాండ్ కేవలం తొమ్మిది నెల్లోభారత్ న్యూజిలాండ్‌లు సమగ్ర స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంపై అవగాహనకొచ్చిన తర్వాతనే ప్రజా బాహుళ్యానికి తెలిపి చర్చలను ముగించాయి. 2026లో అధికారికంగా ఒడంబడికలు పూర్తి చేసుకునే నిర్ణయం. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమనగానే వాణిజ్యం, పెట్టుబడి,ఆర్థిక సహకారాన్ని పెంచడానికి వస్తువులు, సేవలపై సుంకాలు, నాన్ టారిఫ్ అడ్డంకులను దేశాలు తగ్గించడం లేదా తొలగించడం అనే ద్వైపాక్షిక ఒప్పందాలను ఖరారుచేసుకోవడానికే. కనుక సమగ్రంగానే పరిశీలన జరిగింది. ఈ ద్వైపాక్షిక ఒప్పందాలను మేక్ ఇన్ ఇండియాతో అనుసంధానించబడిన 15ఏళ్లకుగాను న్యూజిలాండ్ పెట్టుబడులలో 20 బిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరుకోవడంఖాయం.ఇందువల్ల భారతీయ ఎగుమతిదారులకు ప్రత్యామ్నాయ మార్కెట్లు సులభతరంగా అందుతాయి. ఇప్పటికే ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుత ఏడాదిలో 1.3 బిలియన్లకు యుఎస్ డాలర్లకు చేరుకుంది. ఈ సంవత్సరానికి బలమైన 49 శాతం వృద్ధిని నమోదు చేసింది, అయినప్పటికీ రెండు దేశాల ఆర్థిక పరిమాణంతో పోలిస్తే సరళంగానే ఉన్నట్లు ఉంది. విదేశీ సాంకేతికతను స్వీకరిస్తూనే భారతీయ సామర్థ్యాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోగలిగితే ఉభయతారకంగా ఉంటుంది.

జూదం, తాగుడు,కామంపై ఖర్చు చేసిన డబ్బు రెండింతలు నష్టాన్ని తెచ్చి పెడుతుంది.



మహాత్మాగాంధీ

సర్వ ప్రపంచాన్ని సైతం శాసిస్తూ మనిషి అసంతృప్తితో బాధపడతాడు. తనను తాను సంతోషంగా ఉంచుకోవడం చేతకాకపోతే.



సెనెకా

# ప్రజావాక్కు



### ట్రాఫిక్‌ను అధిగమించాలి

మన ఏపిరాష్ట్రంలో ఆర్‌టిసి ప్రజారవాణాకు కొత్తగా తీసుకోబోయే కొత్త బస్సులు ఏసి సదుపాయం ఉన్న ఎలెక్ట్రిక్ వాహనాలు వాడాలని నిర్ణయించారు. ఐతే పల్లెవెలుగు బస్సు కూడా దీనితోనే నడపడం, ఇతర అంశాలు చూసి ఇబ్బంది లేనప్పుడు సరే. ఏదైనారూట్‌లో బస్సు ప్రవేశం ఆయా డిపో మేనేజర్ల గతనివేదికలు, ప్రజల అభ్యర్థనలు తీర్చే విధంగా ఉండాలి.చాలా చోట్ల గ్రామీణ ప్రాంతాలకు తక్కువ ట్రిప్పులు ఉన్నవి. అక్కడ అత్యవసరం. స్త్రీశక్తి పథకం అమలుతో నగరాల్లో బస్సుల ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. వీటిని అధిగమించే విధంగా బస్సుల వినియోగం సరైన మార్గం.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### అభివృద్ధికే ఆటంకం

కృత్రిమ మేథ నేడు అన్నిరంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. ఏ.ఐ, క్వాంటమ్, కంప్యూటింగ్ వంటి వాటిలో ప్రపంచ దేశాలమధ్య పోటీ అధికమైంది.పరిశీలనల ప్రకారం ఆయాసాంకేతికల్లో తగినంతమంది నిష్ణాతులు అమెరికాలోలేరు.తదనుగుణంగా దేశవిదేశాల్లోని ప్రతిభావంతులకు ఎర్రతివాచీ పరవడం ద్వారానే శాస్త్రసాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతిని సాధించగలిగింది. ఆ శక్తి యుక్తులతోనేఅగ్రరాజ్యంగా ఆవిష్కరింపబడింది.ప్రపంచ దేశాలతో కుస్తీపట్లకు దిగుతూ ట్రంప్అమెరికాను ఏకాకిగా తయారుచేసాడు. తాను అధికారంలోకి వచ్చాక మొదటి వంద రోజుల్లోనే వలసల కట్టడికి ఏకంగా 181 కార్య నిర్వాహక చర్యలకు ఉపక్రమించాడు.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### అడ్డుకట్ట వేయాలి

వన్య ప్రాణులు జనావాస ప్రదేశాలలోకి రాకుండా ప్రభుత్వం అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పులులు, సింహాలు, ఏనుగులు, తోడేళ్ళు, ఎలుగుబంట్లు ఈ మధ్య కాలంలో జనావాస ప్రాంతాల్లోకి వచ్చి దాడులు చేస్తున్నాయి. అడవిలో వాటికి ఆహారం దొరకక పోవడమే కారణం కావచ్చు. కావున వన్య ప్రాణులు సమస్య గుర్తించి అవి జనావాసంలోకి రాకుండా ప్రభుత్వం చర్య తీసుకోవాలి. వన్యప్రాణులకు అవసరమైన ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి.

- డి చాంద్ బాషా,కర్నూలు

### మయన్మార్‌లో ఎన్నికలు!

మయన్మార్‌లో మళ్ళీ ఎన్నికలు పెట్టాలి అనిఅక్కడి సైన్యం తలపెట్టింది. 2020 ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వం ఫామ్ అయ్యి కూలిన తరవాత సైన్యం అధికారం చేతబట్టడం అటు తరవాత శాసన వ్యవస్థలో20శాతం సీట్లు సైన్యానికి కేటాయించేలా నిర్ణయాలు జరగడం ప్రజాస్వామ్యానికి పోటుదెబ్బ.అయితే అక్కడి పౌర సంఘాలు స్ప్రింగ్ రీవాల్యుషన్ పేరిట తలపెట్టిన ప్రజాస్వామిక ఉద్యమాలు కొంతలోకొంత ప్రజాస్వామికత వైపు అడుగులు వేస్తున్నట్టుకనిపించే ప్రయత్నంచేస్తున్నాయి. అయితే సైన్యంఅదుపులోఉన్న పాకిస్థాన్ అనుభవాలదృశ్య మయన్మార్ ప్రజాసామ్య భావన ప్రోదిచేయాలి అంటే చాలాదూరం ప్రయాణించాలి. అందుకు అక్కడి పౌర సమాజం కదిలి రావాలి.

- భారత అవినాష్, జనగామ

### అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి వెంకన్నదర్శనంకోసం ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. కనీసం70,80వేలమంది వస్తుంటారు. పైన వెంకన్న నిలువుదోపిడీచేస్తే , కింద బస్టాండు షాపుల వారు ప్రతి వస్తువుమీద అసలు రేట్లకంటే ఎక్కువ ధరకు అమ్ముతు ప్రయాణికులు జేబులు ఖాళీచేస్తున్నారు.అడిగితే నీ ఇష్టం వచ్చినచోట ఫిర్యాదు చేసుకో అని బెదిరిస్తున్నారు.పర్యవేక్షణలేదు. అందరూ ఫిర్యాదు చేయలేరు కదా! దాదాపు అన్నీ బస్టాండులలో పరిస్థితి ఇలాగే ఉంటుంది.వాటర్ బాటిల్ మీద కనీసం ఐదురూపాయలు ఎక్కువతీసుకుంటారు. కూల్డ్రింకుల మీద పదిరూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారు. ఆర్టీసి యజమాన్యంవారు ఈ దోపిడిపైన తగుచర్యలు తీసుకోవాలి.

-నార్నెవెంకటసుబ్బయ్య, ఒంగోలు, ప్రకాశం జిల్లా

### ప్రజల సహకారంతోనే మార్పు సాధ్యం

పర్యావరణం అంటే మనందరి ప్రాణాధారం. అది కేవలం ప్రకృతితో సంబంధం ఉన్న విషయం కాదు, మన ఆరోగ్యం, మన భవిష్యత్తు అంతా దానిపైనే ఆధారపడి ఉన్నాయి. కాలుష్య గాలి, మలిన జలాలు, నాశనమవుతున్న భూమి ఇవన్నీ ప్రకృతిని మాత్రమే కాదు, మన సమాజాన్నీ నిశ్శబ్దంగా దెబ్బ తీస్తున్నాయి. అనారోగ్యాలు పెరుగుతున్నాయి. జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. మార్గరెట్ మీడ్ చెప్పినట్లుగా పర్యావరణం నాశనం అయితే, సమాజం నిలబడదు అనే మాటలు నేటి పరిస్థితులకు పూర్తిగా సరిపోతున్నాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విజ్ఞానంతో విపత్కర పరిణామాలు ఆపలేమా?

**ఒక వైపు భూఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. శీతల దేశాలు కూడా రాబోయే కాలంలో అధిక ఉష్ణోగ్రతల వలన అనేక మార్పులు సంతరించుకునే అవకాశాలున్నాయి. నీటి లభ్యత లేక పంటలు పండక, పలు దేశాల్లో ఆహార భద్రతకు పెను ప్రమాదం ఏర్పడే అవకాశముంది. భవిష్యత్తులో చాలా నదులు అంతర్ధానం కావచ్చు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను అదుపు చేయకపోతే సమస్త భూగోళం గందరగోళంలో పడే అవకాశముంది. ఏదిఏమైనప్పటికీ పెరుగుతున్న విజ్ఞానం వలన కొత్తగా సమస్యలు ఉత్పన్నం కారాదు. మన పరిశోధనల గమ్యం మారాలి. ప్రజలందరూ ఆరోగ్యవంతంగా జీవించే విధంగా మార్గాలు చూపాలి. పరిశుభ్రమైన నీరు అందరికీ అందాలి. అంతరిస్తున్న నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నూతన పరిశోధనల వలన ఏర్పడే విపత్కర పరిణామాలకు పరిష్కారం కనుగొనాలి.**



సుంకవల్లి సత్తిరాజు

ఎక్కడ చూసినా ఉరుకులు, పరుగులు కుటుంబ పోషణ కోసం పడరాని పాట్లు, ఆరోగ్య సంరక్షణ కోసం ఉదయాన్నే వ్యాయామాలు, పిల్లల చదువుల కోసం తంటాలు పడుతూ, లక్షల్లో ఫీజులు కడుతూ హైరానా పడుతూ, నిద్రలేని రాత్రులు గడుపుతూ,మానసిక రుగ్మతలకు గురవుతున్న సగటు జీవుల ఆర్థిక స్థితిగతులు మారకుండా సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ఏదో సాధించేశామని చెప్పుకోవడం కేవలం అతిశయోక్తి మాత్రమే కాగలదు. విజ్ఞానం పెరిగినా ఆర్థిక బాధలు ఆయుష్షును మింగేస్తున్నాయి. మానవ విజ్ఞానం గగనాన్ని తాకింది.పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని దగ్గర చేసింది. అయినా ఎక్కడో ఏదో వెలితి అసంతృప్తి కనిపిస్తున్నది. ఒకప్పటికీ, ఇప్పటికీ మానవ జీవితంలో ఎన్నో మార్పులు సంభవించాయి. మానవ జీవిత గమనంలోని మలుపులను, మార్పులను ఒక్కసారి అవలోకనం చేసుకోవడానికి చరిత్ర పుటలను వెనక్కి తిప్పి చూస్తే మనకే ఆశ్చర్యం కలుగకమానదు. మానవ పరిణామ క్రమం ఒక ఎత్తయితే, నాగరికత పెరిగిన తర్వాత మనిషి జీవన విధానంలో సంభవించిన పెను మార్పులు మరొక ఎత్తు. దీనికి కారణం మనిషి ఆలోచనలు, ఆ ఆలోచనలకు కార్యరూపమిచ్చి,ప్రయోగాత్మక పద్ధతిలో విశ్లేషించడం, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ప్రదర్శించడం.తాము ఊహించిన విషయాలు,ఆలోచనలు నిజమా? కాదా? అనే అంశంపై ప్రయోగాల ద్వారా నిర్ధారణకు రావడం విజ్ఞాన తృష్ణకు దారితీసింది. దీనినే క్లుప్తంగా "సైన్స్" అని చెప్పవచ్చు.ప్రపంచ గమనాన్ని మార్చిన సైన్స్ ప్రజా జీవితాలను ఎంతో సౌకర్యవంతంగా మలచింది. మన ఊహలకుఅందని అద్భుతాలను సృష్టించి, మనిషిని మరో లోకంవైపు మళ్ళించింది. అనాగరికంగా జీవించిన మనిషిని రాతియుగంనుండి ఆధునిక యుగం వైపు మళ్ళించింది. ఆహారం నుండి ఆహార్యం వరకు, నేల నుంచి నింగివరకు మానవుల ఆలోచనలు పెరిగేలా సైన్స్ దోహదం చేసింది. ఈ ప్రపంచంలో ప్రతీ జీవికి తెలివితేటలున్నాయి. పక్షులు తమ గూళ్లను కట్టుకోవడంలోని నేర్పరితనాన్ని గమనించాలి. సాలె గూడు మానవుల అంచనాలకందని ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ ప్రక్రియ. ఆహారం కోసం, భద్రత కోసం వివిధ రకాల జీవులు ఎన్నో ప్రయత్నాలు చేస్తాయి. వాతావరణ మార్పులు తట్టుకోవడానికి అనేక జీవులు తమ శరీర ధర్మాలను తమకు అనుకూలంగా మార్చుకుంటాయి. ఊసర వెల్లులు తరచూ రంగులు మార్చుతూ తమ మనుగడను సాగిస్తాయి.వడ్రంగి పిట్ట మహా వృక్షాలకు సైతం రంధ్రాలను చేసి ఆశ్చర్యం కలిగిస్తాయి. పాములు, తేళ్ల విషాన్ని కలిగి తమను తాము రక్షించుకుంటాయి. ప్రకృతి విలయాలకు మహా సౌధాలు సైతం నేల కూలుతుంటే, చిరు చీమలు తాము నిర్మించుకున్న పుట్టల్లో వాతావరణ పరిస్థితులను అవలీలగా అధిగమించి జీవించడం గమనార్హం. ప్రతీ జీవి తమ మనుగడ కోసం పోరాటం చేస్తుంది. ఆహారంకోసం శ్రమిస్తుంది.ఆపద కాలంలో తమ తెలివితేటలను ప్రదర్శిస్తుంది. పశుపక్ష్యాదులు, క్రిమికీటకాదులు ఈ సమస్త సృష్టిలో ఒక భాగం. సమస్త సృష్టిని శాసించగల స్థితికి మానవుడుచేరుకున్నాడు. మానవ సామర్థ్యానికి ఆసక్తి, పట్టుదల తోడుకావడం వలన ఏదైనా సాధించగల మహోన్నత స్థితిని సాధించాడు. భూమ్యాకాశాల్లో దాగి ఉన్న రహస్యాలను ఛేదించి, పరిశోధనా ఫలితాలకు కార్యరూపమిచ్చి, తమ ఆవిష్కరణల ద్వారా ప్రజా జీవితాల్లో పెను సంచలనం సృష్టించిన శాస్త్రవేత్తలను ప్రస్తుతించవలసిందే. పూర్వకాలంలో కొన్ని ప్రపంచ దేశాలు పలు రకాల మహమ్మారులు తుడిచిపెట్టుకుపోయాయి. ఇలాంటి సంఘటనలు వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడానికి



దోహదం చేసాయి. మానవ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేయడంకోసం, అంటువ్యాధుల నుండి, మహమ్మారుల నుండి ప్రజలను కాపాడ గలిగే స్థాయిలో వైద్య శాస్త్రం పురోగతి సాధించింది.ఇటీవలి కాలంలో కోవిడ్ మహమ్మారికి ప్రపంచం సుమారు రెండు సంవత్సరాలు స్థంభించిపోయింది. మానవ విజ్ఞానం వలన ఈ మహమ్మారికి త్వరితగతిన వ్యాక్సిన్ కనిపెట్టడం జరిగింది. గతంలో మశూచి, ప్లేగు, కలరా వంటి మహమ్మారుల వలన కోట్లాది మంది ప్రజలు మృత్యువాతపడ్డారు. అప్పట్లో వైద్యశాస్త్రం అంతగాఅభివృద్ధి చెందలేదు. ఈ కారణంగానే ఇంతటి విధ్వంసం జరిగింది. ఎడ్వర్డ్ జెన్నర్ ప్రపంచంలో మొట్టమొదటి సారిగా వ్యాక్సిన్‌ను కనిపెట్టి మశూచికి అడ్డుకట్ట వేసాడు. తర్వాత కాలంలో అనేక వ్యాధులకు అనేక వ్యాక్సిన్‌లు అందుబాటులోకివచ్చి, మరణాల సంఖ్యను తగ్గించాయి.అయితే ఇంతటి శక్తి సామర్థ్యాలు ఇతర జీవరాశులకు లేకపోవడం వలన కేవలం పరిస్థితుల కనుగుణంగా తమను తాము కాపాడుకోవడం జరుగుతున్నది. పరిస్థితులకు అనుగుణంగా పరివర్తన చెందని పలు జీవరాశులు వాతావరణ మార్పులకు,కాలుష్యానికి తట్టుకోలేక అంతర్ధానమైపోతున్నాయి. ఎన్నో జీవరాశులు అంతరించిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ విశాలమైన భూభాగంపై మానవాళి భాగస్వామ్యంకేవలం 0.01 శాతం మాత్రమే. భూతలంపై ఇంత స్వల్ప శాతం గల మానవుడు 99శాతం జీవరాశులను శాసించడం,కేవలం మానవ దయా దాక్షిణ్యాల మీద పలు జీవరాశుల మనుగడ ఆధారపడి ఉండడం పెరిగిన మానవాధిక్యతకు పరాకాష్ఠగా చెప్పవచ్చు. మానవ విజ్ఞానం పెరగడం, టెక్నాలజీ శరవేగంగా మానవ జీవితాల్లో ప్రవేశించడం వలన అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన మాట వాస్తవం. సముద్రాల లోతుల్లో, భూగర్భంలో, అంతరిక్షంలో శాస్త్రవేత్తలు నిరంతరంపరిశోధనలు చేస్తున్నారు. నీటికి అడ్డుకట్ట వేసి ప్రాజెక్టులను నిర్మించడం, పెరిగిన జనాభాకు ఆహారం కోసం వ్యవసాయంలో అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు వినియోగించడం, జన్యుశాస్త్రాలు అధిక దిగుబడులిచ్చే నూతనవ్యవసాయవంగడాల సృష్టికి వినియోగించడం ఇలా ఒకటేమిటి, అనేక రంగాల్లో మానవ మేథస్సు ప్రపంచ గమనాన్ని సమూలంగా మార్చడం జరిగింది. ఇక అంతరిక్షంలో అనేక అద్భుతాలను సృష్టిస్తున్నారు. ఇతర గ్రహాలపైన పరిశోధనలు చేస్తున్నారు. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై రెండు ధపాలు కాలుమోపాడు. అమెరికా జెండాను నెలవంకపై నెలకొల్పాడు.అయితే పంచభూతాలను సైతం తమ అధీనంలోకి తెచ్చుకోవాలని ఆశిస్తున్న శాస్త్ర విజ్ఞానం మరణాన్ని జయించడంలో మాత్రం వైఫల్యం చెందింది. వార్ధక్యాన్ని నిలువరించి, వయసును తగ్గించడానికి "ఏజ్ రివర్సింగ్" పేరిట పరిశోధనలు జరుగుతున్నాయి. శాస్త్ర పరిశోధనల విషయంలో కూడా ఇకపై సంయమనం పాటించాలి. పెరిగిన విజ్ఞానం వలన సమస్యలు తలెత్తకుండాచూడాలి. ఒక వైపుసైన్స్ ఎంతగా అభివృద్ధి చెందినా, మరోవైపు ప్రజాజీవితం సాఫీగా సాగడం లేదు. చాలా దేశాలు పేదరికంతో అలమటిస్తున్నాయి. తినడానికి తిండి, ఉండడానికి గూడు, త్రాగడానికి సరైన నీరు దొరక్క అత్యంత దుర్భర జీవితం గడుపుతున్న అభాగ్యుల ఆర్తనాదాలు శూన్యంలో కలిసిపోతున్నాయి. విద్య,వైద్య సదుపాయాలు లేక ప్రపంచంలో చాలామంది ప్రజలు మిగిలిన ప్రపంచంతో పోటీపడలేక దైన్యంగా, భారంగా జీవితాలను నెట్టుకొస్తున్నారు. పేదరికంలో మగ్గిపోతున్న దేశాల సంగతి ఈ విధంగా ఉంటే, అభివృద్ధి చెందిన,అభివృద్ధి సాధించిన దేశాల పరిస్థితి మరో విధంగా ఉంది. పెరిగిన కాలుష్యం మనం పీల్చేగాలిని విషతుల్యం చేస్తున్నది. మనం భుజించే ఆహారం రసాయనాలతో నింపబడి ఉంటున్నది. ఒక వైపు భూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. శీతల దేశాలు కూడా రాబోయే కాలంలో అధిక ఉష్ణోగ్రతల వలన అనేక మార్పులు సంతరించుకునే అవకాశాలున్నాయి. నీటి లభ్యత లేక పంటలు పండక, పలు దేశాల్లో ఆహార భద్రతకు పెను ప్రమాదం ఏర్పడే అవకాశ ముంది. భవిష్యత్తులో చాలా నదులు అంతర్ధానం కావచ్చు.పెరుగుతున్న ఉష్ణోగ్రతలను అదుపు చేయకపోతే సమస్త భూగోళం గందరగోళంలో పడే అవకాశముంది. ఏది ఏమైన ప్పటికీ పెరుగుతున్న విజ్ఞానం వలన కొత్తగా సమస్యలు ఉత్పన్నం కారాదు. మన పరిశోధనల గమ్యం మారాలి. ప్రజలందరూ ఆరోగ్యవంతంగా జీవించే విధంగా మార్గాలు చూపాలి. పరిశుభ్రమైన నీరు అందరికీ అందాలి. అంతరి స్తున్న నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నూతన పరిశోధనల వలన ఏర్పడే విపత్కర పరిణామాలకు పరిష్కారం కనుగొనాలి. •

# ముగిసిన సర్పంచ్ ఎన్నికలు.. మిగిలిన అప్పులు

పులి రాజు

గ్రామాలే ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు. గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యం. గత సర్పంచులకు వారు చేసిన పనులకు బిల్లులు రాక ఉన్న ఆస్తుల అమ్ముకొని అప్పులు కట్టిన సర్పంచులు ఉన్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న సర్పంచ్‌లను చూసాం. అయినా సరే సర్పంచ్ పదవులకు ఇంత తీవ్రమైన పోటీ ఎందుకు? సుమారు రెండు సంవత్సరాల క్రితం జరగాల్సిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈ డిసెంబర్ నెలలో 11,14,17 వ తేదీలలో మూడు దఫాలుగా 12,728 గ్రామ పంచాయతీలగాను 1205 గ్రామపంచాయతీ ఏకగ్రీవం కాగా మిగిలిన 11,523 ఎన్నికలు నిర్వహించుకొని గ్రామాభివృద్ధి కోసం గ్రామ ప్రథమ పౌరులను సర్పంచులను ఓటు ద్వారా (ధనస్వామ్యబద్ధంగా) ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నుండి ఎన్నికలుపూర్తయ్యే వరకు గ్రామాలలో ఓటర్లకు పండగ వాతావరణం అభ్యర్థులకు యుద్ధ వాతావరణాన్ని తలపించింది. కానీ ఈ సంవత్సరం సర్పంచుల ఎన్నికలు హామీలు ఇవ్వడంలో, ప్రచారంలోనూ, మద్యం, డబ్బులు పంచడంలోను ఎమ్మెల్యేఎన్నికలను మరిపించే విధంగా మద్యం, డబ్బు,వరదలై పారిందనడంలో అతిశయోక్తి లేదు. కుల, మతాలు, ఈ సంవత్సరం కొత్తగా ఓటర్ల కాళ్లు మొక్కడాలు కూడా అభ్యర్థుల గెలుపు, ఓటములలో కీలకపాత్ర పోషించాయి. కొంతమంది అభ్యర్థులు వారి వారి ఎన్నికల గుర్తులు ఉన్న వస్తువులను తెచ్చి ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకున్నారు. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు వారి స్థాయికి మించి హామీలు ఇచ్చి, స్థాయికి మించిన అప్పులు చేసుకుని గెలిచిన వారికి ఓడిపోయిన వారు ఇద్దరికీ అప్పులు ఎలా తీర్చాలి అనే సందిగ్ధంలో ఉన్నారు? గతంలో స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులను ఆ గ్రామప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉన్నాడా? లేడా? అని తాయిలాలతో సంబంధం లేకుండా సర్పంచ్‌గా ఎన్నుకునేవారు. అప్పటి అభ్యర్థులు కూడా ఇప్పటంతా ఖర్చు పెట్టేవారు కాదు. అప్పుడు నిరక్షరాస్య ఓటర్లు మానవ సంబంధాల మూలంగా బంధాలకు,





బంధుత్వాలకు ఎక్కువగా విలువనిచ్చి ఓటుకు నోటు అడిగే వారు కాదు. కానీ ఇప్పుడు దానికి భిన్నంగా ఎక్కువ శాతం ఓటర్లు నాకేమిస్తావు? అని ప్రత్యక్షంగా ఎన్నికలలో నిలబడ్డ అభ్యర్థులను ప్రశ్నించిన సందర్భాలు చూశాం. ఓటర్లకు కూడా గ్రామ అభివృద్ధికి సంబంధం లేదు. కేవలం అభ్యర్థి ప్రత్యక్షంగా నాకేమీ ఇస్తాడు అని చూడడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు! ఇప్పుడు 70 మంది ఓటర్లు చదువుకున్న వారే, అయినా సరే నాకేమిస్తావు అనడం ఊరు అభివృద్ధి కంటే నాకు ఏమి వస్తుంది అనుకున్న ఓటర్ల నాడిని తెలుసుకున్న అభ్యర్థులు కూడా వారిస్థాయికి మించి ఖర్చుపెట్టి, ఉన్న ఆస్తులు పోయి చాలామంది అభ్యర్థులు తమ పొలాలను, ప్లాట్లను, ఇండ్లను, బంగారం, కుదువపెట్టి అప్పులు తీసుకున్నారు. మరికొందరు ఆస్తులను వడ్డికి పావు షేరు లెక్కన అమ్మి డబ్బులు తీసుకున్నారు. ఇంకొంతమంది తనకు పుట్టిన దగ్గరల్లా 5, 6 రూపాయల మిత్తిచొప్పున అప్పులు తెచ్చారు. ఒక్కొక్క ఓటుకు 500నుండి 2000 రూపాయలు ఇచ్చి ఓట్లు కొన్నట్లు ప్రత్యక్షంగా ఓటర్లు చెబుతున్నారు. రిజర్వేషన్లు రావడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జర్నల్ అభ్యర్థుల సైతం ఖర్చుకు వెనుకాడ లేదు. ఒక్కొక్క అభ్యర్థి సుమారు 20లక్షల నుండి 80లక్షలకు పైగా ఖర్చుపెట్టినట్లు అంచనా! కొంతమంది ఓడిపోయిన అభ్యర్థులు మళ్లీ ఓటర్ల దగ్గర తిరిగి డబ్బులు అడుక్కుంటున్నా పరిస్థితులను మనం చూస్తున్నాం. ఓడిపోయిన అభ్యర్థుల పరిస్థితే కాదు, లక్షలు పెట్టి గెలిచిన సర్పంచ్‌ల పరిస్థితి కూడా దయనియంగానే తయారైంది. లక్షలు పెట్టి గెలిచాం, ఎన్నోహామీలు ఇచ్చాం, ఈ అప్పులు ఎలా తీర్చాలో! హామీలు ఎలా నెరవేర్చాలో! అని ఆలోచనతో చాలామంది గెలిచిన సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. ఏదేమైనా ఈ పంచాయతీ ఎన్నికలు చాలా కుటుంబాలను ఆర్థికంగా, అప్పులపాలు, మానసికంగా, బంధుపరంగా కూడా కోలుకోలేకుండా చేశాయని చెప్పవచ్చు. ఈ ఎన్నికలతో చాలామంది యువత మద్యం తాగడం నేర్చుకున్నారు.ఇప్పుడు ఎన్నికలంటేనే డబ్బు,మద్యం పంపకాలే ఎన్నికల నిర్వచనంగా మారింది. కానీ చాలా మంది సామాజిక కార్యకర్తలు నీతి నిజాయితీగా పనిచేస్తామని ఈ ఎన్నికల్లో నిలబడ్డ యువకులకు కనీసం డిపాజిట్లు కూడా రాలేదు. గత ఎన్నికలకు ఈఎన్నికలకు ఎన్నికలనిర్వచనమే మారిందనడంలో అతిశయోక్తి లేదు. నేటి యువత భవిష్యత్తులో ఎన్నికలు మంచి వాతావరణాన్ని సృష్టించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికకాబడి స్థానిక అవసరాలు తీర్చే విధంగా డబ్బు,మద్యం కాకుండా మంచి మనసులనునాయకులుగా ఎన్నుకుంటే మంచి సమాజం ఏర్పడుతుంది. •

# ఎస్టీల గుర్తింపునకు లోకూర్ కమిటీ ఏం చెప్పింది?

గుమ్మడి లక్ష్మీనారాయణ

గిరిజన హక్కుల సాధనలో, ఆదివాసీ గిరిజనుల గుర్తింపులో నేటికీ కీలకంగా నిలుస్తున్న శాస్త్రీయ ప్రమాణాలను ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన తెగల గుర్తింపు, విలీనం వంటి అంశాలు పరిష్కారం దొరకని దీర్ఘకాలిక సమస్యగా మారాయి. రాజ్యాంగంలోని 5,6 గిరిజన షెడ్యూళ్లలో పొందుపరిచిన ఆదిమ గిరిజన తెగల హక్కులకు నిజమైన లబ్ధిదారులు ఆదివాసీలు ఇంకా న్యాయం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో, సర్వోన్నత న్యాయస్థానం ఈవిషయంలో స్పష్టమైన చొరవ చూపకపోతే అంతర్జాతీయ న్యాయస్థానాల దారి వెతకాల్సిన పరిస్థితి వస్తుందా?అనే సందిగ్ధత ఆదివాసీ సమాజంలో నెలకొంది. ఇలాంటి సమయంలో ఎస్టీ గుర్తింపుకు సంబంధించిన చారిత్రకమైన, శాస్త్రీయమైన మార్గదర్శకత్వం అందించిన జస్టిస్ లోకూర్ కమిటీ ప్రాధాన్యతను పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో షెడ్యూల్డ్ తెగల గుర్తింపు విషయంలో స్పష్టత లేకపోవడం ఒక ప్రధాన సమస్యగా కొనసాగింది. ఈ పరిస్థితుల్లో, 1965, జూన్ 1న అప్పటి ప్రధాన మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నాయకత్వంలో భారత ప్రభుత్వం గిరిజన తెగల జీవన విధానం, సామాజిక స్థితి, రిజర్వేషన్లపై సమగ్ర అధ్యయనం కోసం జస్టిస్ భీమ్ జీ నారాయణరావ్ లోకూర్(బి.ఎన్.లోకూర్) అధ్యక్షతన ఒక సలహా కమిటీని నియమించింది. ఎస్టీ గుర్తింపుకు అవసరమైన ప్రమాణాలను శాస్త్రీయంగా, స్పష్టంగా ప్రతిపాదించిన మొదటి కమిటీగా లోకూర్ కమిటీ చరిత్రలో నిలిచింది. లోకూర్ కమిటీ ప్రకారం, ఏదైనా సమాజాన్ని షెడ్యూల్డ్ ట్రైబ్‌గా గుర్తించాలంటే ఒక్క లక్షణం సరిపోదు. కింది నాలుగు ప్రమాణాల్లో ఎక్కువ భాగం ఆ సమాజానికి వర్తించాలి.సాంప్రదాయబద్ధ జీవన విధానం, వేట, ఆహార సేకరణ, చేతిపనులు వంటి పాత తరాల వృత్తులు, ఆధునికీకరణ తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపించాలి. మిగతా సమాజాలకు భిన్నమైన సంస్కృతి,సంప్రదాయాలు, ప్రత్యేక భాష లేదా మాండలికం,ప్రత్యేక ఆచారాలు ఉండాలి. ఈ ప్రత్యేకతే ఆ సమాజాన్ని వేరుగా గుర్తించే ప్రధాన లక్షణం. అడవులు, కొండ ప్రాంతాలు, అభివృద్ధికి



దూరంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లో నివాసం ఉండటం, ప్రధాన సమాజంతో పరి మిత సంబంధాలు కలిగి ఉండటం. సామాజికంగా, ఆర్థికం గా, విద్యాపరంగా తీవ్రమైన వెనుకబాటుతనం ఉండటం. జీవన పరిస్థితులు, అవకాశాల లేమి ద్వారా ఇది స్పష్టంగా కనిపించాలి. ఏదైనా కులం లేదా తెగను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియ పలు దశలుగా సాగుతుంది. మొదట రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేస్తుంది. అనంతరం గిరిజన వ్యవహా రాల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో పరిశోధనలు, సర్వేలు, సామాజిక అధ్యయనాలు నిర్వహిస్తారు. రిజర్వేషన్ వల్ల కలిగే ప్రభావాలను విశ్లేషించిన తరువాతే పార్లమెంట్ చట్టం ద్వారా ఎస్టీ జాబితాలో చేర్పుజరుగుతుంది. లోకూర్ కమిటీ 800కు పైగా గిరిజన, సామాజిక సమూహాల చారిత్రక, సామాజిక, విద్యా,ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేసితీవ్రమైన వెనుకబాటుతనాన్ని ప్రధాన ప్రమాణంగా తీసుకుంది. 1955లో అస్పృశ్యత నిషేధం తరువాత, ఎస్సీ హోదాకు అస్పృశ్యత వల్ల ఏర్పడిన వెనుకబాటుతనమే ఆధారమని కమిటీ స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి పథకాలు డినోటిఫైడ్ నోమాడిక్ తెగలకు సరిపోవడం లేదని గుర్తించి, వారిని వేర్వేరు సమూహాలుగా గుర్తించి ప్రత్యేక పథకాలు అవసరమని సూచించింది. స్వాతంత్ర్యం తరువాత ఐదేళ్ల ప్రణాళికలు ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికి దోహదపడ్డాయని, అందువల్ల కొత్తగా మరిన్ని సమూహాలకు ప్రత్యేకహోదా అవసరం లేదని అభిప్రాయపడింది. కొన్నిసమూహాలను ఎస్సీ, ఎస్టీ జాబితాల నుంచి తొలగించినా, వారి ప్రయోజ నాలను దశలవారీగా ఉపసంహరించాలని, అలాగే గుజ్జర్లు, గడ్డీలు, బంజారాలు వంటి సమూహాలకు ఓబీసీల కంటే ఎక్కువ ప్రత్యేకసహాయం అవసరమని కమిటీ స్పష్టం చేసింది. మొత్తంగా చెప్పాలంటే,ఎస్టీ గుర్తింపుకు లోకూర్ కమిటీ సూచించిన నాలుగు ప్రమాణాలు నేటికీమార్గదర్శకంగా నిలుస్తున్నాయి. షెడ్యూల్డ్ తెగలగుర్తింపు విషయంలో శాస్త్రీయత,సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధతకు బలమైన రూపురేఖను అందించిన ఈ కమిటీ నివేదికను 1967లో ప్రభుత్వానికి సమర్పించింది. అయినప్పటికీ కమిటీకి వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1976, 2003లో కొన్ని కులాలు గిరిజన తెగలలో ఎలావిలీనమైనాయో అంతుబట్టడం లేదు. •

## స్వదేశానికి తిరిగి వచ్చిన
# బంగ్లాదేశ్ ఆశాకిరణం

### కుటుంబం సహా ఢాకాలో దిగిన బిఎన్‌పి అధినేత తారిక్‌రెహామాన్



**ఢాకా, డిసెంబర్ 25:** బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) యాక్టింగ్ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ స్వదేశానికి తిరిగి వచ్చారు. సుమారు 17 ఏళ్ల పాటు లండన్ నుంచి పార్టీ వ్యవహారాలు పర్యవేక్షించిన ఆయన, కుటుంబంతో కలిసి ఢాకాలో అడుగు పెట్టారు. ఆయన రాక నేపథ్యంలో ఢాకా విమానాశ్రయం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. తారిఖ్ రాకను ఆ పార్టీ కార్యకర్తలు సెకండ్ ఇన్నింగ్స్ గా అభివర్ణిస్తున్నారు. వచ్చే ఏడాది బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధికారంలోకి వస్తే భారత్‌తో సంబంధాలు ఎలా ఉంటాయనే చర్చ జరుగుతోంది. షేక్ హసీనా నాయకత్వంలోని బంగ్లాదేశ్‌తో భారత్‌కు సత్సంబంధాలు ఉండేవి. ఆమె రాజీనామా చేశాక ఢిల్లీలోనే తలదాచుకున్నారు. కానీ తాత్కాలిక యూనస్ ప్రభుత్వంతో సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బంగ్లాదేశ్ క్రమంగా పాకిస్థాన్‌కు దగ్గరవుతోంది. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఆ పార్టీతో భారత్‌కు చెప్పుకోదగిన సంబంధాలు లేకపోయినప్పటికీ, దానిని భారత్ ఒక ప్రజాస్వామ్య పార్టీగా పరిగణిస్తోంది.

ఆ పార్టీతో భారత్ సత్సంబంధాలు పునరుద్ధరించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తారిఖ్ రెహమాన్ తల్లి ఖలీదా జియా తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్యం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేయగా, దీనిని నేషనలిస్ట్ పార్టీ సానుకూలంగా స్వీకరించింది. అంతేకాదు, ప్రస్తుత యూనస్ ప్రభుత్వం విధానాలను రెహమాన్ వ్యతిరేకిస్తున్నారు. జమాత్ఇఇస్లామీతో పొత్తుకు కూడా రెహమాన్ సుముఖంగా లేరు. జమాత్ఇఇస్లామీ పాకిస్థాన్ ఐఎస్ఐకి అనుకూలంగా వ్యవహరిస్తోందనే వాదనలు ఉన్నాయి.

అందుకే షేక్ హసీనా హయంలో ఈ సంస్థపై నిషేధం విధించారు. యూనస్ ప్రభుత్వం వచ్చాక తిరిగి క్రియాశీలకంగా మారింది. భారత్, పాకిస్థాన్‌లకు రెహమాన్ సమదూరం పాటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీ కాదు, రావల్పిండి కాదు, బంగ్లాదేశ్ తర్వాతే ఎవరైనా అని తారిఖ్ రెహమాన్ అంటున్నారు. అయితే యూనస్ మాత్రం పాక్‌కు దగ్గరగా ఉంటూ, భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.



## బస్సు బుగ్గి.. ఆరుగురు
# సజీవదహనం

- కర్ణాటక చిత్రదుర్గలో ఘోర ప్రమాదం!
- మహారాష్ట్ర, యుపిలో మరో 2 దుర్ఘటనలు, 9 మంది మృతి

**బెంగళూరు, డిసెంబరు 25:** కర్ణాటకలో జాతీయ రహదారి 48పై గురువారం తెల్లవారుజామున పెనువిషాదం చోటుచేసుకుంది. చిత్రదుర్గ జిల్లా హిరియుర్ సమీపంలో ఓ ప్రైవేట్ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. మృతుల్లో ఓ మహిళ తన నలుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెంగళూరు నుండి శివమొగ్గకు బయలుదేరిన ఈ ప్రైవేట్ బస్సు, తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో హిరియూర్ సమీపానికి చేరుకుంది. ఆ సమయంలో ప్రయాణికులందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఎదురుగా అతివేగంగా వస్తున్న ఒక ట్రక్కు ఒక్కసారిగా డివైడర్‌ను దాటుకుంటూ వచ్చి బస్సును బలంగా ఢీకొట్టింది. ట్రక్కు నేరుగా బస్సు ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా డీజెల్ లీకై మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు బస్సు అంతటా వ్యాపించడంతో ప్రయాణికులు బయటకు రావడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు డోర్ ఇరుక్కుపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చుట్టూ మంటలు, ప్రజల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. కిటికీ అద్దాలు పగలగొట్టి కొందరు ప్రాణాలతో బయటపడగలిగారు అని ఆదిత్య అనే ప్రయాణికుడు కన్నీటి పర్యంతమయ్యాడు. బస్సు క్లీనర్ మహ్మద్ సాదిక్ బస్సు ముందు భాగంలో నిద్రిస్తుండగా, ఢీకొన్న వేగానికి బయట పడిపోవడంతో ప్రాణా లతో బయటపడ్డాడు. బస్సు డ్రైవర్‌గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మొత్తం 33 మంది ప్రయాణికులుండగా, ఆరుగురు ప్రాణాలు కోల్పోగా,

27 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత హృదయ విదారకమైన ఘటన అని అభివర్ణిస్తూ..

సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు.

### మహారాష్ట్రలో కారు బోల్తా, నలుగురు మృతి

**- మృతులు తెలంగాణలోని కాగజ్‌నగర్ వాసులు**

మహారాష్ట్రలో కారు అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి పడిన ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతులు తెలంగాణలోని కుమురం జిల్లా కాగజ్‌నగర్ వాసులుగా గుర్తించారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాగజ్‌నగర్‌కు చెందిన జాకీర్ కుటుంబం నాగ్‌పూర్‌లోని ఓ ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లి తిరిగి కాగజ్‌నగర్‌కు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అతివేగంతో వస్తున్న కారు చంద్రాపూర్ జిల్లా దేవాడ- సోండో సమీపంలో అదుపు తప్పి బ్రిడ్జిపై నుంచి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జాకీర్ భార్య సల్మా బేగం, కుమార్తె శబ్రీమ్తో పాటు బంధువులు ఆఫ్జా బేగం, సహారా మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చంద్రపూర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### యుపి ఘటనలో మరో అయిదుగురు దుర్మరణం

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ రైల్వే క్రాసింగ్ వద్ద ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్రవాహనంపై భార్యభర్తలతోపాటు తమ పిల్లలతో సాయంత్రం 6.30గం.ల సమయంలో వెళ్తుండగా షాజహాన్‌పూర్ జిల్లాలోని రహుజా రైల్వే స్టేషన్ వద్ద క్రాసింగ్ దాటుతుండగా, మోటార్ సైకిల్ ఆగిపోయింది. అదే సమయంలో లక్నో నుంచి వస్తున్న ప్యాసింజర్ రైలు వీరిని ఢీకొంది. దీంతో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మోటార్ సైకిల్ తుక్కుతుక్కయిపోయింది. విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ రాజేష్ ద్వివేది ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను ఆస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సైనికులు ఇక ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించొచ్చు

## నిబంధనలు సడలించిన రక్షణశాఖ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 25:** సైనికులు సామాజిక మాధ్యమాలను వినియోగించడంపై కఠిన వైఖరి అవలంబిస్తూ వచ్చిన భారత రక్షణశాఖ తాజాగా ఈ నిబంధనలను కాస్త సడలించింది. జవాన్లు, సైనికాధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించేందుకు అనుమతి కల్పించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెల్లడయ్యాయి. అయితే ఇందుకు కొన్ని షరతులు కూడా విధించినట్లు తెలుస్తోంది. తాజా సవరణలకు సంబంధించి అన్ని సైనిక యూనిట్లకు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ మార్గదర్శకాలు పంపించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. కేవలం సమాచారం తెలుసుకునేందుకు మాత్రమే సైనికులు ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించాలని అందులో స్పష్టంగా వెల్లడించారు. పోస్టులు చేయడం, కామెంట్లు, పెట్టడం, షేరింగ్, మెసేజ్‌లకు రియాక్ట్ అవడం వంటివి చేయకుండా కఠిన ఆంక్షలు అమల్లో ఉంటాయని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అంటే సైనికులు కేవలం ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించవచ్చు కానీ అందులో ప్రతిస్పందించేందుకు అనుమతి ఉండదన్నమాట. ఇవే నిబంధనలు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వంటి ఇతర మాధ్యమాలకు కూడా ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఇక, తమ ఖాతాల్లో తప్పుదోవ పట్టించే పోస్టులు, నకిలీ సమాచారం ఉన్నట్లయితే వాటిని తక్షణమే సీనియర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. విపిఎన్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వెబ్ ప్రాక్సీలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపయోగించవద్దని సైనికులను మరోసారి హెచ్చరించారు. డిజిటల్ అవగాహన, దేశ భద్రత మధ్య సైనికులు సమతూకంగా ఉండాలని ఈ మార్గదర్శకాలతో గుర్తుచేశారు. అయితే సైనికులు వీటిని వినియోగించడంపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తుంటామన్నారు. హనీట్రాప్, డబ్బు ఆశ చూపి సున్నితమైన సమాచారాన్ని దొంగలించడం వంటి ఘటనల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వినియోగంపై ఆర్మీ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది.

# పెళ్లిచేసుకుంటా.. కానీ కట్నం కింద పాకిస్థాన్ కావాలి



### పాక్‌లో జరిగిన ఓ సభలో వాజ్‌పేయి వాక్చాతుర్యం

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:** మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాజ్‌పేయికి సంబంధించిన ఒక సంఘటనను గుర్తు చేసుకున్నారు. పాకిస్థాన్ మహిళ నుంచి ఊహించని ప్రతిపాదన ఎదురుకాగా, ఆయన చెప్పిన సమాధానం ఆమె నోరు మూయించిందని తెలిపారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకసారి వాజ్‌పేయి పాకిస్థాన్ పర్యటనకు వెళ్లారని, ఆయన ప్రసంగాలకు ఒక మహిళ ఆకర్షితురాలైందని తెలిపారు. వెంటనే వాజ్‌పేయి వద్దకు వచ్చి నన్ను పెళ్లి చేసుకుంటారా? అందుకు బదులుగా కశ్మీర్‌ను ఇస్తారా? అని అడిగిందని, దానికి వాజ్‌పేయి ఇచ్చిన సమాధానం ఆమెను షాక్‌కు గురి చేసిందని అన్నారు.

నేను నిన్ను పెళ్లి చేసుకోవడానికి సిద్ధమే, కానీ కట్నం కింద పాకిస్థాన్ కావాలని వాజ్‌పేయి సమాధానం చెప్పారని, ఆయన వాక్చాతుర్యానికి ఆశ్చర్యపోవడం ఆమె వంతయిందని గుర్తు చేసుకున్నారు. వాజ్‌పేయి చాలా అద్భుతంగా

ప్రసంగించేవారని, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేసేటప్పుడు ఎన్నడూ గీత దాటకుండా వ్యవహరించేవారని అన్నారు. బీజేపీ విస్తరణను చూసి ఆయన ఎంతగానో మురిసిపోయారని తెలిపారు. బీజేపీ ఎదుగుతున్న కొద్దీ, తన కుటుంబం పెద్దవుతోందని ఆనందం వ్యక్తం చేసేవారని అన్నారు.

### హెచ్1బి వీసా ఫీజులు పెంచేందుకు ఫెడరల్‌కోర్టు అనుమతి!

**వాషింగ్టన్, డిసెంబరు 25:** అమెరికాలో స్థిరపడాలని కలలు కనే విదేశీ నిపుణులకు ట్రంప్ ప్రభుత్వం మరోసారి షాక్ ఇచ్చింది. కొత్త హెచ్1బి వీసా దరఖాస్తులపై ఏకంగా 1,00,000 డాలర్ల (సుమారు రూ. 85 లక్షలు) భారీ రుసుమును విధించేందుకు ఫెడరల్ కోర్టు అనుమతినిచ్చింది. ఈ పెంపును సవాల్ చేస్తూ యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి బెరిల్ హోవెల్ తిరస్కరించారు. ఆర్థిక, జాతీయ భద్రత దృష్ట్యా నిర్ణయాలు తీసుకునే అధికారం అధ్యక్షుడికి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం హెచ్1బి వీసా ఫీజులు 2,000 నుంచి 5,000 డాలర్ల మధ్య ఉన్నాయి. దీన్ని ఒక్కసారిగా లక్ష డాలర్లకు పెంచడం వల్ల అమెరికాలోని చిన్న, మధ్యతరహా ఐటీ కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకోవడం భారంగా మారనుంది. అమెరికా కంపెనీలు గ్లోబల్ టాలెంట్‌ను వాడుకోకుండా ఈ నిర్ణయం అడ్డుపడుతుందని వాణిజ్య మండలి ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే, అమెరికా పౌరులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యం దక్కాలన్న ట్రంప్ విధానాలకు ఈ తీర్పు ఊతమిచ్చినట్లయింది. ఫీజుల పెంపుతో పాటు వీసా ఎంపిక ప్రక్రియలోనూ ట్రంప్ ప్రభుత్వం కీలక మార్పులు చేస్తోంది. ఇప్పటివరకు అమలులో ఉన్న లాటరీ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త వెయిటెడ్ మోడల్‌ను తీసుకురానుంది. అత్యధిక నైపుణ్యం ఉండి, ఎక్కువ వేతనం పొందే అభ్యర్థులకే ఇకపై వీసాలు దక్కనున్నాయి. ఈ కొత్త నిబంధన 2026, ఫిబ్రవరి 26 నుంచి అమల్లోకి రానుంది. కోర్టు తీర్పుపై ఐటీ కంపెనీలు అసంతృప్తిగా ఉన్నాయి. ఈ నిర్ణయం వల్ల అమెరికా టెక్ రంగం వెనుకబడిపోతుందని అవి హెచ్చరిస్తున్నాయి. ఫెడరల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ పైకోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి.

## సంక్షిప్తంగా..

### కువైట్‌లో ఎంట్రీ, విజిట్ వీసాలపై సరికొత్త ఫీజులు




**కువైట్ సిటీ, డిసెంబరు 25:** కువైట్‌లోకి ఎంట్రీ, విజిట్ వీసాలపై సరికొత్త ఫీజులు విధించారు. కొత్త ఎగ్జిర్యాటివ్ నిబంధనల కింద ఈ వీసాలపై నెలకు 10 కువైటీ దినార్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబరు 23 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. ఈ కొత్త నిబంధనలు విజిటర్లు, ఇన్వెస్టర్లు, ఉద్యోగులు, రెసిడెంట్స్‌కు వర్తిస్తాయని కువైట్ హోంమంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీసా కేటగిరీల్లో నివాస ప్రక్రియను క్రమబద్ధీకరించే లక్ష్యంతో వీటిని తీసుకువచ్చారు. మరోవైపు విదేశీయులు తమ జననాల్ని నమోదు చేసుకోవడానికి 4 నెలల సమయం ఇచ్చారు. అది దాటితే జరిమానాలు విధించనున్నారు. మొదటి నెలలో రోజుకు 2 కువైటీ దినార్లు.. మొదటి నెల అనంతరం రోజుకు 4 కువైటీ దినార్లు చెల్లించాల్సి ఉంటుందని నిబంధనల్లో పేర్కొన్నారు. డొమెస్టిక్ వర్కర్స్‌కు సంబంధించిన నిబంధనలను అక్కడి ప్రభుత్వం రెగ్యులేట్ చేసింది. వారి 21-60 మధ్యలో ఉండాలి.

### క్రిస్మస్ రోజున చర్చి ఎదుట హనుమాన్ చాలీసా పఠనం!


**రాయ్‌బరేలి, డిసెంబరు 25:** ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో క్రిస్మస్ పర్వదినం వేళ ఉద్రిక్తత చోటుచేసుకుంది. కంటోన్మెంట్ ప్రాంతంలోని ప్రముఖ బిషప్ కాన్రాడ్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న చర్చి వెలుపల బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ కి చెందిన సభ్యులు నిరసనకు దిగారు. పోలీసుల సమక్షంలోనే చర్చి ఎదుట బైఠాయించి హనుమాన్ చాలీసా పఠించడం స్థానికంగా సంచలనం రేపింది. బరేలీలోని బిషప్ కాన్రాడ్ పాఠశాల ఆవరణలో ఉన్న చర్చి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు చర్చి ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి హనుమాన్ చాలీసా చదివారు. ఈ సందర్భంగా జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేయడంతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. చర్చిలో ప్రార్థనల సాకుతో అక్రమంగా మత మార్పిడులు చేస్తున్నారని, దీనిపై తాము నిరసన తెలుపుతున్నామని బజరంగ్ దళ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

### అలీగఢ్ క్యాంపస్‌లో టీచర్ కాల్చివేత



**ఆలిఘఢ్, డిసెంబరు 25:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రఖ్యాత అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం (ఏఎంయూ) క్యాంపస్‌లో ఓ పాఠశాల ఉపాధ్యాయుడిని గుర్తుతెలియని దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. ఈ ఘటనతో యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మృతుడిని ఏఎంయూ మాజీ విద్యార్థి, క్యాంపస్‌లోని ఏబీకే హైస్కూల్‌లో గత 11 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రావ్ డానిశ్ (43)గా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం రాత్రి 8:50 గంటల సమయంలో డానిశ్ తన ఇద్దరు సహోద్యోగులతో కలిసి క్యాంపస్‌లో సాయంత్రం వాకింగ్‌కు వెళ్లారు. మోలానా ఆజాద్ లైబ్రరీ సమీపంలోని క్యాంటీన్ వద్దకు చేరుకోగానే, స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు వారిని అడ్డగించారు.

### అరుణాచల్ భారత్‌దే అన్నందుకు యూట్యూబర్ నిర్బంధం!



**బీజింగ్, డిసెంబరు 25:** చైనా పర్యటనకు వెళ్లిన ఒక భారతీయ ట్రావెల్ వ్లాగర్‌కు అక్కడ ఊహించని పరిణామం ఎదురైంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగం అంటూ గతంలో చేసిన వ్యాఖ్యల కారణంగా చైనా ఇమ్మిగ్రేషన్ అధికారులు అతడిని 15 గంటల పాటు నిర్బంధించారు. ఆన్ రోడ్ ఇండియన్ పేరుతో యూట్యూబ్ ఛానల్ నడుపుతున్న ఈ యువకుడు తనకు ఎదురైన అనుభవాన్ని ఒక వీడియో ద్వారా పంచుకున్నాడు. ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద అధికారులు మొదట ప్రొఫెషనల్‌గానే వ్యవహరించారు. పాస్‌పోర్ట్‌పై స్టిక్కర్ కూడా వేశారు. కానీ, స్టాంప్ వేసే సమయంలో ఒక్కసారిగా ఉన్నతాధికారులను పిలిపించి, అతడిని నిర్బంధ ప్రాంతానికి తరలించారు. సుమారు రెండు గంటల తర్వాత గదిలోకి తీసుకెళ్లి గంటల తరబడి విచారించారు.

### కిలిమంజారో పర్వతంపై కుప్పకూలిన హెలికాప్టర్, ఐదుగురు మృతి

**డొడొమా, డిసెంబరు 25:** టాంజానియాలోని కిలిమంజారో పర్వతంపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ హెలికాప్టర్ కుప్పకలిపోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కిలిమంజారో పర్వతంపై ఉన్న బరాపు క్యాంపు సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుందని టాంజానియా పౌర విమానాయాన శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పర్వతంపై ఉన్న వారిని వైద్య చిక్సిత కోసం తరలించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొంది. మృతుల్లో ఇద్దరు విదేశీ పర్యాటకులతోపాటు డాక్టర్, టూరిస్టు గైడ్, పైలట్ ఉన్నట్లు వెల్లడించింది. అయితే ఆ పర్యాటకులు ఏ దేశానికి చెందిన వారనే వివరాలను మాత్రం తెలపలేదు. ప్రమాదానికి కారణం తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు స్థానిక పోలీసులు అధికారి తెలిపారు.

# ఓటర్లకు కార్లు, బైక్‌లు, ఆభరణాలు!

## పుణే ఎన్నికలకు పార్టీల తాయిలాలు!



**ముంబయి, డిసెంబర్ 25:** పుణె మున్సిపల్ ఎన్నికలకు మరో మూడు వారాల గడువుండగా అభ్యర్థులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు ఖరీదైన కానుకలు, ఉచితాలను ఎరగా వేస్తున్నారు. పట్టుచీరలు మొదలు, బైక్‌లు, లగ్జరీ కార్లు, బంగారు ఆభర ణాలు, విదేశీ ట్రిప్పుల వంటివి ఆశ చూపిస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం లక్కీ డ్రాలను నిర్వహిస్తున్నారనే వార్తలు వినిపిస్తు న్నాయి. పుణె మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జనవరి 15న జరగనున్నాయి. ఈ క్రమంలో పలు వార్డుల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ వార్డులో స్థానిక సీనియర్ నేత కొంత మంది మహిళా ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారికి కొన్ని గజాల భూమిని ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందు కోసం లక్కీ డ్రా నిర్వహిస్తున్నారని, ఇప్పటికే వీటికి రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టి నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్య ర్థులు అనేక వ్యూహాలు అమలు చేస్తు న్నారు. మరో డివిజన్‌లో ఓ అభ్యర్థి దంపతుల కోసం అ యిదు రోజుల పాటు థాయ్‌లాండ్ ట్రిప్ ఆఫర్ చేస్తున్నాడు. ఇతర వార్డుల్లోనూ లక్కీ డ్రా పేరుతో ఓటర్లకు బైక్‌లు, ఎస్‌యువిలు, బంగా రు ఆభరణాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరో వార్డులో మహిళలను ఆకట్టు కునేందుకు పట్టుచీరలను పంచడం మొదలుపెట్టినట్లు సమాచారం. ఇప్ప టికే ఓ వార్డులో 500 మందికి సైకిళ్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారని సమాచారం. పుణెలో క్రికెట్ అభి మానుల కోసం లీగ్ మ్యాచ్‌లు ఏర్పాటుచేసి యువ ఓటర్లకు నగదు బహు మతులు అందచేస్తున్నట్లు వార్తలు వినిపిస్తు న్నాయి. మరో చోట మెగా లక్కీ డ్రా ఏర్పాటు చేసిన ఓ అభ్యర్థి లగ్జరీ ఎస్‌యువిని బహు మతిగా పెడుతున్నారని తెలిసింది. కార్యక్ర మంలో అయిదువేల మంది పాల్గొన్నారు.


# ఇస్మాయిల్ హనియే హత్యరోజు టెహ్రాన్‌లోనే ఉన్నా!

**నాటి సంఘటనను గుర్తుచేసుకున్న కేంద్ర మంత్రి గడ్కరీ**

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:** ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధం సమయంలో ఇరాన్‌లో హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన రోజు తాను టెహ్రాన్‌లోనే ఉన్నట్లు కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడించారు. ఇస్మాయిల్ హనియే హత్య వార్త ప్రపంచాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురి చేసింది. నాటి సంఘటనను కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా గుర్తు చేసుకున్నారు. హత్యకు కొన్ని గంటల ముందు హనియాను తాను కలిసినట్లు వెల్లడించారు. ఓ పుస్తకావిష్కరణలో పాల్గొన్న గడ్కరీ మాట్లాడుతూ గతేడాది జులైలో తాను ఇరాన్ పర్యటనకు వెళ్లినట్లు చెప్పారు. ప్రధాని మోదీ అభ్యర్థన మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత్ తరఫున హాజరైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా టెహ్రాన్‌లో ఫైవ్‌స్టార్ హోటల్‌లో తమకు బస ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రపంచ నాయకులు, ప్రముఖులు కూడా ఈ సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. అయితే, ఎలాంటి పదవి లేకపోయినా హమాస్ చీఫ్ హనియా కూడా ఈ కార్యక్రమానికి వచ్చినట్లు వివరించారు. వివిధ దేశాధిపతులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# నా వీర్యకణాలతో గర్భందాలిస్తే! ఐవిఎఫ్ ఖర్చులు నేనేభరిస్తా!

## టెలిగ్రాం వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ సంచలన ఆఫర్



ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, రష్యన్ బిలియనీర్ పావెల్ డ్యూరోవ్ (41) ఒక సంచలన ఆఫర్‌తో ప్రకటించారు. తన వీర్య కణాలను ఉపయోగించి గర్భం దాల్చాలనుకునే మహిళలకు ఐవిఎఫ్ ఖర్చులను పూర్తిగా తానే భరిస్తానని ప్రకటించారు. అలా పుట్టిన పిల్లలందరికీ తన 17 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.4 లక్షల కోట్లు) ఆస్తిలో సమాన వాటా ఇస్తానని వాగ్దానం చేశారు. 37 ఏళ్లలోపు వయసున్న అవివాహిత మహిళలు ఈ ఆఫర్‌కు అర్హులు. మాస్కోలోని వీర్యకణాలు నిల్వ ఉన్నాయి. అక్కడికి వచ్చే మహిళలకు అయ్యే ఐవిఎఫ్ ఖర్చులను డ్యూరోవ్ పూర్తిగా భరించనున్నారు. ఇప్పటికే ఆయనకు స్పెర్మ్ డొనేషన్ ద్వారా 12 దేశాల్లో 100 మందికి పైగా పిల్లలు, ముగ్గురు భాగస్వాముల ద్వారా మరో ఆరుగురు సంతానం ఉన్నారు. గత జులైలో తన టెలిగ్రామ్ పోస్టులో దురోవ్ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, నా స్పెర్మ్ దానం వందలాది జంటలకు తల్లిదండ్రులయ్యేందుకు సహాయపడింది. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన స్పెర్మ్ కొరత తీవ్ర సమస్యగా మారింది. ఈ సమస్యను తగ్గించడంలో నేను నా వంతు పాత్ర పోషించినందుకు గర్వపడుతున్నానని రాశారు. అలెక్స్ ఫ్రిడ్‌మ్యాన్ పోడ్‌కాస్ట్‌లో నిరూపించుకోగలిగితే, 30 ఏళ్ల తర్వాత నా ఆస్తిలో వారికి వాటా లభిస్తుందని దురోవ్ స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన లీ పాయింట్ మ్యాగజైన్‌తో మాట్లాడుతూ, నా పిల్లల మధ్య నేను ఎలాంటి వ్యత్యాసం చూపనని పేర్కొన్నారు. భవిష్యత్తులో తన పిల్లలందరూ ఒకరినొకరు కలుసుకుని, సంబంధాలు ఏర్పరచుకునేందుకు వీలుగా తన డీఎన్ఏను ఓపెన్ సోర్స్ చేయాలనే ప్రణాళికలో ఉన్నట్లుతెలిపారు. దురోవ్ ఆఫర్‌తో మాస్కోలోని ఆల్ట్రావిటా క్లినిక్‌కు మహిళల నుంచి భారీ స్పందన వస్తోంది. ముఖ్యంగా 37 ఏళ్లలోపు వయసున్న, పెళ్లికాని మహిళలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు.

# 28న బిసి జన భోజనాలు

### బిసిల ఐక్యత, అధికారమే లక్ష్యంగా

### వనస్థలిపురంలోని డీర్ పార్క్‌లో ఏర్పాట్లు

### సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీల ఐక్యతే బలంగా, అధికారమే లక్ష్యంగా ఈనెల 28న బీసీ జన భోజనాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన జన భోజనాలను వనస్థలిపురంలో ఉన్న డీర్ పార్క్‌లో ఏర్పాటు చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం హైదరాబాదులోని బీసీ భవన్‌లో బీసీ జన భోజనాల మహోత్సవం బ్రోచర్‌ను బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి జన భోజనాల నిర్వాహ కమిటీ సభ్యులు చామకూర రాజు, కె వి గౌడ్, రఘురాంతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ .. జనాభాలో 60 శాతానికిపైగా ఉన్న బీసీలు గత ఎనబై ఎండ్లుగా రాజకీయ అధికారాన్ని అందుకోలేక పోతున్నారని, విడి విడిగా ఉన్న బీసీ కులాల చైతన్యం, 136 కులాలుగా ఉన్న బీసీలు సంఘటితంగా ఆలోచించే స్థాయిలో చైతన్యం రావడంలేదన్నారు. బీసీల సాంస్కృతిక జీవన విధానం అంతా ఒకటేనని, బీసీలుగా ఉన్న బీసీ కులాలు, కులాలుగా తాము సంఘటితమవుతూనే, బీసీలుగా బలపడడానికి ఈ వన భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ జన భోజనాల మహోత్సవాలకు రాష్ట్రంలోని బీసీలందరూ రాజకీయ పార్టీలకతీతంగా కుటుంబ సమేతంగా హాజరుకావాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి బీసీల ఐక్యమత్యాన్ని చాటి చెప్పాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బలహీన వర్గాల ఐక్యవేదిక అధ్యక్షులు లచ్చ గౌడ్, వెంకటేష్, మల్లేష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇదర్ కా మాల్ ఉదర్.. ఉదర్ కా మాల్ ఇదర్

### సన్నబియ్యం కోసం బోర్డర్లలో ప్రత్యేక దుకాణాలు

### మహారాష్ట్ర గ్యాసుపై మక్కువ పెంచుకుంటున్న తెలంగాణ

### నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోకి భారీగా తరలివస్తున్న గ్యాస్

**హైదరాబాద్,డిసెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో భోరజ్,సలాబాత్‌పూర్ వంటి చెక్‌పోస్టులతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో గతంలో ఉన్న తనిఖీ కేంద్రాల ఎత్తివేయడంతో తెలంగాణ మహారాష్ట్ర మధ్య ఇదరీకా మాల్ ఉదర్-ఉదర్‌కా మాల్ ఇదర్ వ్యాపారం చేసే నల్లబజారు నల్లతామలకు కలిసొచ్చి నట్లయ్యింది. అడిగేవారు, ఆపేవారు లేకపోవడంతో చాలా సులభంగా తెలంగాణ పౌరసరఫరాశాఖ సన్నబియ్యం మహారాష్ట్రకు, మహారాష్ట్ర వంటగ్యాస్ తెలంగాణ సరిహద్దు దాటిస్తున్నారు. తెలంగాణ సన్నబియ్యం కోసం నాందెడ్ జిల్లా ధర్మాబాద్ మండలంతో పాటు ఆదిలాబాద్ జిల్లాను ఆనుకొని ఉన్న పలు గ్రామాలు పట్టణాలలో ప్రత్యేక దుకాణాలు సరిహద్దు పొడుగుతా తెరిచి ఉంచి నిర్భయంగా సివిల్‌సప్లయ్ బియ్యం కొనుగోలు చేస్తుంటారు. అదే తరహాలో వంటగ్యాస్ అటు నుంచి ఇటు వస్తోంది. ఎల్‌పిజి గ్యాస్ ధరలు తెలంగాణతో పోలిస్తే మహారాష్ట్రలో తక్కువగా ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు దళారులు గుట్టుగా గ్యాస్ సిలిండర్లను మహారాష్ట్ర నుంచి తెలంగాణకు తరలిస్తున్నారు. సరిహద్దు జిల్లాల్లో నెలకు సుమారు ఇరువై లక్షలకు పైగా వ్యాపారం సాగుతోందని తెలిసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కుమురంభీంజిల్లాలకు చెందిన కొందరు దళార్లు పొరుగు రాష్ట్రంలోని గడ్చిరోలి, చంద్రాపూర్, యావత్‌మాల్, లాతూరు,నాందెడ్, ధర్మాబాద్ కిన్వట్ ప్రాంతాల గ్యాస్ డీలర్ల సహకారంతో ఈ తంతు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ కు చెందిన హెచ్‌పి, ఇండేన్,భారత్ పెట్రోలియం కంపెనీల ఖాళీ సిలిండర్లను అక్కడకు తీసుకెళ్లి వారివద్ద సిలిండర్లు తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ధరతో పోలిస్తే అక్కడ గృహవసరాలకు వినియోగించే సిలిండర్ ధర రూ.51 వరకు తక్కువ కాగా, వాణిజ్య సిలిండర్ ధర రూ.170 వరకు తక్కువకు దొరుకుతోంది. అక్కడ పెద్దమొత్తంలో సిలిండర్లను కొనుగోలు చేస్తూ స్థానిక మార్కెట్ ధరతో విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మహారాష్ట్రలో ఐదు కిలోల సిలిండరు రూ.328 కి పౌరసరఫరాలశాఖ వినియోగదారుడికి ఇస్తుంటే మన వద్ద దాని ధర రూ.347 ఏంది అదే విధంగా సాధారణంగా గృహాలలో 14.2కిలోల వంటగ్యాస్ సిలెండర్ వినియోగిస్తుంటారు. తెలంగాణలో దాని ధర రూ.930 ఉంటే మహారాష్ట్రలో 878.51 ఉంది. వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19కిలోల గ్యాస్ ధర పొరుగు రాష్ట్రంలో 1672 రూపాయలు ఉంటే తెలంగాణలో 1843.5 రూపాయలు ఉంది. అదే విధంగా 47.5కిలోల గ్యాస్ సిలెండర్ ధర 4148 రూపాయలు ఉంటే తెంగాణలో 4604 రూపాయలు ధర ఉంది. తెలంగాణతో సరిహద్దు కలిగిన బేల,తాంసి,తలమడుగు, జైనథ్, కెరమెరి సిర్పూర్(టి) కోటాల, లింగాపూర్, లింగారెడ్డి మండల్ ముద్దనూరు,తానూరు, కుభీరు, కుంటాల, సారంగాపూర్ తదితర మండలాలను కేంద్రంగా చేసుకొని హోటళ్లు, ఎల్‌పిజి గ్యాస్ నడిచే వాహనాలకు మహారాష్ట్ర గ్యాస్ ఉపయోగించుకోవడానికి చక్కటి అవకాశం ఏర్పడింది. ఎల్పీజీ ఫిల్లింగ్ కేంద్రాలతో పోలిస్తే నేరుగా సిలిండర్ నుంచి గ్యాస్ నింపుకోవడం ఖర్చు తక్కువవుతుంది. వేబిల్లులు,వస్తువు చెల్లింపులు వంటి సాంకేతిక అంశాలు క్షేత్రస్థాయి అధికారులు అంతగా పరిశీలించకపోవడంతో గ్యాస్ రాచమార్గంగా దొంక దారుల్లో బండ్ల బాటల్లో కూడా ఎంచుకొని సిలిండర్లను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కుమురంభీం జిల్లాల్లో లక్షల రూపాయలకు పైగా వ్యాపారంప్రధానంగా 14.2 కిలోలు, 19 కిలోల సిలిండర్లను ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలోనే సగటున రోజుకు 100 వరకు గృహావసర సిలిండర్లు, 50 వరకు వాణిజ్య సిలిండర్లు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన రోజుకు రూ. 15వేలలోపు, నెలకు రూ.నాలుగు లక్షలు చొప్పున వారికి గిట్టుబాటవుతోంది. ఇందులో రవాణా, ఇతరత్రా ఖర్చులు పోయినా రూ.3 లక్షలకు పైగానే వెనకేసుకుంటున్నట్లు ఈ వ్యాపారంపై చర్చించుకొంటున్నారు. మరోవైపు మన సన్నబియ్యం పిడిఎస్ వాహనాలకు జిపిఎస్ తొలగించి వాటిని మోటార్ బైకులకు బిగించి సివిల్ సప్లయ్ అధికారులను తప్పుదారి పట్టిస్తూ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా మిల్లులకు వీలైతే బార్డర్‌లో వీటి కోసం ప్రత్యేకంగా తెరిచిన దుకాణాలకు తరలిస్తు ఇక్కడ చవకబియ్యం అక్కడికి అక్కడి చవక గ్యాస్ ఇక్కడికి వస్తుమార్పిడి మన నల్లబజారు త్రాచులు చేసుకుంటున్నారు.

# సిపిఐ వందేళ్ల చరిత్ర

### నేడు పార్టీ కార్యాలయంలో అరుణపతాకం ఎగురవేయనున్న రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఆ పార్టీ ఘనంగా వేడుకలు నిర్వహించనుంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ప్రజలకు వివరించడం కోసం ఇప్పటికే బస్సు యాత్రలను నలుదిక్కుల నుంచి ప్రారంభించింది. ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ కంటే ముందుగా పార్టీ రాష్ట్ర కార్యాలయం ముగ్ధూమ్ భవన్‌లో నేడు(శుక్రవారం) పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎగురవేయనున్నారు. అనంతరం సభను నిర్వహించనున్నారు. పార్టీ వందేళ్ల చరిత్రను సభలో నాయకులు వివరించనున్నారు. పార్టీ విజయాలను, భవిష్యత్ కర్తవ్యాలను కూడా వివరించే అవకాశం ఉంటుందని నాయకులు చెబుతున్నారు.

# ప్రమాణం చేయకుండానే పరలోకానికి సర్పంచ్ అక్కమ్మ

**న్యాల్‌కల్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మిర్జాపూర్ (ఎన్) గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల అక్కమ్మ (56) అనారోగ్యంతో బుధవారం రాత్రికి తిరిగిరాని లోకాలకు చేరి పోయారు.



మిర్జాపూర్(ఎన్) సర్పంచ్ అక్కమ్మ (ఫైల్)

ఈ నెల 17న జరిగిన మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో సర్పంచ్‌గా ప్రత్యర్థ అభ్యర్థిపై 60 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సర్పంచ్‌గా విజయం సాధించినప్పటి నుంచి ఆరోగ్యం బాగులేక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందుకుంటుండంతో సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం సైతం చేయలేక పోయారు. సర్పంచ్‌గా ప్రజా సేవ చేయాలన్న ఆశ ఆరంభ దశలోనే ఆరిపోయింది. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ బుధవారరం రాత్రికి తిరిగిరాని లోకాలకు చేరిపోయింది. సర్పంచ్ అక్కమ్మ మృతితో మిర్జాపూర్‌లో విశాద చాయలు అలుముకున్నాయి.

# అసెంబ్లీ సమావేశాల్లో బిసి రిజర్వేషన్‌లపై చర్చ జరపాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 25, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బిసిల రిజర్వేషన్‌లపై చర్చ జరిపి చట్టబద్ధంగా అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ ఆయన సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు మాత్రం పార్టీ పరంగా జరుగుతాయని, అందువల్ల చట్టబద్ధంగా బిసిల రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత రెండేళ్ళుగా బిసిలకు రిజర్వేషన్‌లు 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలకు వెళతామని కొన్ని వందల సార్లు ప్రకటించిందని, గ్రామ పంచాయితీ ఎన్నికలకు నిట్ట నిలువునా మోసం చేసిందని, 42 శాతం అని ప్రకటించి, 22 శాతం ఉన్న రిజర్వేషన్‌లను 17 శాతంకు తగ్గించి అక్రమాలకు పాల్పడిందని, ఇది చాలా దుర్మార్గమైన చర్యని ఆరోపించారు. అయినప్పటికి బిసిలు తిరగబడి గ్రామపంచాయితీ ఎన్నికల్లో మొత్తం సీట్లలో 51 శాతం విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి-6 ప్రకారం రిజర్వేషన్‌లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, అసెంబ్లీలో బిసి బిల్లుకు చట్టం చేసి, జనాభా లెక్కలు తీసి న్యాయబద్ధం చేసిందన్నారు. అయితే 42 శాతం రిజర్వేషన్‌లు అమలు జరగలేదన్నారు. గతంలో సుప్రీంకోర్టు జనాభా లెక్కలు ఉంటే రిజర్వేషన్‌లు పెంచుకోవచ్చునని తీర్పు ఇచ్చిందని, అందువల్ల రిజర్వేషన్‌లను పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నందున అసెంబ్లీలో బిసి రిజర్వేషన్‌లపై చర్చించి 42 శాతం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# 'మహా జాతర' అభివృద్ధి పనులను వేగంగా చేయాలి

### భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

### జంపన్నవాగు స్నానఘట్టాలు పరిశుభ్రంగా ఉంచాలి: మంత్రి సీతక్క

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో, ప్రభాతవార్త:** నిర్ణీత సమయంలో మేడారం మహా జాతర అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం మేడారంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను, పార్కింగ్ స్థలాలను, బస్టాండ్ ప్రాంగణంలో జరుగుతున్న పనులను, విఐపి, వివిఐపి రోడ్లను శ్రీరామ్ సాగర్ చెరువు, రోడ్ల విస్తరణ ను, జంపన్న వాగు దగ్గర ఉన్న స్నాన ఘట్టాలను మంత్రి సీతక్క క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క మేడారంలోని ఐటిడిఏ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.



**జంపన్న వాగులో స్నాన ఘట్టాలు పరిశుభ్రంగా ఉంచాలి**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జంపన్న వాగు పరిసరాలలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న సందర్భంలో స్నాన ఘట్టాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చూసుకోవాలని, కొంగలమడుగు ఏరియా నుండి జంపన్న వాగు వరకు రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్ల విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమ్మక్క సారలమ్మ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పనులలో ఇంకా వేగం పెంచాలని, లేబర్ ను అదనంగా తెప్పించి షిఫ్ట్ ల వారిగా 24 గంటలు అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను, గుత్తేదారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, సంబంధిత అధికారులు గుత్తేదారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథంతో పని చేయాలి

### గ్రూప్-1 ఉద్యోగాలు సాధించిన వారి సత్కార సభలో మంత్రి పొన్నం

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా సేవా దృక్పథంలో పని చేయాలని గ్రూప్-1 ఉద్యోగాలు పొందిన వారికి రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గురువారం హైదరబాద్ లోని అరణ్య భవన్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గ్రూప్-1 లో ఉద్యోగాలు సాధించిన ఆర్యవైశ్య ఉద్యోగులను మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కరించారు. ఆ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్,

వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రూప్-1లో ఉద్యోగాలు సాధించిన 15 మంది ఆర్యవైశ్యలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా సేవా దృక్పథంలో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా వాసవి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారని.. అలాగే మీరు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలన్నారు.

ఎంతో శ్రమపడితేనే ఉద్యోగం సాధించారని... ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఉద్యోగ నియామకాలు జరుపుతున్నామని, గ్రూప్-1లో రాష్ట్ర వ్యాప్తంగా 562 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.

రేపు తెలంగాణ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించే వారు మీరేనని.. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# వైద్య విధాన పరిషత్‌లో జీతాలు రాని ప్రభుత్వ వైద్యులు

### టివివిపి వైద్యుల వేతనాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

### అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింపజేయాలి: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య విధాన పరిషత్(టివివిపి)లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యులకు 26వ తేది వచ్చినా జీతాలు అందలేదు. గత కొంతకాలంగా ఇలాగే టివివిపిలో పచేస్తున్న వైద్యులు జీతాలు కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని.. వెంటనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం(టిజిజిడిఏ) డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తవుతున్నప్పటికీ .. ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించ లేదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరహరి బాపన్‌పల్లి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడన, ట్రెజరర్ డాక్టర్ ఎంకె రౌఫ్ విమర్శించారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే వేలాది తెలంగాణ ప్రభుత్వ వైద్యులు ఎంతో ఆశతో స్వాగతం పలికారని, రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మార్పు తప్పక వస్తుందని, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు శాశ్వత జీతాల పరిష్కారం లభిస్తుందని భావించినప్పటికీ, నేటికీ పరిస్థితి మరింత దయనీయంగా మారిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. టివివిపి పరిధిలో పనిచేస్తున్న వందలాది ప్రభుత్వ వైద్యులు ప్రతి నెల జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి కొనసాగుతోందని, 26వ తేది వచ్చినా కూడా జీతాలు విడుదల కాకపోవడం వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టివివిపిని డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకురావడమే దీనికి శాశ్వత పరిష్కారమని .. టివివిపిని కార్పొరేషన్ వ్యవస్థ నుంచి బయటకు తీసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ పరిధిలోకి తీసుకురావడమే జీతాల సమస్యకు శాశ్వత పరిష్కారమని టిజిజిడిఏ స్పష్టం చేసింది. ఈ అంశంపై సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. టివివిపి వైద్యుల జీతాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో బిల్ ప్రవేశపెట్టి, స్పష్టమైన చట్టబద్ధ వ్యవస్థను తీసుకురావాలని టిజిజిడిఏ డిమాండ్ చేసింది. బిల్లును ఆలస్యం చేయడమంటే వేలాది ప్రభుత్వ వైద్యులను అనిశ్చితిలోకి నెట్టడమేనని టిజిజిడిఏ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా బాధ్యతగా స్పందించి, టివివిపి వైద్యులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు వచ్చేలా శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో తదుపరి కార్యాచరణకు టిజిజిడిఏ సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు.

# వాజ్‌పేయి ప్రసంగాలు, వ్యక్తిత్వం యువతకు మార్గదర్శకాలు

### మాజీ ప్రధాని జయంతి సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 25:** అటల్ జీ 101వ జన్మదినం సందర్భంగా దేశమంతా ఉత్సవాలు కార్యక్రమాలు జరుపు కుంటున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి మంచి వక్త, మంచి పరిపాలనా దక్షుడు, విలువలు కలిగిన మహా నేత అని కొనియాడారు. ఒక్క ఓటు తేడా ఉంటే నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసి ప్రధాని పదవిని తృణ ప్రాయంగా వదులుకున్న మహోన్నతమైన నేత అటల్ జీ అని అన్నారు. భారతదేశ రక్షణ కోసం ఎంతో కృషి చేసి సుపరిపాలన అందించిన నేత అని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ పేరుతో విద్యాలయాల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేశారని చెప్పారు.. పేద ప్రజల పక్షాన నిలిచి వారి అభ్యుదయం కోసం అనేక సంస్కరణలు తీసుకోచ్చిన నేత అటల్ అని అన్నారు. ఆయన ప్రసంగాలు, వ్యక్తిత్వం దేశ యువతకు మార్గదర్శిగా నిలిచాయన్నారు.

పాకిస్తాన్ వెన్నుపోటు పొడిస్తే తిరిగి పాక్‌కు మూడు చెరువుల నీళ్ళు తాగించి పాక్‌ను మట్టికరిపించిన ఘనత అటల్‌కు దక్కుతుందని చెప్పుకొచ్చారు. ఒక దేశం నుండి మరొక దేశానికి.. ఢిల్లీ నుంచి లాహోర్‌కు బస్‌లో వెళ్లిన మొదటి ప్రధాని మోదీ అని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశ వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేసిన ఘనత ఆయనది అని అన్నారు. దేశ ప్రగతిలో తనదైన ముద్ర వేసుకున్న మహానుభావుడన్నారు. దేశ యువతకు అటల్ జీ జీవితం ఒక స్ఫూర్తి అని తెలిపారు. వాజ్‌పేయికు యావత్ దేశం ఘనంగా నివాళి అర్పిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



కంటోన్మెంట్ పికెట్ గార్డెన్‌లో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి ఈటల తదితరులు

# దేశాభివృద్ధికి వాజ్‌పేయి చేసిన సేవలు ఎనలేనివి : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్ (కంటోన్మెంట్), డిసెంబరు 25, ప్రభాతవార్త:** అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని, భారత దేశ అభివృద్ధిలో కీలక మార్పులు తీసుకువచ్చిన స్ఫూర్తి ప్రదాత అటల్ బిహారి వాజ్‌పేయి అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి 101 జయంతిని పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలోని పికెట్ పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి ఆదర్శవంతమైన నేతగా దేశ చరిత్రలో నిలిచారన్నారు. గ్రామీణ సడక్ యోజన, సర్వ శిక్ష అభియాన్, మొబైల్ ఫోన్స్ తీసుకొచ్చి దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావ్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్, సిఈఓ అరవింద్ ద్వివేది, కార్పోరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి

### సిఎంకు రాష్ట్ర రైతు కమిషన్ లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త :** తెలంగాణలో ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర రైతు కమిషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వారధిగా ఆదర్శ రైతులు పనిచేసే అవకాశం ఉంటుందని అందులో పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులకు సహాయ, సహకారాలు అందించే విధంగా ఆదర్శ రైతు వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రైతులకు చేరడంలో ఆదర్శ రైతులు కీలకంగా పనిచేస్తారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. ఆదర్శ రైతు వ్యవస్థను తిరిగి ప్రారంభించడం ద్వారా రైతన్నలకు మరింత ప్రభుత్వ ఆలోచన విధానం, పథకాలు తెలుస్తాయని వెల్లడించారు. ఈ ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి ఆర్థిక భారం పడదని స్పష్టం చేశారు. ఇప్పటికే రైతు సంఘాలు, ఆదర్శ రైతులు సైతం ఎలాంటి గౌరవ వేతనం కూడా లేకుండా సేవ చేయడానికి ముందుకు వచ్చినట్లు కమిషన్ తన లేఖలో వివరించింది. ఆదర్శ రైతు వ్యవస్థ పై రానున్న అసెంబ్లీ సమావేశంలో చర్చించి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా తెలిపారు.

# కార్మిక సంఘాల్లోని కార్మికులందరూ దేశహితం కోసం పనిచేయాలి

### ఆర్‌ఎస్‌ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబాలే

**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబరు 25, ప్రభాతవార్త:** కార్మిక సంఘాలలో పని చేస్తున్న కార్మికులందరూ దేశహితం కోసం పని చేయాలనీ ఆర్‌ఎస్‌ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబాలే అన్నారు. గురువారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళా భవన్ లో బిఎంఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. అంతకు ముందు ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని జవహర్ నగర్ సీట్ నెంబర్ 9 లో విశ్వకర్మ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో బి ఎం ఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం భవనాన్ని ఆర్‌ఎస్‌ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబాలే, జాతీయ అధ్యక్షులు హిరణమయి పాండ్యా, ప్రధాన కార్యదర్శి రవీంద్ర హిమటే, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ లతో కలిసి కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు.



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని జవహర్ నగర్ బిఎంఎస్ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబాలే

దత్తాత్రేయ హోసబాలే మాట్లాడుతూ భారతీయ మజ్దూర్ సంఘంలో అన్ని రకాల కార్మికులు ఉన్నారని, సంఘ్ సిద్ధాంతం కూడా అదేనని అన్నారు. రాజనీతికి అతీతంగా కార్మిక సంఘం ఉంటూ దేశహితం కోసం, సమగ్రాభివృద్ధి కోసం పని చేయాలనీ అన్నారు. ప్రధానంగా కంపెనీ యాజమాన్యం కార్మికులు ఒక కుటుంబం భావనలో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. బిఎంఎస్ లో స్వదేశీ, ఆర్థిక, పర్యావరణం కూడా ఒక భాగం అని, అధ్యయనం శిక్షణ అవసరం అని, ఇందుకు ప్రస్తుతం ప్రారంభించిన కేంద్రంలో శిక్షణ అవసరాలకు ఉపయోగ పడుతుందన్నారు. బి.ఎం.ఎస్ నినాదం త్యాగం తపస్సు బలిదానం అని స్పష్టం చేసారు. బిఎంఎస్ వ్యవస్థాపకులు దత్తోపంత్ తెంగ్డి స్వదేశీ పర్యావరణం బడుగు వర్గాల కొరకు పోరాటం చేయడంతో పాటు కార్మికులు సంక్షేమం కొరకు తమ జీవనాన్ని త్యాగం చేశారని అన్నారు. మనం కేవలం కోర్కెల సాధన కొరకు మాత్రమే సంఘం పెట్టుకోమని, ఆర్థిక వికాసం దేశ సంక్షేమం కొరకు పనిచేయాలని అన్నారు. తెలంగాణ బి ఎం ఎస్ అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకారిణి బాగయ్య , బి ఎం ఎస్ జాతీయ అధ్యక్షులు హిరణమై పాండ్యా , ప్రధాన కార్యదర్శి రవీంద్ర హింతే , ఉపాధ్యక్షులు సుంకరి మల్లేశం, సంఘటన కార్యదర్శి బి సురేంద్రన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామ్ రెడ్డి, పూర్వజాతీయ ప్రధాన కార్యదర్శి కే లక్ష్మారెడ్డి, జాతీయ నాయకులు సురేంద్ర పాండే, దినేష్ మిశ్రా సాజీ నారాయణ్, రవిశంకర్ అల్లూరి, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.



## కొండారెడ్డిపల్లి సర్పంచ్, వార్డు సభ్యులకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్, డిసెంబరు 25:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్ నివాసంలో కొండారెడ్డిపల్లి సర్పంచ్ మల్లెపాకుల వెంకటయ్య,వార్డ్ సభ్యులు,గ్రామ నాయకులు కలిశారు.సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి. కాగా, కొండారెడ్డిపల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా వెంకటయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటయ్య,వార్డ్ సభ్యులను సిఎం అభినందించారు.

## నేడు టిజి టెట్ పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్, డిసెంబరు 25:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిజి టెట్) 2026 హాల్ టికెట్లు శనివారం(డిసెంబర్ 27) విడుదల కానున్నాయి. జనవరి 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో టెట్ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు రెండో సెషన్ నిర్వహించనున్నారు. టెట్ పరీక్షకు మొత్తం 2,37,754 దరఖాస్తులు రాగా, అందులో పేపర్ 1కు 85,538, పేపర్ 2కు 1,52,216 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. ఈసారి టెట్‌కు 1,66,084 మంది ఇన్ సర్వీస్ టీచర్లు దరఖాస్తు చేసుకోగా, అందులో పేపర్ 1కు 58,149 మంది, పేపర్ 2కు 1,52,216 మంది దరఖాస్తు చేసుకున్నారు.

## 11, 12, 13 తేదీల్లో చెరువుల దగ్గర కైట్ ఫెస్టివల్

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్, డిసెంబరు 25:** 11,12,13 తేదీలలో కైట్ ఫెస్టివల్ జరపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం రాత్రి ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్ నివాసంలో కలిశారు. హైడ్రా ఆధ్వర్యంలో చెరువుల పునరుద్ధరణను రంగనాథ్ వివరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చెరువుల దగ్గర కైట్ ఫెస్టివల్ ను నిర్వహించాలని సిఎం సూచించారు.టూరిజం శాఖ తో కలిసి ఘనంగా కైట్ ఫెస్టివల్ నిర్వహించాలని చెప్పారు. హైటెక్ సిటీ తుమ్మిడికుంటలో ఐటీ ప్రముఖులు,ఉద్యోగులను కైట్ ఫెస్టివల్ కి ఆహ్వానించాలని చెప్పారు. కూకట్ పల్లి నల్లచెరువు చెరువు దగ్గర సినిమా ప్రముఖులు,రాజేంద్రనగర్ బురుకుద్బిన్ చెరువు దగ్గర క్రీడాకారులతో కైట్ ఫెస్టివల్ నిర్వహించాలని చెప్పారు.

## రూ.295 కోట్లతో కొత్తగా 2.19 లక్షల టన్నుల గోదాములు

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా కొత్త గోదాములను నిర్మించాలని సర్కార్ నిర్ణయించింది. ఈ గోదాములను రాష్ట్రంలోని 26 ప్రాంతాల్లో 2.19 లక్షల టన్నుల సామర్థ్యంతో ఆధునిక పద్ధతిలో నిర్మించనుంది. ఇందుకు గాను మొత్తం రూ.295 కోట్లు వ్యయం అవుతాయని అంచనా వేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో 24.59 లక్షల టన్నుల సామర్థ్యమున్న 253 గిడ్డంగులున్నాయి. వీటి నిర్వహణలో సమస్యలున్నాయి. అదనంగా ఆధునిక సౌకర్యాలను కల్పించాలన్నా సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త గోదాములను సరకుల భద్రతకు, రవాణాకు అనుకూలంగా ఆధునిక పద్ధతిలో నిర్మించనుంది. తొలుత రూ.155.68 కోట్లతో 1.51 లక్షల టన్నుల సామర్థ్యమున్న 12 గోదాములను నిర్మించనుంది. వీటిని మెదక్, మంచిర్యాల, కరీంనగర్, హనుమకొండ, ములుగు, నల్గొండ, ఖమ్మం, పెద్దపల్లి, వికారాబాద్ జిల్లాల్లో నిర్మించనుంది. అలాగే రూ.140 కోట్లు నాబార్డు నిధులతో 1.40 టన్నుల సామర్థ్యమున్న 14 గోదాములను నిర్మించనున్నారు. సంగారెడ్డి, జగిత్యాల, కామారెడ్డి, మహబూబాబాద్, ఖమ్మం, నాగర్‌కర్నూల్, జనగామ జిల్లాల్లో నిర్మించనుంది.

## గోవిందరాజస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి,డిసెంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించు కుని గురువారం ఉదయం తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, అది కారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు సాగిన ఈ మహాయజ్ఞంలో ఆలయ అర్చకులు, ఆలయ ఏఇఒ భాస్కర నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి,ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల నుండి వెలుపల వరకు నీటితో శుభ్రంగా కడిగారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు.

# ఉక్రెయిన్ ప్రజలందరికీ పుతిన్ నశించిపోవాలనే ఆకాంక్ష!

### క్రిస్మస్ సందేశంలో దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**క్కీవ్, డిసెంబరు 25:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన క్రిస్మస్ సందేశంలో పుతిన్‌పై తీవ్రస్థాయి సంచలన పరోక్ష వ్యాఖ్యలు చేసారు. ఈరోజు మనమంతా ఒకే కలను పంచుకుంటామని ప్రతి ఒక్కరికి కూడా ఒకే ఒక్క కోరిక ఉందని ఆతడు నశించిపోవాలని అందరూ తమకుతామే చెప్పుకుంటున్నారని పరోక్షంగా పుతిన్‌పై వ్యాఖ్యలు చేసారు. రష్యా ఎన్నిబాధలు పెట్టినా, అత్యంత ముఖ్యమయిన వాటిని ఆక్రమించలేదని, బాంబుదాడులు చేయగలిగినా మనం ధీరోదాత్తంతోపోరాడుతున్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ హృదయం ఒకరిపై ఒకరికి ఉన్న విశ్వాసం మన ఐక్యతకు మూడేళ్లగా సాగుతున్న యుద్ధమే చిహ్నమని పేర్కొంటూ పరోక్షంగా పుతిన్ నశించిపోవాలనే ఉక్రెయిన్‌ప్రజానీకం ఆకాంక్షిస్తోందంటూ తన క్రిస్మస్ సందేశంలో పేర్కొన్నారు. దేశ ప్రజలకు క్రిసమ్మస్‌శుభాకాంక్షలు చెప్పిన జెలెన్‌స్కీ దేశంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక్షసక్రీడను అనుసరిస్తున్నారని ఆరోపించారు. క్రిస్మస్ రోజు కూడా ఉపేక్షించకుండా దళాలు దాడులుచేసాయని, ఇటీవలజరిపిన దాడుల్లో కనీసం ముగ్గురుచనిపోగా అనేక చోట్ల విద్యుత్‌సరఫరా నిలిచిపోయిందన్నారు. రష్యన్లు తమ వైఖరి ఏమిటో, తమ నిజస్వరూపం ఏమిటోక్రిస్మస్ రోజున రుజువుచేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఫహేద్, బాలిస్టిక్ క్షిపణులు, కింజాల్స్‌తో దాడులు వంటివి అనేకం చేస్తున్నారని, రష్యా దమనకాండ ఏరకంగా జరుగుతుందో ఇవే రుజువులని పేర్కొన్నారు. ఒకపక్క శాంతి ప్రణాళికల కోసం చర్చలుజరుగుతున్న తరుణంలో జెలెన్‌స్కీ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇప్పటికే దాడులపరంగా ఉక్రెయిన్‌లోని లూహాన్స్క్‌లో 70శాతం భాగాన్ని రష్యా ఆక్రమించుకుంది. డోనెట్స్క్ , డాన్‌బాస్ వంటివికూడా రష్యాచేతుల్లోకి వెళ్లిపోయాయి. వీటన్నింటినీ రష్యా తమ ప్రాంతాలుగానే చెపుతోంది. అయితే ఉక్రెయిన్‌మాత్రం ఎప్పటికీ అవి తమ భూభాగాలేనని చెపుతోంది. అలాగే ఝపోరిఝియా అణు విద్యుత్ ప్లాంట్‌ను కూడా రష్యా స్వాధీనంచేసుకుంది. వీటన్నింటి నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా విస్తృత ప్రచారంలోకి వచ్చాయి.



## నీటి కేటాయింపులపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం:బిజెపి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 25:** తెలంగాణ బీజేపీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో నీటి ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక కమిటీ వేసి ప్రాజెక్టులను సందర్శించనున్నారు టీబీజేపీ నేతలు. తెలంగాణ అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కమలం పార్టీ నేతలు షాకింగ్ కామెంట్స్ చేశారు.
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని కాషాయ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంపై నెపం పెడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో కృష్ణా జలాల్లో 299 టీఎంసీల నీటి కోసం ఒప్పందం చేసింది ఎవరనీ ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణకు నీటి వాటాలో అన్యాయం చేసింది కేసీఆరేనని ఆరోపిస్తున్నారు.
ఇన్నాళ్లు ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చి ఓటీపీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇప్పుడు తెలంగాణకు సరైన నీటి వాటా తీసుకురావడంలో విఫలం అవుతోందని మండిపడ్డారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా గతంలో కృష్ణా నీటిని తరలించుకు పోతుంటే కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఇదే అంశంపై తమ వాదనను బలంగా వినిపిస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఇప్పటికే నీటి వాటాలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని బీజేపీ నేతలు ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అన్యాయంపై సమగ్ర సమాచారం అందిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు.

## రాష్ట్రంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ రూ.6.50 కోట్లు

**హైదరాబాద్, డిసెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యాధునిక సింథటిక్ ట్రాక్ రాబోతోంది. రాష్ట్రంలోని జమ్మికుంటలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ అభివృద్ధికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ట్రాక్ ఏర్పాటు నిమిత్తం రూ.6.50 కోట్ల మంజూరు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో అనుమతిస్తూ అ శాఖ అండర్ సెక్రటరీ చంచల్ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సింథటిక్ ట్రాక్ ను నిర్మించి సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ లేఖ అందిన 15 రోజుల్లోగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. కాగా జమ్మికుంటలో స్టేడియాన్ని నిర్మిస్తామని కేంద్రం ఇటీవల ప్రకటించింది.



## సిఎం రేవంత్‌రెడ్డితో క్రిస్టియన్ మత పెద్దల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్, డిసెంబరు 25:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్ నివాసంలో పలువురు క్రిస్టియన్ మత పెద్దలు,చర్చి ఫాదర్లు కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్,ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. అంతకు ముందు సిఎం రేవంత్‌రెడ్డి ఓ సందేశంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి క్రిస్టియన్ సోదర, సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంతా క్రిస్మస్ వేడుకలను అనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏసు ప్రభుత్వ బోధనల స్ఫూర్తితో పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం అన్ని మతాల సంక్షేమం,అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

# ప్రియుడి మోజులో పడి భర్తను చంపిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

### నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో దారుణం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 25, ప్రభాతవార్త:** పిల్లలకు విద్యా బుద్ధులు చెప్పాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయులే, బుద్ధి గడ్డి తిని దారుణానికి ఒడిగట్టారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తనే కడతేర్చిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..అచ్చంపేట పట్టణంలోని మారుతి నగర్ కాలనీలో నివాసం ఉండే లక్ష్మణ్ నాయక్, పద్మ భార్యాభర్తలు. పద్మ ఇటీవలే 2024 డీఎస్సీలో ఎంపికై, ఉప్పునుంతల మండలం బట్టుకాడిపల్లి తండా పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో తాడూరు పాఠశాలలో పనిచేస్తున్న రాత్లావత్ గోపి అనే ఉపాధ్యాయుడితో పద్మకు వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి అక్రమ సంబంధానికి భర్త లక్ష్మణ్ అడ్డుగా ఉన్నాడని భావించి, ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని అనుకున్నది. పథకంలో భాగంగా ఇద్దరూ కలిసి అతి దారుణమైన ఉదంతానికి పూనుకున్నారు. ఇంట్లో పడుకున్న సమయంలో గత నెల 24న రాత్రి గాఢ నిద్రలో ఉన్న లక్ష్మణ్ నాయక్ ముక్కు, నోటిపై గుడ్డతో గట్టిగా నొక్కి ఊపిరాడకుండా చేసి దారుణంగా హత్య చేశారు.
మర్నాడు ఉదయం ఏమీ తెలియనట్లు పద్మ పాఠశాలకు వెళ్లి, అక్కడి నుంచి ఇంటి యజమానికి ఫోన్ చేసి హైడ్రామా కు తెర లేపింది. తన భర్త ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, తనకు భయంగా ఉందని నమ్మించే ప్రయత్నం చేసింది. తీరా ఇంటికి వచ్చి చూస్తే భర్త చనిపోయి ఉన్నాడని అందరినీ నమ్మించింది. అయితే లక్ష్మణ్ మృతిపై అనుమానం వచ్చిన అతని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.
పోలీసులు తమదైన శైలిలో విచారించగా, వివాహేతర సంబంధం వల్లే హత్య చేశామని నిందితులు ఒప్పుకున్నారు. దీంతో పద్మ, గోపిలను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. సభ్య సమాజం తలదించుకునేలా భార్య ఇలాంటి ఉదంతానికి ఒడికట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయంశం అయింది.

# మహబూబ్‌నగర్‌లో ఘోర ప్రమాదం

### స్కూల్ బస్సు బోల్తా, 40 మంది విద్యార్థులు
### పది మందికి తీవ్ర గాయాలు
### మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దపల్లి వద్ద ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 25, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లా మరికల్ మండలానికి చెందిన మణికంఠ జూనియర్ కళాశాల బాలబాలికలతో హైదరాబాద్‌లోని జల విహార్‌కు వెళ్తున్న స్కూల్ బస్సు మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దయపల్లి గ్రామ శివారులో ప్రమాదానికి గురైంది. ముందుగా వెళ్తున్న ఒక కారు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో, దానిని తప్పించబోయిన కాలేజ్ బస్ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడింది.
ఈ బస్సులో మొత్తం 40 మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా, అందులో 10 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనను కలెక్టర్ విజయేంద్ర బోయి, జిల్లా ఎస్పీ డి.జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, బాలానగర్ ఎస్సైలు స్వయంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. షాద్నగర్ దవఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను కలెక్టర్ పరామర్శించారు. స్కూల్ బస్సు బోల్తా పడిన సమయంలో వనపర్తి పర్యటన కు వెళ్తున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తన కాన్వాయ్ ను ఆపి బస్సు దగ్గరికి వెళ్లారు. ప్రమాద స్థలం లో ఆక్సిడెంట్ అయిన కార్ ను మంత్రి స్వయంగా పక్కకు తోశారు. బోల్తా పడ్డ బస్సును క్రేన్ సాయంతో పక్కకు తీయించారు. హైదరాబాద్ వెళ్లే రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం కావడం తో మంత్రి స్వయంగా ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. గాయపడ్డ విద్యార్థుల దగ్గరికి వెళ్లి వారిని పరామర్శించారు. ప్రమాదానికి గురై భయ భ్రాంతులకు లోనైన విద్యార్థులకు మంత్రి ధైర్యంచెప్పారు. ఈ



ప్రమాదం లో గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని షాద్ నగర్ డాక్టర్ లకు ఫోన్ చేసి చెప్పారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## జోన్లు ఆరు నుంచి 12కు, సర్కిళ్లు 30 నుంచి 60కి పెంపు

### కొత్త జోన్‌లలో ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, గోల్కొండ, శంషాబాద్, రాజేంద్రనగర్
### జిహెచ్ఎంసి డీలిమిటేషన్‌కు సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 25:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) డీలిమిటేషన్‌కు సంబంధించిన తుది నోటిఫికేషన్ విడుదలైంది. జోన్లు, సర్కిళ్లు, డివిజన్ల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీలో జోన్లను 6 నుంచి 12కు, సర్కిళ్లను 30 నుంచి 60కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. జిహెచ్ఎంసిని ఓఆర్ఆర్ వరకు విస్తరించడంతో జోన్లు,సర్కిళ్లు పెరిగాయి. డివిజన్ల సంఖ్యను 300కి పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేశారు. కొత్తగా ఏర్పాటవుతున్న జోన్లలో ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, గోల్కొండ, శంషాబాద్, రాజేంద్రనగర్ ఉన్నాయి. ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌లను ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా డివిజన్లు, సర్కిళ్లు, జోన్ల సంఖ్యను రెండింతలు చేశారు. డివిజన్ల డీలిమిటేషన్‌కు సంబంధించి ఈనెల 9న ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడగా, 10 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించారు. డివిజన్ల విభజనపై ఆరు వేలకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. వాటిని పరిశీలించిన అధికారులు సహేతుకమైన వాటిని పరిగణనలోకి తీసుకుని తుది నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సర్కిల్ ఆఫీసులలోనే కొత్త జోన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. వార్డు ఆఫీస్‌లలో నూతన సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. కొత్తగా ఏర్పాటు కానున్న జోనల్,సర్కిల్ కార్యాలయాల నుంచే పరిపాలన సాగుతోంది.

# యేడాది ఆఖరులో భారీగా తరలివచ్చిన భక్తులు!

**తిరుమల,డిసెంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం రావడం...ఏడాది ఆఖరుకావడంతో వరుసగా మూడురోజులు సెలవులతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భారీగా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. తమిళనాడు,కర్నాటక, తెలుగురాష్ట్రాలుతో బాటు మహారాష్ట్ర,కేరళనుండి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి సామాన్యభక్తులు గురువారం ఉదయానికే తిరుపతిలో పోటెత్తారు. 40వేలమందికిపైగా భక్తులు తిరుపతిలోనే నిరీక్షిస్తుండటంతో అన్ని ప్రైవేట్ హోటళ్ళు, లాడ్జీలు, చిన్నపాటి లాడ్జీలు, హోమ్‌స్టేలు కిటకిటలాడుతున్నాయి. తిరుపతిలో సామాన్యభక్తులకు ఆఫ్‌లైన్‌లో శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి(1)గంట సమయంలో జారీచేసే టైమ్‌స్లాట్ (సర్వదర్శనం)ఉచిత టోకెన్లను భారీగా భక్తులు క్యూలైన్లలో చేరడంతో గురువారం ఉదయం 10గంటలకే టోకెన్లు జారీని ప్రారంభించారు. రోజువారీగా 12వేలు నుండి 15వేల వరకు జారీచేసే టైమ్‌స్లాట్ ఉచిత దర్శన టోకెన్లను విపరీతమైన రద్దీ కారణంగా,తిరుమలలో వైకుంఠం 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరి ఉద్యానవనాల్లోని 9 కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు నాలుగుకిలోమీటర్లు వెలుపల క్యూలైన్లు చేరాయి. తిరుమలలో ఉన్న భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించేందుకు టైమ్‌స్లాట్ టోకెన్లను 8వేలనుండి 10వేలుమాత్రమే జారీ చేశారు. 10గంటలకు ప్రారంభించడంతో 12గంటలకే టోకెన్లు జారీ పూర్తయ్యింది. ఆపై కాలినడకన దివ్యదర్శనం టోకెన్లు జారీని ప్రారంభించారు. నిమిషాల్లోనే రెండువేల టోకెన్లు జారీ చేసేశారు. మరో 15వేలమంది వరకు భక్తులు ఆయా కౌంటర్ల వద్ద బారులుతీరి నిలబడ్డారు. అప్పటికే టోకెన్లు పూర్తవడంతో చేసేదిలేక భక్తులు ఓపిక నశించి క్యూలైన్లలో తోపులాటకు దిగారు.అప్పటికే అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద గందరగోళం నెలకొనడంతో సమాచారం అందుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీ కృష్ణ ఆదేశాలతో తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, అలి పిరి సిఐ పివిఎస్ రామకిశోర్, అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ, అదనపు బలగాలు అక్కడకు చేరుకున్నారు. కాగా ఉదయంనుండి క్యూలైన్లలో నిలబడిన భక్తులకు కూడా టోకెన్లు లభించకపోవడంతో గందరగోళం నెలకొంది. మధ్యాహ్నం 1గంటకు జారీచేయాల్సిన టోకెన్లను వఖంద్ంగానే జారీచేసేయండంతో మరింత గందరగోళంగా మారింది. పరిస్థితులు అదుపుచేసేందుకు స్వయంగా సిఐ స్థాయి అధికారులు రంగంలోకి దిగారు. భక్తులకు సూచనలు చేస్తూ సంయమనంతో ఉండాలని, టోకెన్లను రేపు ఉదయం జారీచేస్తామని చెప్పడంతో కొంతవరకు పరిస్థితి అదుపులోకి వచ్చింది. భారీగా భక్తులు రావడంతో క్యూలైన్లలో తోపులాటకు దారితీసింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు సకాలంలో స్పందించారు. కాగా వైకుంఠద్వార దర్శనాలు మొదలవడానికి ఐదురోజుల ముందే తిరుపతిలో భక్తులు భారీగా బారులు తీరడంతో ఇప్పుడు ముందుముందు పరిస్థితి ఏంటనేది పోలీసులు తలలుపట్టుకుంటున్నారు. ఏదేని అవాంఛనీయసంఘటనలు తలెత్తకుండా ముందుగానే భారీగా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు క్యూలైన్లలోనే ఏడుకొండలవాడా గోవిందా గోవింద అంటూ నినాదాలు చేస్తున్నారు. కాగా భక్తులను నియంత్రించడానికి పోలీసులు సంయమనంతో వ్యవహరించారు. లాఠీఛార్జీ చేశారని వదంతులు రావడంతో స్వయంగా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సిసికెమెరాల్లో పరిస్థితిని సమీక్షించారు. భక్తులను నియంత్రించడంలో పోలీసులు సహనంతో పనిచేశారని, ఎక్కడా ఎటువంటి లాఠీఛార్జిగానీ, తొక్కిసలాటజరగలేదని తెలిపారు.

తిరుపతిలో టైమ్‌స్లాట్ దర్శన టోకెన్ల కష్టాలు
- ముందుగానే టోకెన్లు జారీతో భక్తుల ఆవేదన
- పరుగులతో లైన్లను నియంత్రించిన పోలీసులు




తిరుపతి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌వద్ద టోకెన్లుకు పడిగాపులు



## గంటల తరబడి క్యూలైన్లలోనే భక్తులు

### సర్వదర్శనానికి 26గంటలుపైగానే

**తిరుమల,డిసెంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం రోజులు,వరుసగా నాలుగురోజులు సెలవులు కావడంతో దేశం నలుమూలల నుండి భక్తులు భారీగా తిరుమలకు చేరుకుంటున్నారు. గురువారం ఉదయానికి వైకుంతమ్ క్యూకాంప్లెక్స్‌లు నండిపోయి శిలాతోరణం వరకు ఐదుకిలోమీటర్లు వెలుపలకు చేరాయి. వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు తరలిరావడంతో నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. శ్రీవారి సాధారణ సర్వదర్శనానికి ఉదయానికి (ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేనివారికి)24గంటలు సమయం కేటాయిస్తున్నారు. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 12గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఏడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో తిరుమలలో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. క్యూలైన్లను స్వయంగా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షిస్తున్నారు. త్వరగా దర్శనం చేయించేలా చూస్తున్నారు. సాయంత్రం వరకు 49వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.




# ఓఆర్ఆర్ భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్

## - 4 జిల్లాల్లో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ

## - పల్నాడు, ఏలూరు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ

## బాహ్యవలయ రహదారి నిర్మాణంపై అభ్యంతరాల స్వీకరణ

విజయవాడ, డిసెంబరు 25 ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. ఇప్పటికే నాలుగు జిల్లాలకు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఓఆర్ఆర్ ప్రాజెక్టు కోసం భూసేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రచురించింది. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు వచ్చే వారం కేంద్రానికి పంపనున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లాకు కూడా గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన జిల్లాల్లోని జాయింట్ కలెక్టర్లు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించే పనిని ప్రారంభించారు. రైతులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలియజేయడానికి ఇది ఒక అవకాశం. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని చూస్తోంది. ఓఆర్ఆర్ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను (వివరాల ప్రాజెక్టు నివేదిక) కేంద్ర మంత్రివర్గం ఆమోదించేలోపు భూసేకరణ ప్రక్రియను ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సంబంధించి కేంద్రం ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో భూసేకరణ ప్రక్రియ వేగవంతం కానుంది. ఇక్కడి రెవెన్యూ అధికారులు భూముల వివరాలను విబీతి।కి అందజేశారు. ఈ వివరాలను విబీతి। ఉన్నతాధికారులు పరిశీలించిన తర్వాత, ఎన్టీఆర్ జిల్లాలో కూడా భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఇప్పటికే కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన పల్నాడు జిల్లాలో, జాయింట్ కలెక్టర్ భూ యజమానుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. ఏలూరు జిల్లాలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు వచ్చే వారం నోటిఫికేషన్ జారీ చేసి, 21 రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. కొన్ని ప్రాంతాల్లో 140 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పుతో భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. రోడ్డు మార్గం (ఎలైన్‌మెంట్) ప్రకారం, కొన్ని సర్వే నంబర్లలో మొత్తం భూమిని, మరికొన్నింటిలో కొంత భాగాన్ని సేకరించాల్సి ఉంటుంది. అయితే, ఆ సర్వే నంబర్లన్నింటినీ గెజిట్‌లో పేర్కొంటున్నారు. ఈ భూసేకరణ ప్రక్రియలో భూ యజమానులు తమ అభ్యంతరాలను సకాలంలో తెలియజేయాలని అధికారులు సూచిస్తున్నారు. జాయింట్ కలెక్టర్లు రైతులు, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చిన పెగ్ మార్కింగ్ చేయిస్తారు. ఈ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్లు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను చాలా జాగ్రత్తగా పరిశీలిస్తారు. వారికి రాతపూర్వకంగా సమాధానం చెప్పిన తర్వాతే భూమిని కొలవడానికి రంగం సిద్ధం చేస్తారు. భూమిని కొలిచేటప్పుడు, కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గం (ఎలైన్‌మెంట్) ప్రకారమే చేస్తారు. జీపీఎస్ అనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, భూమి యొక్క ఖచ్చితమైన స్థానాలను గుర్తిస్తారు. రోడ్డు కోసం 140 మీటర్ల వెడల్పులో, దాని మధ్య భాగం నుంచి ఇరువైపులా 70 మీటర్ల చొప్పున గుర్తులు (పెగ్స్) పెడతారు. ఈ గుర్తులు పెట్టడం వల్ల ఏ సర్వే నంబరులో ఎంత భూమి తీసుకోవాలి, ఆ భూమి వ్యవసాయానికి పనికొచ్చేదా లేక ఎండిన భూమా, అందులో ఏవైనా చెట్లు ఉన్నాయా, ఇళ్లు కట్టుకున్నారా వంటి విషయాలు స్పష్టంగా తెలుస్తాయి. ఈ వివరాలన్నీ రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు కలిసి ఒక ప్లాన్‌గా తయారుచేస్తారు. ఈ ప్లాన్‌ను సంయుక్త కలెక్టర్‌కు ఇస్తారు. సంయుక్త కలెక్టర్లు ఈ ప్లాన్‌ను భూమిరాశి అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. అన్ని వివరాలను పరిశీలించిన తర్వాత, కేంద్రం తుది నోటిఫికేషన్ (3డి నోటిఫికేషన్) జారీ చేస్తుంది. కేంద్ర మంత్రివర్గం ఓఆర్ఆర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడు ఈ నోటిఫికేషన్ వస్తుంది. ఆ తర్వాత, భూమి యజమానులు తమ భూమికి సంబంధించిన పత్రాలు, ఆధారాలు చూపించి, ఆ భూమి తమదేనని నిరూపించుకోవాలి. చివరగా, ఏ సర్వే నంబరులో ఎంత భూమి తీసుకుంటున్నారో, దానికి ఎంత డబ్బు చెల్లిస్తారో నిర్ణయించి, అధికారికంగా అవార్డు (పాస్) చేస్తారు.



## రాయలసీమ రైతు బతుకు 'నాగేటి తడి'

తిరుపతి విద్య, డిసెంబరు 25 ప్రభాతవార్త: యస్వీయూ విశ్రాంత ఆచార్యుడు నాగోలు కృష్ణారెడ్డి రాసిన దీర్ఘకవితా సంపుటి నాగేటి తడి" దీర్ఘకవిత పుస్తకాన్ని యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆవిష్కరించారు. ఉపన్యాసకులుగా ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి, భూమన్ పాల్గొన్నారు. పుస్తక సమీక్షను తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ చేశారు. ఈ కార్యక్రమాన్ని యస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకులు ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య అప్పారావు మాట్లాడుతూ, సాహిత్యంతో సంబంధం లేకపోయినా ఒక్కసారి ఈ కవిత్వం చదివితే రైతు రూపం, కష్టాలు పూర్తిగా తెలుస్తాయని, తాను పుట్టి పెరిగిన ఉత్తరాంధ్ర రైతుల జీవితం లాగానే రాయలసీమ రైతుల దయనీయంగా కనిపిస్తోందని అన్నారు. రైతులు వర్షం కోసం, గిట్టుబాటు ధర కోసం పడుతున్న బాధలను రచయిత చక్కగా వివరించారు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ తాను కూడా రైతు బిడ్డగా జీవించానని, ఇప్పటికీ చిత్తూరు దగ్గర తమ ఊరికి వెళితే కొంత సమయమైనా పొలంలో వుంటానని అన్నారు. సూర్యుడి కంటే ముందు లేసే రైతు జీవితం తాను గ్రామంలో చూసిన విధంగా కృష్ణారెడ్డి కవిత్వం ఉందని అన్నారు. ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి మాట్లాడుతూ రైతు గురించి చెప్పాలంటే రైతు జీవితం అనుభవించి ఉండాలని, పుస్తక కర్త తన తండ్రి రైతుగా పడిన బాధలను అక్షరబద్ధం చేసినా, అది అందరికీ చెందిందని అన్నారు. ఆ సభలో ఆహ్వానం డా రాజశేఖర్, వందన సమర్పణ సంతోష్ కుమార్ చేశారు. రచయితలు రాసాని, కొత్వాలు అమరేంద్ర, కృష్ణస్వామి రాజు, మల్లీశ్వర రావు, మన్నవ గంగాధర ప్రసాద్, పూర్వ రిజిస్ట్రార్లు సత్యవేలు రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఆచార్య గోవిందరాజు, నూనె అంకమ నాయుడు పలువురు సాహితీ ప్రముఖులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



## వ్యవసాయ పనుల్లో మంత్రి నిమ్మల

పాలకొల్లు, డిసెంబరు 25 ప్రభాతవార్త: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు రైతుగా మారారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ, శాఖాపరమైన పనులు, పార్టీ బాధ్యతలతో రోజుకు 18 గంటల పాటు అహర్నిశలు కష్టపడే మంత్రి రామానాయుడు.. కొద్దిపాటి తీరిక లభించినప్పుడల్లా తనకు అత్యంత ఇష్టమైన వ్యవసాయ పనుల్లో నిమగ్నం అవుతున్నారు. క్రిస్మస్ సందర్భంగా లభించిన స్వల్ప సెలవును సద్వినియోగం చేసుకుని ఆయన తన సొంతూరు ఆగర్తిపాలెంలో ఉన్న పొలానికి వెళ్లారు. ట్రాక్టర్‌తో దుక్కు దున్ని, గట్టు లంకలు వేస్తూ స్వయంగా వ్యవసాయ పనులు చేశారు. ఈ అనుభవం తనకు ఎంతో తృప్తిని, ఆనందాన్ని కలిగించిందని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే అయినా, మంత్రి అయినా.. తీరిక దొరికి నప్పుడు ఒక గంటైనా, ఒక పూటైనా వ్యవసాయ పనులు చేస్తే రైతు కష్టం, వ్యవసాయ విలువ నిజంగా అర్థమవుతుంది" అని మంత్రి అభిప్రాయపడ్డారు. చిన్నప్పటి నుంచీ తండ్రి వద్ద నేర్చుకున్న వ్యవసాయ పనులను, అవకాశం దొరికిన ప్రతిసారి చేస్తూ.. అన్నం పెట్టే అన్నదాత కృషిలో తానూ భాగస్వామిగా ఉండడం వ్యక్తిగతంగా ఎంతో సంతృప్తినిస్తుందని డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## ఐదేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ కార్డ్ అప్డేట్ తప్పనిసరి

విజయవాడ, డిసెంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పథకాలు, ధ్రువపత్రాలు, స్కాలర్‌షిప్‌లు వంటి వాటికి ఆధార్ కార్డు చాలా ముఖ్యం. చిన్నతనంలో ఆధార్ కార్డు తీసుకున్నా, ఐదేళ్లు దాటిన పిల్లలు, అలాగే 15 ఏళ్లలోపు ఒకసారి తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా, ఐదేళ్లు దాటిన చిన్నారులకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలి. అలాగే 15 సంవత్సరాలలోపు పిల్లలు, ఎప్పటి నుంచో అప్‌డేట్ చేయని ఆధార్‌లను ఈకేవైసీ ద్వారా అప్డేట్ చేసుకోవాలని యుఐడిఎఐ సూచించింది. పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఇచ్చే బాల ఆధార్‌లో వేలిముద్రలు, ఐరిస్ వంటివి ఉండవు. కేవలం పేరు, ఫొటో, పుట్టిన తేదీ మాత్రమే ఉంటాయి. తల్లిదండ్రుల వివరాలతో ఈ బాల ఆధార్ జారీ చేస్తారు. అయితే, పిల్లలకు ఐదేళ్లు నిండిన తర్వాత, వారి వేలిముద్రలు, ఐరిస్‌తో బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇది ఆధార్‌ను ఎప్పటికప్పుడు సరిగ్గా ఉంచుకోవడానికి




సహాయపడుతుంది. పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఇచ్చే బాల ఆధార్‌లో వేలిముద్రలు, ఐరిస్ వంటివి ఉండవు. కేవలం పేరు, ఫొటో, పుట్టిన తేదీ మాత్రమే ఉంటాయి. తల్లిదండ్రుల వివరాలతో ఈ బాల ఆధార్ జారీ చేస్తారు. పిల్లలకు ఐదేళ్లు నిండిన తర్వాత, వారి వేలిముద్రలు, ఐరిస్‌తో బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇది ఆధార్‌ను ఎప్పటికప్పుడు సరిగ్గా ఉంచుకోవడానికి సహాయపడుతుంది. ఐదేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించినట్లయితే, వారు ఐదేళ్లు దాటిన తర్వాత తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలి. దీనిని మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) అని పిలుస్తారు. ఇది పిల్లలకు సంబంధించిన మొదటి బయోమెట్రిక్ అప్‌డేట్. ఈ ప్రక్రియలో, పిల్లల పూర్తి డేటాను మళ్లీ సమర్పించాల్సి ఉంటుంది. అయితే, ఈ అప్‌డేట్ వల్ల పిల్లల ఆధార్ నంబర్‌లో ఎలాంటి మార్పు ఉండదు. ఒకవేళ పిల్లల ఆధార్‌ను అప్‌డేట్ చేయించకపోతే, వారి ఆధార్ నంబర్ పనిచేయడం ఆగిపోతుంది (డీయాక్టివేట్ అవుతుంది). ఐదేళ్లు దాటిన పిల్లల ఆధార్ అప్‌డేట్‌ను, వారి ఏడేళ్లు నిండేలోపు, అంటే రెండేళ్ల వ్యవధిలోపు తప్పనిసరిగా పూర్తి చేయాలి. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోని చిన్నారుల సమాచారాన్ని సేకరించింది. ఈ సమాచారాన్ని గ్రామ, వార్డు సచివాలయాల వారీగా పంపించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆధార్ బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయించుకోవడానికి సచివాలయ ఉద్యోగులను నేరుగా కలవాలి. ఈ అప్‌డేట్ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రత్యేక ఆధార్ శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాల ద్వారా కూడా పిల్లల బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చు.



లూథరన్ చర్చిలో ప్రార్థనల్లో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి

## శ్రీకాళహస్తిలో క్రిస్‌మస్ వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 25 ప్రభాతవార్త: ఏసు ప్రభు ప్రేమా నురాగాలు, అందరికి పంచారని, ఆయన ఆచరించిన మార్గాన్ని ఆచరిస్తూ అందరి అభివృద్ధికి పాటుపడదామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని లూథరన్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. అంతేకాక ఫాదర్ ఆశీర్వచనాలను అందుకున్నారు. పలువురు చిన్నారులు ఆయనతో సెల్ఫీలు దిగటానికి ఉత్సాహం చూపారు. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్‌మస్ పండుగను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పలుచర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. లూథరన్‌చర్చి, కేథలిక్ చర్చిల్లో క్రైస్తవ సోదరులు విశేషసంఖ్యలో హాజరయ్యారు. పలువురు చిన్నారులు ఏసుక్రీస్తు జన్మదినం, పలుఅంశాలతో నాటకాలను ప్రదర్శించారు.



## ప్రధాని మోడీతోనే బిసిలకు న్యాయం

## - బిజెపి ఎంపి ఆర్ కృష్ణయ్య

విజయవాడ, డిసెంబరు 25 ప్రభాతవార్త: చట్టసభలలో బిసిల రిజర్వేషన్ల సాధనకు ప్రతి ఒక్క బిసి తమ ఆత్మ గౌరవ పోరాటంగా బిసి బిల్లు సాధనకు కృషి చేయాలని దేశవ్యాప్తంగా ఉధృతంగా ఉద్యమించాలని బిజెపి ఎంపి ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్ మారేష్ సభ అధ్యక్షతన నిర్వహించిన బిసి కుల సంఘాల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. బిసిల పక్షపాతి అయిన దేశ ప్రధాని నరేంద్ర మోడీతోనే బిసిలకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నామని, ఉక్కు సంకల్పంతో బిసిలందరూ బిసి బిల్లు కోసం పోరాడాలన్నారు. త్వరలో మారేష్ అధ్యక్షతన విశాఖపట్నం, తిరుపతి విజయవాడల్లో బిసి కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తామని, తదుపరి అన్ని బిసి కుల సంఘాలను కలుపుకొని జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటిస్తామన్నారు. సిఎం చంద్రబాబు నాయుడుపై బిసి కుల సంఘాలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కులగణన ప్రారంభించి బిసిల జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయించాలని, పూర్తిస్థాయిలో బిసి కార్పొరేషన్ల ప్రకటించడంతో పాటు జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయించాలన్నారు. మారేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉన్న బిసి ప్రజాప్రతినిధులందరూ బిసిల రిజర్వేషన్ల సాధనకు ముఖ్యమంత్రితో చర్చలు జరపాలన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో బిసిలకు న్యాయం జరగాలంటే కులగనున్న ప్రక్రియ సక్రమంగా జరగాలి కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 139 పైగా కుల సంఘాలు కులగరన కోసం ఎదురుచూస్తున్నాయని. కుల గణన తేదీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో జక్క శ్రీనివాస్ యాదవ్, యార్లగడ్డ సందీప్, ఎల్ల బాబు, తోకల రవి, ఆకునూరు సుబ్బారావు, నాగేంద్ర, వీరన్న, 50పైగా బిసి కుల సంఘాలు, కుల సంఘాల ముఖ్య నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లాలోనే రాపూరును ఉంచాలి

రాపూరు (నెల్లూరు), డిసెంబరు 25 ప్రభాతవార్త: రాపూరు మండలాన్ని ఇప్పుడు వున్న విధంగానే నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ రాపూరు జాయింట్ యాక్షన్ కమిటీ గత వారం రోజులుగా చేస్తున్న దీక్షలు గురువారం నాడు తీవ్రతరం దాల్చాయి. రాపూరు మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ చేస్తున్న దీక్షలకు ఇప్పటికే తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ పెంచలకోన దేవస్థానం ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డిలు మద్దతు ప్రకటించారు. గురువారం రాపూరును నెలూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ చేస్తున్న దీక్షలకు రాపూరులోని వర్తక, వ్యాపారులు, పలువురు ప్రవేటు వైద్యులు, ఆర్‌యంపీ వైద్యులు, భవన నిర్మాణ కార్మిక సంఘాలు, ఎలక్ట్రిషియన్ వర్కర్స్ అసోషియేషన్, మోటర్ యూనియన్ అషోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలైన యూటిఎఫ్, ఎపిటిఎఫ్ సంఘాలు, హామాలి వర్కర్స్, ఆటో డ్రైవర్‌ల యూనియన్ సభ్యులు, రిటైర్డ్ ఏంప్లాయిస్ యూనియన్‌లు వారి పూర్తి మద్దతు తెలుపుతూ తిరుపతి జిల్లా వద్దు నెల్లూరు జిల్లా ముద్దు అంటూ నినాదాలు చేశారు.




## కలువాయిని మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలి

కలువాయి (నెల్లూరు), డిసెంబరు 25 ప్రభాతవార్త: ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఉన్న కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లా గూడూరు డివిజన్ పరిధిలోకి మార్చేందుకు ప్రభుత్వం నుండి విడుదలైన గెజెట్‌ను తెలుసుకొని వ్యతిరేకిస్తూ కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే,ఆత్మకూరు డివిజన్ పరిధిలోనే కొనసాగేలా ప్రభుత్వం నుండి సానుకూల మైన స్పందన రావాలని అన్ని వర్గాల ప్రజలు కలువాయి మండలంలో గత 25 రోజుల నుండి చేస్తున్న నిరసనలు, నిరాహారదీక్షలు రోజురోజుకి ఉధృతమౌతున్నాయి. స్థానిక బస్టాండ్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్ష, గురువారానికి 17 వ రోజుకు చేరింది. అదే విధంగ గ్రామంలోని యువకులు పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించి సేవ్ కలువాయి అంటు నినాదాలతో తిరుపతి మాకొద్దు నెల్లూరు జిల్లానే ముద్దు అంటు గ్రామంలో హోరెత్తించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మాప్రాంత వాసులకు న్యాయం చేయాలని నిరసన కారులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు.



## అప్పిరెడ్డి హరినాథరెడ్డికి ఆటా లిటరరీ ఎక్స్‌లెన్స్ అవార్డు

అనంతపురం, డిసెంబరు 25 ప్రభాతవార్తబ్యూరో: సాహితీ సాంస్కృతిక రంగాలలో రెండు దశాబ్దాలుగా డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి చేస్తున్న విశేష కృషిని గుర్తించి అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వారు ఆటా ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రకటించారు. హైదరాబాదులో జరుగుతున్న ఆటా వేడుకలు సందర్భంగా డిసెంబరు 27న రవీంద్ర భారతిలో జరగనున్న ముగింపు ఉత్సవసభలో అవార్డును హరినాథరెడ్డి అందుకోనున్నారు. డా అప్పిరెడ్డి హరినాథరెడ్డి రాయలసీమ ప్రాంతంలో వెలుగులోకి రాని అనేక సాహితీ సాంస్కృతిక అంశాలను, పత్రికలను వెలుగులోకి తెచ్చారు. సాధన పత్రికపై వీరు వెలువరించన పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం కూడా 2014లో అందుకున్నారు. సాహిత్య పరిశోధనతో పాటు నిరంతరం రాయల సామాజిక సమకాలిన విషయాలపై వందలాది వ్యాసాలు రాసారు. కేవలం సాహిత్య పరిశోధనలకే పరిమితం కాకుండా వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం, రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన పౌండేషన్ తదితర సంస్థలు స్థాపించి విస్తృతంగా సాహితీ కార్యక్రమాలు, రాయలసీమ సాంస్కృతికోద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత దశాబ్దకాలంగా రాయలసీమ మహాకవిసమ్మేళనాలు, సీమ సాహితీ పోటీలు, తెలుగు భాషా సాహిత్య కార్యక్రమాలు, ఉపన్యాసాలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తూ కొత్తతరం సాహిత్యరంగలోకి రావడానికి కృషి చేసారు. వేమన భావాజాలం విద్యార్థులలోకి తీసుకెళ్ళడానికి ప్రతి ఏడాది వంద విద్యాసంస్థలలో పద్యపోటీలు నిర్వహిస్తున్నారు. ఆటా ఆహ్వానంపై చికాగో, నాటా ఆహ్వానంపై డల్లాస్ వెళ్లి సాహితీసభలలో పాల్గొన్నారు. అక్కడ అనేక సంస్థల నుండి ఇదివరకే పురస్కారాలు కూడా అందుకున్నారు.

# నెల్లూరులో నడిరోడ్డుపై ఒకరి ఆత్మహత్యాయత్నం



నెల్లూరు క్రైమ్, డిసెంబరు 25 ప్రభాతవార్త: నెల్లూరు నగరంలోని కనకమహాల్ సెంటర్ వద్ద గల ఓ షాపింగ్ మాల్ ఎదుట పట్టపగలు అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన అమీర్‌వలి వృత్తిరీత్యా బేల్దారి మేస్త్రి. ఆయన బేల్దారి పనుల నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. ఇక్కడ పని దొరకకపోవడంతో మానసిక ఆందోళనలో ఉదయం 10.30 గంటల సమయంలో నగరంలోని సిఎంఆర్ షాపింగ్ మాల్ ముందు మెయిన్ రోడ్ ఒక చిన్న కత్తితో తన మెడ, కడుపు భాగాల్లో తానే కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటనపై 112 కాల్ అందగానే సంతపేట పోలీస్ స్టేషన్ సిఐ వైవి సోమయ్య తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, అమీర్ వలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా లేదని వైద్యులు తెలిపారు. సంఘటన విషయం బాధితుని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. నడిరోడ్డుపై పట్టపగలు జనసమ్మర్థం ఉన్న ప్రాంతంలో వ్యక్తి కత్తితో తనకు తానే ఆత్మహత్యకు పాల్పడుతూ ఉండడాన్ని పాదచారులు, బైక్‌లపై వెళ్లేవారు గమనిస్తున్నప్పటికీ ఎవరు అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం విచారకరం.



# రాజంపేటలో గంజాయి ముఠా అరెస్ట్

రాజంపేట, డిసెంబరు 25 ప్రభాతవార్త: ఓ డాబా కేంద్రంగా గంజాయి విక్రయించే ముఠాను మల్లూరు పోలీసులు గుట్టురట్టు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తెచ్చి స్థానికంగానూ, లారీల డ్రైవర్ల ద్వారాను సరఫరా చేసేవారు. మన్నూరు సిఐ జే.ప్రసాద్ బాబు వివరాల మేరకు సమాచారం ఇలాఉంది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గంజాయి పై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అందులో భాగంగా మన్నూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. గంజాయి తాగే వారిపై, విక్రయించే వారిపై నిఘా పెట్టారు.
రాజంపేట, పుల్లంపేట మండలాల్లో గంజాయి సరఫరా అవుతుందని తెలిసింది. బోయినపల్లిలో ఓచోట గుంపులు గుంపులుగా యువకులు ఉన్నారని సీఐకి సమాచారం అందింది. సిబ్బందితో కలిసి దాడి చేశారు. అక్కడ గంజాయి విక్రయించే వారు దొరికారు. 10 కేజీల గంజాయి దొరికింది. తిరుపతి జిల్లా వడమాల పేట కు సమీపంలో డాబాలో గంజాయి కేంద్రంగా సరఫరా అవుతుందని బయటపడింది. బీహార్ కు చెందిన రంజిత్ కుమార్ మహదేవ చౌదరి డాబాలో పనిచేస్తూ గంజాయి ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించి సరఫరా చేసేవారు. స్థానికంగానూ, డాబాకు వచ్చే డ్రైవర్లకు విక్రయించేవారు.
పోలీసుల దాడిలో వీరిద్దరితో పాటు వడమాల పేట మండలం లక్ష్మీ ్మపురం కు చెందిన రావెళ్ల కృష్ణమోహన్ ,రైల్వే కోడూరు మండలం సమతా నగర్ కు చెందిన మాడగడపాల దియా, పుల్లంపేట చెందిన దాసరి అరుణ్, దలవాయిపల్లి చెందిన కట్టే ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాజంపేట మండలం ఇసుకపల్లి రోడ్‌లో లక్ష్మీ ్మపురంలో నివాసం ఉంటున్న పిడుగు అజయ్ లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్‌లు, మూడువేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

# అవతార్ వెనుక 'పావనీ'



సినిమా చరిత్రలోనే 'అవతార్ ఓ అద్భుతం. అందులోని పాత్రలు పండరా గ్రహంలో సంచరించినా, నీటిలోపల విహారించినా, తాజాగా అగ్నిపర్వత ప్రాంతాల్లో నివసిస్తున్నా.. ప్రేక్షకులకు మరో లోకాన్ని పరిచయం చేస్తాయి. అందుకు కారణం అత్యద్భుతమైన విజువల్ ఎఫెక్. వీటిని అందించి ప్రేక్షకుల మనసులతోపాటు అవార్డుల్నీ అందుకుంది 'వెటా ఎఫ్ఎక్స్'. ఆ సృజనాత్మక బృందంలో సీక్వెన్స్ సూపర్‌వైజర్‌గా చేసింది. మనమ్మాయే పేరు పావనీ రావు బొడ్డపాటి. ఫైర్ అండ్ యాష్ సహా మూడు అద్భుత 'అవతార్' చిత్రాలని ప్రేక్షులకి అందించారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూపన్. ఈ వండర్ విజువల్స్ వెనకున్న ఓ సృజన పేరే.. పావనీ రావు. అవతార్ (ఫైర్ అండ్ యాష్)తో సహా గతంలో వచ్చిన మరో రెండు అవతార్ సినిమాలకీ వెటా ఎఫ్ఎక్స్ విజువల్స్‌ను దగ్గరుండి పరిశీలించారీమె. ఢిల్లీ పుట్టి పెరిగారు పావనీ రావు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుండి బీఆర్‌ఖ్క పట్టా పొందారు.

తరవాత శాన్‌ఫ్రాన్సిస్కోలోని అకాడమీ ఆఫ్ ఆర్ట్ యూనివర్సిటీ ఎంఎఫ్ఎ, యానిమేషన్ కామెరూన్‌తో కలిసి చిరకాలంగా పనిచేస్తున్నారు. తొలి అవతార్‌తో 2009లో ఈ ప్రయాణం మొదలైంది. ఈ క్రమంలో అవతార్ మూడు సినిమాలకీ విజువల్ వండర్స్‌ని అందించారు. 'నానమ్మ ఉన్నితో బొమ్మలు తయారుచేసేది. చిన్నప్పుడు అవి చూసే ఆర్కిటెక్ట్ అవ్వాలనుకున్నా. ఆ తరవాత విజువల్ ఎఫెక్ట్స్ నన్ను ఆకర్షించాయి దీనికి సంబంధించి డిజిటల్ కోర్సులు పూర్తిచేసినప్పటికీ వాటిపై పూర్తి అవగాహన వచ్చింది. మాత్రం అవతార్ సినిమాకి పనిచేసినప్పుడే ముఖ్యంగా 'ది వే ఆఫ్ వాటర్‌లో దాదాపు 3000 విజువల్ ఎఫెక్ట్స్ షాట్లు తీశాం. ఎక్కువ భాగం నీటి అడుగున తీసినవే. ఇవన్నీ సహాళ్లతో

ఆ మూవీలో కొన్ని సన్నివేశాలకి విజువల్ ఎఫెక్స్‌లా చేస్తే బాగుం టుందో కామె రూరన్‌కి



కూడుకున్న సన్నివేశాలే. ప్రతి షాట్ ఒక వండర్ అనే చెబుతా. మన లోకాన్ని దాటి ప్రేక్షకులకి కొత్త ప్రపంచం చూపిస్తున్నప్పుడు ముందుగా దాన్ని మనం ఆస్వాదించాలి. అంతే .జాగ్రత్తగా సినిమాని చిత్రీకరించాలి. ఇందుకు మా టీమ్ చాలా కష్టపడింది అంటారు పావని. ముందు అవతార్-1కి లైటింగ్ టీడిగా పనిచేయడానికి వెళ్లారీమె.

వివరించారట. అలా అవతార్ మూడు భాగాల్లో పనిచేసే అవకాశం వచ్చిందట. ఆయనతో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతి నిచ్చిందంటారు పావని. 'అవతార్'తో పాటు 'ద క్రానికల్స్ ఆఫ్ నార్నియా, ద లయన్ 'ద విచ్ అండ్ ద వార్డ్‌రోబ్, 'నైట్ ఎట్ ద మ్యూజియం', ది ఇన్‌క్రెడిబుల్ హల్క్, రైజ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్'తోపాటు మరికొన్ని సినిమాలకూ పనిచేశారీమె. గత కొన్నేళ్ల లో వెటా ఎఫ్ఎక్స్ కళాకారులం అనేక అవార్డు లు అందుకు న్నాం. ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌కిగానూ ఏడు అకాడమీ, ఉత్తమ స్పెషల్ విజువల్ ఎఫెక్స్‌కి ఏడాది బాఫ్టా అవార్డులనీ అందుకున్నాం. వీటితోపాటు ఎమీ, సైన్స్ అండ్ టెక్నాలజ.ఈ పురస్కారాలూ పొందడం గర్వంగా ఉంది అంటారు పావని. □

## రోజుకో పూట చపాతీ..

బరువు తగ్గాలనుకునే వారు ప్రతి విషయంలోనూ ప్రత్యామ్నాయాల్ని వెతుక్కుంటుంటారు. రాత్రుళ్లు అన్నం మానేసి చపాతీ తీసుకోవడం కూడా ఇలాంటిదే! అయితే రాత్రి భోజనంలో చపాతీని భాగం చేసుకోవడం వల్ల బరువు తగ్గడంతోపాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు మరి, చపాతీలో దాగున్న ఆ ఆరోగ్య రహస్యా లేంటో తెలుకుందాం..




పోషకాల సమ్మేళనం : ......

✦ చపాతీని పోషకాల సమ్మేళనంగా పేర్కొంటున్నారు నిపుణులు. ఇందులో 'బి', 'ఇ' విటమిన్లతో పాటు కాపర్, జింక్, అయొడిన్, మాంగనీస్, సిలికాన్, పొటాషియం, క్యాల్షియం, వంటి ఖనిజాలు లభిస్తాయి. అంటే ఇవన్నీ రోజువారీ శరీరానికి కావాల్సిన పోషకాలను కొద్ది మొత్తాల్లో భరీ చేస్తాయన్నమాట. ✦. చపాతీలో ఉండే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని అందాస్తాయి. తద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండచ్చు. ✦ చపాతీల్లో ఉండే ఐరన్ స్థాయిలు శరీరంలో హెమోగ్లోబిన్ స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి. ✦ చపాతీల్లో ఉండే జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయంట న్నారు నిపుణులు. ✦. ఇందులో ఉండే పీచు జీర్ణవ్యవస్థకూ మంచిదే! అజీర్తి, గ్యాస్, మలబద్ధకం.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలన్న వారు నిపుణుల సలహా మేరకు రోజూ చపాతీని ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం. నూనె /నెయ్యి లేకుండ పుల్కా చేసుకొని తింటే మరీ మంచిదట! □

## తిరుప్పావై

### 11వ పాశురము



శెత్తార్ తిఱలళియ చ్చెన్ఱు
శెరుచ్చెయ్యుమ్,
కుత్త మొన్ఱిల్లాద కోవలర్ దమ్
పాఱ్కొడియే!
పుత్తరవల్‌గుల్ పునమయిలే!
పోదరాయ్,
శుత్తత్తు తోళిమా రెల్లారుమ్ వన్దు,
నిన్
ముత్తమ్ పుకున్దు ముకిల్ వణ్ణన్
పేర్‌పాడ,
శిత్తాదే పేశాదే శెల్వ ప్పెణ్డాట్టి, నీ!
ఎత్తుక్కుఱంగుమ్ పొరుళేలో
రెమ్బావాయ్

గోపాలవంశము, లేగదూడలతో, అనేకమైన ఆవులతో తరువులను యుద్ధములో గెలవగల శక్తి గలవారు పాలు పితుక గలది. ఆ వంశములో జన్మిచి గోపిక. బంగారు తీగలాగున్నది. పుట్టలోనున్న పామును పోలిన నితంబములు గలది. అడవిలోని నెమలివలె అందమైన కురులు "కదలకుండ పలుకకుండ నీవు ఏ ఉద్దేశ్యంతో నిదురించు చున్నావు. దీని అర్థమేమి? ఓ సంపన్నురాలా! బంధువులందరును, చెలికత్తెలందరును నీయింటి ముందు నిలిచియున్నారు. వారు మేఘవర్ణుడైన శ్రీకృష్ణుని నామము లను పాడుతున్నారు." అని వెలుపలి గోపికలు లోపలి మరొక గోపికను ఆహ్వానిస్తున్నారు.

ఫలం: "ఆత్మసౌందర్యం లభిస్తుంది"

## ఆరోగ్యానికి ఓ కౌగిలింత

కౌగిలించుకున్న అనుభవం ఎప్పటికీ మధుర జ్ఞాపకమే, ఆ సంతోషం, ప్రేమ మాటల్లో వర్ణించలేం.కానీ, పెద్దయ్యే కొద్దీ వారిని దగ్గరకు తీసుకోవడం తగ్గిపోతుంది. పిల్లలకు కడుపునిండా ఆహారాన్ని పెడితే సరిపోదు... శారీరక స్పర్శ కూడా అందించాలి అంటున్నాయి. పలు తాజా అధ్యయనాలు. ముఖ్యంగా చిన్నారుల్లో బ్రెయిన్ డెవలప్‌మెంట్‌కి సెన్సరీ స్టిమ్యులేషన్ అవసరం. తగిన స్పర్శ అందక పోతే... మెదడు పనితీరు మంద గిస్తుంది. ఓ పరిశోధనలో కనీసం ఇరవై నిమిషాలైనా పసిపిల్లల్ని హత్తుకొని ఉండాలంటోంది. ఇలా చేస్తే ఆరోగ్యంగా ఉంటారట. ప్రేమగా ఆలింగనం చేసుకుంటే.. చిన్నారుల్లో ఆక్సిటోసిన్ విడుదలకు సాయపడుతుంది. ఇది శారరక, మానసిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది. భావోద్వేగాల నియంత్రణ సాధ్యమవుతుంది. వ్యాధినిరోధకశక్తి పెరిగి తరచూ అనారోగ్యాలపాలవకుండా ఉంటాడు, ఒత్తిడీ ఉపమనిపోతుంది. మానసికంగా దృఢంగా మారతారు. నిజానికి ఎదిగే పిల్లలు ఓ పట్టాన మాట వినరు. వాళ్లు మీ మాట వినేలా చేయాలంటే... మీ బిడ్డలపై మీకున్న నమ్మకాన్నీ, ప్రేమనూ కౌగిలి రూపంలో తెలియజేయండి. దిగులుగా ఉన్నా, ఇతరులతో కలవకుండా ఒంటరిగా ఉంటోన్న చిన్నారులకు హగ్ థెరపీ భలేగా ఉపయోగపడు తుంది.



## ఎయిర్ ఫ్రయర్ మంచిదే!

బయట కాలుష్య తీవ్రత గురించీ, దానితో వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసు. మరి ఇంట్లోని కాలుష్యం మాటేంటి... అంటే ఇంటి కాలుష్యం పెరగడానికి ప్రధాన కారకాలు, మన వంటింట్లోంచి వెలువడే హానికారక వాయువులేనట. అందులోనూ మనం వండే పద్ధతులు కూడా ఇంటి కాలుష్యాన్ని పెంచు తున్నాయని అంటోంది యూకేకి చెందిన బర్మింగ్‌హామ్ జ్యూనివర్సిటీ అధ్యయనం. నూనెలో ఎర్రగా వేయించిన వేపుళ్లు తింటే,



అవి మన ఆరోగ్యానికి హానిచేస్తాయని తెలుసు. కేవలం ఆ వంటకాలు మాత్రమే కాదు, వాటి నుంచి వెలువడే ఓసీ(వొలటైల్ కాంపౌండ్స్) కూడా మన ఆరోగ్యానికి హానిచేస్తాయట. ఈ వీఓసీ కణాల క్యాన్సర్, ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలు రావడానికి కారణం. అలాగని వంట వండు కోకుండా ఉండలేం కదా అంటారా... అదీ నిజమే! అన్నిటికీ డీప్ ఫ్రైలు చేయకపోవడమే మంచిదట. ఒక వేళ చేయక తప్పదంటే, గ్యాస్ స్టవ్ అవెన్ల కన్నా ఎయిర్ ఫ్రయర్ లో మేలని ఈ అధ్యయనం చెబుతోంది. గ్యాస్, అవెన్‌లతో తాజా ఎయిర్ ఫ్రయర్లలో వంటలు చేసినప్పుడు తక్కువ మోతాదులో వీఓసీలు వెలువడు తున్నాయి. □

చలికాలంలో వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడం, చలిగాలులు, పొగమంచు.. అన్నీ కలిపి ఆరోగ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు ఇబ్బంది పెడతాయి.

## చలికాలం.. ఇలా చేద్దాం!



చలికాలంలో వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఉష్ణోగ్రతలు పడిపోవ డం, చలిగాలులు, పొగమంచు.. అన్నీ కలిపి ఆరోగ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు ఇబ్బంది పెడతాయి. వీటిబారిన పడకుండా ఉండాలంటే.. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. తినే ఆహారం విషయంలోనూ ఆచితూచి వ్యవహరించాలి. కొన్ని ఇంటి చిట్కాలు పాటించినా.. చిన్నచిన్న సమస్యలు దూరం అవుతాయి. □

## రంగవల్లి



15 చుక్కలు,
8వరుసలు, ఇటు అటు
వదిలి 8 వరకు సంధు



- సుధ మంజరి



### ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com


కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

## ఫంకీ 'ధీరే ధీరే' పాట విడుదల



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ' ఫంకీ. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుత మైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా ' ఫంకీ' ధీరే ధీరే' విడుదలైంది.'ఫంకీ' చిత్రానికి సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తొలి పాట వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ' ఫంకీ' ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుత మైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా ' ఫంకీ' ధీరే ధీరే' విడుదలైంది.' ఫంకీ' చిత్రానికి సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తొలి పాట 'ధీరే ధీరే'కి అద్భుతమైన సంగీతం అందించి, విడుదలైన తక్షణమే శ్రోతల మనసులో చోటు సంపాదించుకునేలా చేశారు. ఈ మధురమైన పాటను సంజిత్ హెగ్డే, రోహిణి సోరట్ ఆలపించగా, దర్శకుడు కె.వి. అనుదీప్ సాహిత్యం అందించడం విశేషం.

## 'నారి నారి నడుమ మురారి' పూర్తి



స్టార్ శర్వా, 'నారి నారి నడుమ మురారి' షూటింగ్ పూర్తి చార్మింగ్ స్టార్ శర్వా హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ నారి నారి నడుమ మురారి. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవ్వులు, భావోద్వేగాలు, ఆకట్టుకునే ఫ్యామిలీ డ్రామా కలయికలో పర్ఫెక్ట్ ఫెస్టివల్ మూవీ. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య మహిళా కథానాయికలుగా నటించారు. ఇటివలే రిలీజ్ చేసిన టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. టీజర్, యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ను సమానంగా ఆకట్టుకునే ఒక పర్ఫెక్ట్ సంక్రాంతి ఎంటర్‌టైనర్‌ని ప్రామిస్ చేసింది. తాజాగా ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా జనవరి 14వ తేదీన సాయంత్రం 5:49 గంటలకు ఫస్ట్ షోతో థియేటర్లలో విడుదల కానుంది.

తెర

వెర్సటైల్ యాక్టర్ ఆది హీరోగా

## 'శంబాల' మంచి రెస్పాన్స్



- అర్చన ఐయ్యర్

షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు నిర్మించిన చిత్రం 'శంబాల' ప్రీమియర్లకు మంచి రెస్పాన్స్ వస్తోంది.. హీరోయిన్ అర్చన ఐయ్యర్..శంబాల : ఎ మిస్టిక్ వరల్డ్. ఈ మూవీకి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?..**

నేను తెలుగమ్మాయినే. మాది చిత్తూరు జిల్లానే. కానీ విద్యాభ్యాసం అంతా బెంగళూరులోనే జరిగింది. నా మాతృభాష తెలుగే.

**'శంబాల' ప్రీమియర్లకు వస్తున్న రెస్పాన్స్ గురించి చెప్పండి?..**

శంబాలకు మంచి స్పందన వస్తోంది. వేసిన ప్రతీ ప్రీమియర్ హౌస్ ఫుల్ అవుతోంది. చాలా చోట్ల ఆడియెన్స్ భయపడిపోతున్నారు.

**.దేవి పాత్ర గురించి చెప్పండి?..** శంబాలలో నా పాత్రను ఆడియెన్స్ బాగా ఆదరిస్తున్నారు. నేను కనిపించిన ప్రతీ సారి ఆడియెన్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు. ఆదితో నా కాంబినేషన్ సీన్లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే చాలా మంది దర్శకులు ఫోన్ చేసి అభినందిస్తున్నారు.

**'శంబాల' కథను డైరెక్టర్ చెప్పినప్పుడు మీకు ఎలాంటి ఫీలింగ్ కలిగింది?** శంబాల నెరేషన్ పూర్తిగా వినకుండానే ఓకే చేశాను. ఇందులో స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది.

**"శంబాల' విషయంలో నిర్మాతల సపోర్ట్ గురించి చెప్పండి?..**

మా నిర్మాతలు మాకెంతో సపోర్ట్ చేశారు. మధ్యలో బడ్జెట్ పెరిగినా కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా శంబాలని గ్రాండ్‌గా నిర్మించారు.

## 'రేజర్' గ్లింప్స్ రిలీజ్

యూనిక్ స్టోరీ టెల్లింగ్, వైవిధ్యమైన కథలతో గుర్తింపు తెచ్చుకున్న



దర్శకుడు రవిబాబు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 'రేజర్ అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా, ఆయన గత చిత్రం ఏనుగుతొండం ఘటికాచలం వంటి లైట్‌హార్టెడ్ కామెడీకి పూర్తి భిన్నంగా, డార్క్ అండ్ గ్రిట్టీ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ బాబు నిర్మిస్తున్నారు. రవిబాబు-సురేష్ బాబు కాంబినేషన్‌లో మరోసారి వస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దర్శకత్వంతో పాటు ఈ చిత్రంలో రవిబాబు హీరోగా కూడా నటిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పాత్ర ఇంటన్సిటీ తగ్గట్టుగా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన 'రేజర్' టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తించింది. విజువల్స్ పూర్తిగా రా అండ్ బ్రూటల్ టోన్‌లో ఉండగా, రవిబాబు రౌడీలను ఎదుర్కొనే విధానం, రేజర్‌తో చేసే హింసాత్మక దాడులు వణుకు పుట్టించేలా ఉన్నాయి. ఈ గ్లింప్స్ ప్రతీకారంతో నిండిన క్రైమ్ కథ సూచిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న రేజర్, రవిబాబు కెరీర్‌లో మరో డిఫరెంట్ అండ్ ఫస్ట్‌ఆఫ్‌ఇట్స్‌కైండ్ ప్రయత్నంగా నిలవనుంది. మిగతా నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.సమ్మర్ 2026లో థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న రేజర్ రవిబాబు కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ సినిమాల్లో ఒకటిగా నిలవబోతోంది.

## 'హైలెస్సో'లో వడ్డీ కాంతమ్మగా అక్షర గౌడ

"హైలెస్సో" నుంచి వడ్డీ కాంతమ్మగా అక్షర గౌడ సుడిగాలి సుధీర్‌గా అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ విలన్‌గా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ ఈ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ రోజు అక్షరగౌడకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మేకర్స్ వడ్డీ కాంతమ్మగా ఆమె ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. వడ్డీ కాంతమ్మ గెటప్ లో అక్షరగౌడ లుక్ అందరినీ ఆకట్టుకుంది.ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు



పోషిస్తున్నారు. యంగ్ అండ్ టాలెంటెడ్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. అనుదీప్ దేవ్ సంగీతం అందించగా, సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా చోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి, చింతా శ్రీనివాస్ రైటర్. హై లెస్సో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.

## ఛాంపియన్' గుర్తుండిపోయే సినిమా


డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం స్వప్న సినిమాస్ అప్ కమింగ్ మూవీ 'ఛాంపియన్' అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే మంచిబజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్,

**ఛాంపియన్ కథ గురించి ?**

బైరాన్‌పల్లి సంఘటనని కొంచెం ఆధారంగా చేసుకొని ఫిక్షన్ గా చేసిన కథ ఇది. బైరాన్‌పల్లి, మైఖేల్ రెండు వేర్వేరు కథలు. బైరాన్‌పల్లి గురించి తీస్తే అది డాక్యుమెంటరీ తరహాలో వచ్చే అవకాశం వుంది. ఇప్పుడు జనరేషన్ ఆడియన్స్ కి కనెక్ట్ చేసేలా సినిమా తీయాలనుకున్నప్పుడు మైఖేల్ క్యారెక్టర్ ని ఆ ఊర్లో పెడితే ఎలా వుంటుందో అనుకుని, దాన్ని ఫిక్షన్ చేసి చేయడం జరిగింది. మైఖేల్ విలయమ్స్ సికింద్రాబాద్ లో పుట్టిపెరిగిన ఫుట్ బబాల్ ప్లేయర్. అతని డ్రీం ఇంగ్లాండ్ వెళ్ళడం. అతని పాయింట్ అఫ్ వ్యూ నుంచి కథ నడుస్తుంది.

**ఈ కథ అనుకున్నప్పుడే రోషన్ ని ఊహించుకున్నారా?**

2019లో స్వప్న గారికి కదా చెప్పాను. విన్న వెంటనే స్వప్న గారికి చాలా నచ్చింది. అప్పటికి ఇంకా హీరో ఎవరనేది నేను అనుకోలేదు. అప్పుడే కరోనా వచ్చింది. పనులన్నీ ఆగిపోయాయి. ఇందులో హీరో క్యారెక్టర్ ఆంగ్లో ఇండియన్. అలాంటి ఫీచర్స్ ఉండే హీరో ఎవరా అని చూస్తున్నప్పుడు పెళ్లి సందడి రిలీజ్ అయింది. రోషన్ అయితే బాగుంటుందని స్వప్న గారు కూడా అన్నారు. రోషన్‌కి కథ



చెప్పాను. తనకి కూడా నచ్చింది. స్వప్న గారికి కథ నచ్చితే హీరోతో సంబంధం లేకుండా సినిమా చేసేస్తారు. ఒక కొత్త హీరోతో కేవలం స్వప్న గారు కాబట్టే ఈ సినిమా చేయగలిగారు. మరో ప్రొడ్యూసర్ ఇంత ధైర్యంగా చేస్తారని అనుకోను.

## ఐజిపిఎల్ టూర్..
# మిల్కా సింగ్‌కు టైటిల్



**న్యూఢిల్లీ:** భారత గోల్ఫ్ లెజెండ్ జీవ్ మిల్కా సింగ్ ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ ప్రారంభ సీజన్‌ను కలల ముగింపుగా టైటిల్‌ను అందించాడు. గురువారం జరిగిన ఈ టోర్నీలో జీవ్ యువ, అనుభవజ్ఞులైన స్టార్‌లను ఓడించి సీజన్ యొక్క చివరి ఈవెంట్ అయిన ఐజీపీఎల్ ఇన్విటేషనల్ శ్రీలంకను గెలుచుకున్నాడు. 2012 నుండి ఒక్క ప్రో ఈవెంట్ కూడా గెలవని జీవ్, ప్రారంభ సీజన్ చివరి ఈవెంట్‌లో తన యువ ప్రత్యర్థులకు రాయల్ కొలంబో గోల్ఫ్ కోర్స్ గ్రీన్స్ గురించి సరైన పాఠం నేర్పించాడు. రెండవ రోజు జీవ్ అద్భుతమైన ఆటకు 5-10 అడుగుల లోపలికి తన అప్రోచ్‌లను కొట్టే అవకాశం లభించింది. ఒక దశలో, అతను వరుసగా ఐదు బర్డీలు, ఆరవ, 14వ మధ్య తొమ్మిది హోల్స్ వ్యవధిలో ఏడు బర్డీలు చేశాడు. ఆర్యన్ రూప ఆనంద్ కంటే రెండు షాట్లు వెనుకబడిన జీవ్, ముగింపు 6అండర్ 65తో మొత్తం 15అండర్‌కు తిప్పికొట్టాడు. అతను ఆర్యన్‌ను ఒక షాట్‌తో ఓడించాడు. ప్లేఆఫ్‌కు అర్హత సాధించడానికి పార్-4 18వ స్థానంలో ఈగిల్ అవసరమైన ఆర్యన్ (68), కేవలం ఒక బర్డీని మాత్రమే చేయగలిగాడు మరియు 14అండర్‌లో రెండవ స్థానంలో నిలిచాడు. జీవ్ చివరిసారిగా 2012 స్కాటిష్ ఓపెన్‌లో ప్రో విజయం సాధించాడు.

# నేడు శ్రీలంకతో మహిళల టి20
## ఐదు మ్యాచ్‌ల సిరీస్ కైవసం దిశగా టీమిండియా



**న్యూఢిల్లీ:** మహిళల టీ20లో భాగంగా శ్రీలంకపై సిరీస్ విజయం సాధించాలని టీమిండియా పట్టుదలతో ఉంది. ఈ నెల 26న తిరువనంతపురం వేదికగా మూడో టీ20 మ్యాచ్ జరగనున్న దృష్ట్యా ఇప్పటికే టీమిండియా ప్లేయర్లు అక్కడకు చేరుకున్నారు. విశాఖపట్నంలో జరిగిన మొదటి, రెండవ టీ20 లలో భారత్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అద్భుతంగా ఉంది. వరుసగా ఎనిమిది వికెట్ల మరియు ఏడు వికెట్ల తేడా తో సమగ్ర విజయాలను నమోదు చేయడంతో శ్రీలంకపై ఆధిపత్యాన్ని సంపాదించింది. రెండు మ్యాచ్‌లలో వేర్వేరు ఆటగాళ్ల రాణించడంతో భారత్ అద్భుతమైన బ్యాటింగ్ లైనప్‌ను కలిగి ఉంది. కొత్తగా నియమితులైన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ తొలి టీ20లో రాణించగా, ఓపెనర్ షఫాలి వర్మ రెండో టీ20లో ఆ పనిని పూర్తి చేసింది. బౌలింగ్ విభాగం కూడా అంతే పదునుగా ఉంది. స్పిన్నర్లు శ్రీలంకను రెండు మ్యాచ్‌ల్లో 6 వికెట్లకు 121 మరియు 9 వికెట్లకు 128 పరుగులకే పరిమితం చేయడం ద్వారా షాట్‌లు ఇచ్చారు. యువ ఆటగాళ్ల ఎన్ శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్ నియంత్రణతో బౌలింగ్ చేస్తూ, పనిభారాన్ని సమర్థవంతంగా పంచుకున్నారు. అనుభవజ్ఞురాలైన ఆల్ రౌండర్ దీప్తి శర్మ స్వల్ప జ్వరంతో రెండో టీ20కి దూరమవగా, స్నేహ్ రాణా నాలుగు ఓవర్లలో 11 పరుగులకు 1 వికెట్ మాత్రమే ఇచ్చి పొదుపుగా బౌలింగ్ చేయడంతో భారత బౌలింగ్ లోతు బయటపడింది. తొలి మ్యాచ్‌లో భారత్ ఐదు క్యాచ్‌లు కోల్పోయినా, రెండో మ్యాచ్‌లో మూడు రనౌట్‌లతో గణనీయమైన మెరుగుదలను చూపించింది. మరోవైపు వరుసగా భారీ పరాజయాలతో సతమతమవుతున్న శ్రీలంక వేదిక మార్పుతో తమ అదృష్టంలో మార్పు వస్తుందని ఆశిస్తోంది. బ్యాటింగ్ వైఫల్యాలు శ్రీలంకను ప్రత్యేకంగా నిరాశపరుస్తాయి. రెండు మ్యాచ్‌ల్లోనూ ముందుగా బ్యాటింగ్ చేయమని అడిగినా, శ్రీలంక స్కోరును నమోదు చేయడంలో విఫలమైంది. ప్రారంభంలో కొంత ఆశాజనకంగా కనిపించినా ఇన్నింగ్స్ చివరి భాగంలో వికెట్లు పడిపోవడంతో వేగం కోల్పోయింది.

# టీమిండియాకు చేదు జ్ఞాపకాలు



రోహిత్, కోహ్లీ గుడ్ బై

పాక్ చేతిలో ఘోర ఓటమి

ఐపిఎల్ విజయోత్సవంలో విషాదం

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది భారత క్రికెట్‌కు బాగా కలిసొచ్చింది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజయంతో మొదలైన భారత క్రికెట్ విజయాల జోరు సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ వరకు కొనసాగింది. భారత మహిళా క్రికెటర్లు కూడా ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడారు. ఈ మరపురాని విజయాల మధ్య నో బాల్స్ వంటి చేదు జ్ఞాపకాలు కూడా ఉన్నాయి. వీటిలో టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో అభిమానులు షాక్‌కు గురయ్యారు. సరిగ్గా ఇంగ్లండ్ పర్యటనకు ముందే వారం రోజుల వ్యవధిలోనే ఈ ఇద్దరు దిగ్గజాలు సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ తీసుకున్నా తనకు ఎంతో ఇష్టమైన టెస్ట్ ఫార్మాట్‌లో కోహ్లీ కొనసాగుతాడని అంతా అనుకున్నారు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ రోహిత్ శర్మను అనుసరిస్తూనే కోహ్లీ రెడ్ బాల్ క్రికెట్‌కు అల్విదా ప్రకటించాడు. ఇక వైట్‌బాల్ ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్న టీమిండియా టెస్ట్ క్రికెట్‌లో మాత్రం తడబడుతుంది, గతేడాది న్యూజిలాండ్ చేతిలో సొంతగడ్డపై 3 టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన భారత్, ఈ ఏడాది ఆ పేలవ ప్రదర్శనను పునరావృతం చేసింది. సొంతగడ్డపై సౌతాఫ్రికా చేతిలో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో వైట్‌వాష్ అయ్యింది. కోల్‌కతా వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో 30 పరుగులతో ఓడిన భారత్ గౌహతి వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో 408 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ పరాజయం భారత డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలపై ప్రభావం చూపనుంది. అలాగే అండర్ 19 ఆసియా కప్ ఫైనల్లో భారత్‌కు ఘోర పరాజయం ఎదురైంది. ఈ నెల 21 పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో భారత్ 191 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబర్చిన ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత అండర్ 19 జట్టు ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరింది.

కానీ తుదిపోరులో చేతులెత్తేసింది. కాగా 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. దాంతో ఈ విజయాన్ని అభిమానులు ఘనంగా సెలెబ్రేట్ చేసుకున్నారు. కానీఆర్‌సీబీ ఫ్రాంచైజీ నిర్వహించిన విజయోత్సవ వేడుక విషాదంగా ముగిసింది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం బయట జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు మృతి చెందారు. భారత క్రికెట్ చరిత్రలోనే ఈ ఘటన విషాదంగా ముగిసింది.



ఆట

## ఫుట్‌బాల్ ఛాంపియన్స్ లీగ్‌లో ..
# ఓటమితో ముగిసిన గోవా

**న్యూఢిల్లీ:** ఇస్టిక్లో చేతిలో ఓటమితో నీది గోవా ఫుట్‌బాల్ క్లబ్ ఛాంపియన్స్ లీగ్ ప్రచారాన్ని ముగించింది. తజికిస్తాన్‌కు చెందిన ఎఫ్‌సి ఇస్టిక్‌లోల్‌తో జరిగిన మ్యాచ్‌లో వరుసగా ఆరో ఓటమితో ఛాంపియన్స్ లీగ్ 2లో 16వ రౌండ్‌కు ఇప్పటికే పోటీలో లేనప్పటికీ, గోవా ఎఫ్‌సి తమ ప్రచారాన్ని ముగించింది. ఫుట్‌బాల్‌లో ఎఫ్‌సి గోవా 2025-26 ఎఎఫ్‌సి ఛాంపియన్స్ లీగ్ టూలో తన ప్రచారాన్ని గ్రూప్ డి మ్యాచ్‌లో 2-1 తేడాతో ఇస్టిక్‌లోల్‌తో జరిగిన టోర్నమెంట్‌లో ఘోర పరాజయం చెందింది. ఆట తొలి అర్ధభాగంలో డెజాన్ డ్రాజిక్ గోల్ చేయడంతో నీది గోవా తమ చివరి లీగ్ ఆటకు మంచి ఆరంభాన్ని ఇచ్చింది, కానీ 53వ నిమిషంలో పాల్ కొమోలాఫ్ ఈక్వలైజర్‌తో 2వ అర్ధభాగంలో ఇస్టిక్‌లోల్ గోల్ చేశాడు, ఆ తర్వాత అమిర్‌బెక్ జురాబోవ్ పెనాల్టీ ద్వారా మరో గోల్ చేశాడు. సోడిక్‌జోన్ కుర్బోనోవ్‌కు రెడ్ కార్డ్ ఇచ్చినప్పటికీ రెండవ భాగంలో నాటకీయ మలుపు తిరిగి, ఒక గోల్ ఆధిక్యంతో మ్యాచ్‌ను గెలుచుకోగలిగారు. ఫలితంగా లీగ్‌లో తొలిసారిగా ఆడిన ఎఫ్‌సి గోవా ఆరు మ్యాచ్‌లలో సున్నా పాయింట్లతో గ్రూప్‌లో అట్టడుగున నిలిచింది. ఇంకా పాయింట్ నమోదు చేయని హోమ్ జట్టు ఎనిమిదో నిమిషంలో ఆధిక్యంలోకి వెళ్లింది. డెజాన్ డ్రాజిక్ బాక్స్ లోపల స్థలం కనుగొని, కుడి ఎగువ మూలలో కర్లింగ్ ప్రయత్నంతో అద్భుతంగా ముగించాడు. తజికిస్తాన్ జట్టు తరువాత ఆధిక్యంలోకి వెళ్లి మ్యాచ్‌ను అనుకూలంగా ముగించింది.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో..
# భారత్ ప్లేయర్ల అద్భుత విజయాలు

**న్యూఢిల్లీ:** సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అనుభవజ్ఞులైన శ్రుతి ముందాడ, పరుల్ చౌదరి మరియు రైజింగ్ స్టార్ తన్వి పాత్రి ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ప్రత్యర్థులను ఓడించి మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకు న్నారు. శ్రుతి 21-14, 21-9 తేడాతో ఏడో సీడ్ జియా రావత్‌ను ఓడించగా, పారుల్ 18-21, 21-18, 21-12 తేడాతో 9వ సీడ్‌ను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. తన్వి పాత్రి కూడా ఎనిమిదో సీడ్ ఇషారాణి బారువా ప్రచా రాన్ని 22-20, 21-19 తేడాతో ముగించింది. టాప్ సీడ్ ఉన్నతి హుడా, రెం డవ సీడ్ అనుపమ ఉపాధ్యాయ, మూడవ సీడ్ అన్మోల్ ఖర్బ్ మరియు ప్రపంచ జూనియర్ రజత పతక విజేత తన్వి శర్మ కూడా తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల టాప్ సీడ్ ఉన్నతి హుడా, ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో రజత పతక విజేతలు తన్వి శర్మ, అనుభవజ్ఞురాలు ఆకర్షి కశ్యప్, జూనియర్ రౌనక్ చౌహాన్ అద్భుతమైన విజయాలు నమోదు చేశారు. తొలి రౌండ్‌లో బై పొందిన ఉన్నతి, వైల్డ్‌కార్డ్ ఎంట్రెంట్ ఆకాంక్ష



మట్టేను 21-8, 21-18 తేడాతో ఓడించగా, తన్వి తన ప్రచారాన్ని ఆసియా అండర్ 15 బాలికల సింగిల్స్ స్వర్ణ పతక విజేత షైనా మణిముత్తుపై 21-10, 21-14 తేడాతో ఓడించింది. ఆసియా అండర్ 17 ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత లక్ష్య రాజేష్‌ను 21-7, 21-9 తేడాతో ఓడించిన సీనియర్ కాశ్యప్ కూడా తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు. ఇక అష్మిత చలిహా 21-7, 21-11 తేడాతో కావ్య మార్వానియాపై విజయం సాధించింది. అలాగే 16వ సీడ్ పూర్వా బార్వే రౌండ్ ఆఫ్ 64లో ఎం మేఘనా రెడ్డి చేతిలో 21-19, 17-21, 18-21 తేడాతో ఓడిపోయింది.


# రూ.80వేల కోట్ల డీల్స్ పూర్తిచేసిన 'అదానీ'



వాణిజ్యం

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:** అమెరికా షార్ట్‌సెల్లింగ్ కంపెనీ నివేదికలతో భారీస్థాయిలో ఒడిదొడుకులు చవిచూసినప్పటికీ అదాని గ్రూప్ మొత్తం రూ.80వేల కోట్ల విలువైన కొనుగోళ్లు చేసింది. మొత్తం 33 సంస్థల్లో వాటాలు తీసుకోవడం లేదా మొత్తం స్వాధీనంచేసుకోవడం వంటివి నిర్వహించడం కంపెనీ విశ్వసనీయతకు నిదర్శనమని అదాని చెపుతోంది. కంపెనీ కీలక రంగాలపై దృష్టిసారించింది. పోర్టులపరంగా రూ28,145 కోట్లవిలువైన కొనుగోళ్లు జరిపింది. అలాగే సిమెంట్ రంగంలో రూ.24,710 కోట్లు, విద్యుత్‌రంగంలో రూ.12,251 కోట్లు కొనుగోళ్లు లేదా విలీనాలు, సేకరణలు వంటివిచేసింది. కొత్త వాణిజ్య సంస్థల్లోనూ రూ.3927 కోట్ల విలువైన కొనుగోళ్లుజరిపింది. ఇక విద్యుత్‌పరంగా ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ పరంగా రూ.2544 కోట్లు మేర డీల్స్ పూర్తిచేసినట్లు వెల్లడించింది. జేపీ గ్రూప్ దివాలా ప్రక్రియలో కొనుగోలుచేసిన సంస్థగా ఈ రూ.13,500 కోట్లను వీటిలోచూపలేదు. ఈ లావాదేవీ ఇంకా పూర్తి కావాల్సి ఉన్నందున ఈ రూ.80వేల కోట్లలో కలపలేదు. ఈకొనుగోళ్లతో అదానిగ్రూప్ ఇన్వెస్టర్లలో మరింత నమ్మకాన్ని పెంచుకోగలిగింది. అమెరికా కేంద్రంగా ఉన్న షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలతో కంపెనీలో అవకతవకలు భారీగా కొనసాగాయని, స్టాక్ విలువల్లో అవకతవకలకు పాల్పడిందని, 2023లో ఆరోపణలు చేసింది. దీనితో ఆదాని షేర్లు ఒక్కసారిగా కుదుపునకు లోనయ్యాయి. ఆ తర్వాతనుంచి కూడా అదాని వ్యూహాత్మకంగా వ్యవహరించి తన గ్రూప్‌సంస్థలపై ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచే కార్యాచరణను పెంచింది. ఇందులో భాగంగానే మెర్జర్స్, అక్విజిషన్స్‌పై దృష్టిపెట్టింది.

# మార్కెట్లకు క్రిస్మస్ హాలిడే
## కొత్త యేడాది సెలవులు ప్రకటించిన ఎక్ఛేంజిలు




**ముంబయి, డిసెంబరు 25:** క్రిస్మస్‌సందర్భంగా దేశీయ బిఎస్ఇ, ఎన్ఎస్ఇలకే కాకుండా పలు అంతర్జాతీయ మార్కెట్లు కూడా గురువారం మూతపడ్డాయి. అలాగే అనేక సంస్థాగత ఇన్వెస్టర్ల సంస్థలు కూడా తమ వార్షిక ముగింపుకోసం లెక్కలు సరిచూసుకుంటున్నాయి. ఎఫ్ఐఐలుకూడా సంవత్సరాంతపు సెలవులను పంచుకుంటున్నాయి. దేశీయంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి, నేషనల్ స్టాక్‌ఎక్స్ఛేంజిలు క్రిస్మస్ సందర్భంగా మూతపడ్డాయి. అయితే జపాన్ నిక్కీ, చైనా షాంఘై కాంపోజిట్‌లు మాత్రం గురువారం ట్రేడింగ్ నిర్వహించాయి. నిక్కీ సూచీ 0.19శాతం పెరిగింది. షాంఘై కాంపోజిట్ 0.095శాతం పెరిగిందని తేలింది. దక్షిణ కొరియా కోస్పి, ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్200, హాంకాంగ్ హ్యాంగ్‌సెంగ్‌లు ట్రేడింగ్ నిర్వహించలేదు. క్రిస్మస్ సెలవులు ప్రకటించాయి. ఇక డౌజోన్స్, నాస్‌డాక్, వాల్ స్ట్రీట్ ఇతర మార్కెట్లు, న్యూయార్క్ ఎస్టాక్ ఎక్స్ఛేంజిలు క్రిస్మస్ సందర్భంగా ముందురోజే మూతప డ్డాయి. ఇక వచ్చేయేడాది తొలి సెలువు రిపబ్లిక్‌డేకు ఉంటుంది. అంటే జనవరి 26వ తేదీ సెలవుతో ప్రారంభం అవుతుంది. జనవరి ఒకటో తేదీ మాత్రం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి. మార్చి3వ తేదీ హోలీ, అదేనెల 26వ తేదీ శ్రీరామనవమి, మార్చి 31వ తేదీ శ్రీమహావీర్ జయంతి, ఏప్రిల్3న గుడ్‌ఫ్రైడే, అదేనెల 14న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి, మే ఒకటో తేదీ మేడే, మహారాష్ట్రడే, మే 28వ తేదీ బక్రీద్, జూన్ 26వ తేదీ మొహర్రం, సెప్టెంబరు 4వ తేదీ గణేశ్ చతుర్థి, అక్టోబరు 2న గాంధీ జయంతి, నవంబరు 10వ తేదీ దీవాలి బలిప్రతిపాద, నవంబరు 24 ప్రకాష్ గురుపూ రబ్, డిసెంబరు 25న క్రిస్మస్‌ల సందర్భంగా వచ్చే ఏడాది సెలవులుంటాయి.




## నవీముంబయి ఎయిర్‌పోర్టునుంచి
# ఎయిరిండియా సర్వీసులు

**నవీముంబయి, డిసెంబరు 25:** నవీ ముంబైలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం క్రిస్మస్ పర్వదినం రోజున ప్రారంభమైంది. ఈ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలు ప్రారంభించిన తొలి సంస్థల్లో ఒకటిగా నిలిచిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బెంగళూరు, ఢిల్లీ నగరాలకు నేరుగా విమాన సర్వీసులను మొదలుపెట్టింది. నవీ ముంబై విమానాశ్రయం నుంచి ఎగిరిన తొలి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం బెంగళూరుకు చేరుకుంది. ఢిల్లీకి వెళ్లే విమానం మధ్యాహ్నం 2:05 గంటలకు నవీ ముంబై నుంచి బయలుదేరి, సాయంత్రం 4:20 గంటలకు దేశ రాజధానికి చేరుకుంటుందని సంస్థ ఒక తెలిపింది. ఈ సందర్భంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలోక్ సింగ్ మాట్లాడుతూ నవీ ముంబై నుంచి విమానసేవలు ప్రారంభించడం ఒకమైలురాయి. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌కు కనెక్టివిటీని పెంచడంలో మేం భాగస్వాములం కావడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో తమ కార్యకలాపా లను మరింత విస్తరిస్తామని ఆయనతెలిపారు. తొలి నెలలో ఈ విమానాశ్రయం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు (12 గంటలు) మాత్రమే పనిచేస్తుంది. ఈ సమయంలో రోజుకు 23 విమానాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, 2026 ఫిబ్రవరి నుంచి విమానాశ్రయాన్ని 24 గంటల పాటు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు చెందిన ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (74 శాతం వాటా), మహారాష్ట్ర ప్రభుత్వ సిడ్కో (26 శాతం వాటా) పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు.

# రెండేళ్లలో ఐపిఒలతో రూ.3.8 లక్షలకోట్లు సమీకరణ
## చరిత్రాత్మక గరిష్టాలను తాకిన ఐపిఒ ఇష్యూలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:** భారత ఐపిఒ మార్కెట్ చరిత్రాత్మక గరిష్టాలను నమోదుచేసింది. గడచిన రెండేళ్లలో రికార్డుస్థాయిలో అంటే 701 ఐపిఒలతో 3.8 లక్షలకోట్లు సమీకరణలు జరిగాయి. ఇన్వెస్టర్లలో భారత్ ఆర్థికవృద్ధిపై విశ్వాసం పెరగడం, ఎన్‌బిఎఫ్‌సిలు, క్యాపిటల్‌గూడ్స్, టెక్నాలజీ రంగాల్లో ఇన్వెస్టర్ల భాగస్వామ్యం భారీగా ఉండటంతో గణనీయంగా ఐపిఒలు వచ్చాయి. చిన్న స్థాయి కంపెనీలు మెయిన్‌బోర్డు కంపెనీలతో పాటు ఎస్ఎంఇ కంపెనీలుకూడా భారీగానే ఐపిఒలకు వచ్చాయి. 2024-25లో రూ.3.8 లక్షలకోట్లు నిధులు సమీకరించాయి. అంతకుముందు 2019 నుంచి 2023 వరకూ చూస్తే 3.2 లక్షలకోట్లు సమీకరిస్తే ఒక్క ఏడాదిలోనే 3.8 లక్షలకోట్లు సమీకరించింది. ఇప్పటికే 2025లో 365 ఐపిఒలు 1.95 లక్షల కోట్లు సమీకరించాయి. గత ఏడాది రూ.1.90 లక్షలకోట్లను అధిగమించాయి. ఇక మెయిన్‌బోర్డు ఆఫరింగ్స్‌మొత్తం నిధుల్లో 94శాతం వాటాతో ఉన్నాయి. భారీస్థాయిలో ఐపిఒలు జారీకి పటిష్టమైన డిమాండ్ కనిపించింది. 2024లో ఆటోమొబైల్, టెలికామ్‌లనుంచి ఎన్‌బిఎఫ్‌సిలు, క్యాపిటల్‌గూడ్స్, టెక్నాలజీ, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌రంగాలకు కూడా ఇన్వెస్టర్లు మారారు. ఇక చిన్నస్థాయి సంస్థలు 20 ఏళ్లలోపు స్థాపించిన సంస్థలు, స్మాల్‌క్యాప్ సంస్థలు కూడా ఎక్కువ నిధులు సమీకరించాయి. ఇక ఎస్ఎంఇ విభాగంలో లిస్టింగ్స్ ఈ ఏడాది భారీగా పెరిగాయి. భారత్ ఈక్విటీలపై దేశీయంగాను, విదేశీ ఇన్వెస్టర్లలోను నమ్మకం పెరిగింది. మ్యూచువల్ ఫండ్స్, రిటైల్ రంగాల్లో భారీగా దేశీయ ఇన్వెస్టర్‌బేస్ పెరిగింది. అంతేకాకుండా స్థానిక యూనిట్ల లిస్టింగ్ వైపు భారీ బహుళజాతి సంస్థలు కూడా దృష్టిసారించాయి. ప్రైమరీ మార్కెట్లలో ట్రేడింగ్ పైనా, కంపెనీల ఆర్థికపరిపుష్టి పైనా, ప్రభుత్వ విధానాలుపైనా ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతున్నందువల్లనే భారీ మొత్తంలో నిధుల సమీకరణ సాధ్యం అయిందని ఫండ్స్‌సంస్థలు, రేటింగ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. 2025లో అయితే ఎన్‌బిఎఫ్‌సిలు అతిపెద్ద సంఖ్యలో ఐపిఒల్లో నిలిచాయి. అంతకుముందు ఏడాది అయితే ఆటోమొబైల్స్, టెలికామ్, రిటైల్, ఈకామర్స్ రంగాలే ఐపిఒల్లో గుత్తాధిపత్యంగా నిలిచాయి. ప్రైవేటు బ్యాంకింగ్, యుటిలిటీ సంస్థలు, టెలికాం వంటివి ఈ ఏడాది ఇప్పటివరకూ ఒక్క ఐపిఒకూడా రాలేదు.




# తారోఫార్మా యాంటీ ఫంగల్ షాంపూ యూనిట్లు రీకాల్

SUN PHARMA

TARO

**న్యూఢిల్లీ,డిసెంబరు 25:** సన్‌ఫార్మా అమెరికా సంస్థ తారో ఫార్మా ఇండస్ట్రీస్ యాంటి ఫంగల్ షాంపూ 17 వేల యూనిట్లను రీకాల్ చేసింది. ఉత్పత్తిలో సమస్యలు ఎదురుకావడంతో యుఎస్ ఎఫ్‌డిఎ వీటిపై ఆంక్షలు ప్రకటిం చడంతో కంపెనీ వాటిని రీకాల్‌చేసింది. సిక్లోపిరాక్స్ షాంపూను యాంటీ ఫంగల్ షాంపూగా వినియోగిస్తారు. ఈ షాంపూ వినియోగంతో చర్మంపై దురదలు, తలలో దురద, చర్మం మరింతగా పొడిబారిపోవడం వంటి సమస్యలు వచ్చాయన్న ఫిర్యాదులు అందాయి. దీనితో 17,664 యూనిట్లను కంపెనీ రీకాల్‌చేసింది. క్లాస్‌టూ రీకాల్ అంటే నిబంధనలకు అనుగుణంగా లేదని భావిస్తారు. తారో ఫార్మా సన్‌ఫార్మాకు అనుబంధంగా పనిచేస్తోంది. ఇజ్రాయెల్ కేంద్రంగా ఉన్న కంపెనీని సన్‌ఫార్మా 347.73 మిలియన్ డాలర్లకు గత ఏడాదే కొనుగోలుచేసింది. సన్‌ఫార్మాకు తారోలో 2010నుంచి మెజార్టీ వాటా ఉంది. డెర్మటాలజీపైనే ఎక్కువ దృష్టిపెట్టిన తారో ఈ యాంటీఫంగల్ షాంపూకు మంచి మార్కెట్ కూడా ఉంది. కౌంటర్‌లలో విక్రయించే డెర్మటాలజీ ఉత్పత్తులు అనేకం తారో తయారుచేస్తోంది. భారత్ ఫార్మా రంగంలోనే అతిపెద్ద కంపెనీగా సన్‌ఫార్మా ఉంది. కంపెనీ నికరలాభం వార్షికపద్ధతిలో 2.56శాతం వృద్ధి నమోదు చేసి 3118 కోట్లుగా ప్రకటించింది. అయితే అమెరికాలో ఫార్ములేషన్ విక్రయాలు మాత్రం 4.1శాతం క్షీణించి 496 మిలియన్ డాలర్లకు చేరాయి.

## ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు
# సిఐఐ 4సూత్రాలు!

**న్యూఢిల్లీ,డిసెంబరు 25:** భారత్‌స్థూల ఆర్థికవ్యవస్థ మరింత పటిష్టతకోసం భారత పారిశ్రామిక సంఘాల సమాఖ్య (సిఐఐ)నాలుగు కీలకసూచనలు చేసింది. రుణ సుస్థిరత తోపాటు ఆర్థికపారదర్శకత, రాబడులసమీకరణ, వ్యయసామర్థ్యం క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుందని, దీర్ఘకాలిక ఆర్థిక పరిపుష్టివైపు ప్రణాళికలు వేయాలని సూచించింది. జిడిపిపన్నుల నిష్పత్తిని మరింతగా పెంచుకోవాల్సి ఉంటుందని, ఆరోగ్యం, విద్యరంగాల్లో ప్రభుత్వ వ్యయం మరింత సమర్థవంతంగా ఉండాలని సూచించింది. 2031 నాటికి జిడిపిలో 50శాతానికి రుణభారం పెరిగే ప్రమాదం ఉంది. 2027నాటికి ఆర్థికలోటు, రుణభారంస్థాయి వంటివి కొంత ఆందోళనకరమేనని అయితే రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణ, పట్టణ స్థానిక సంస్థలు కొంతమేర ఆర్థికంగా పటిష్టం కావాల్సిన అవసరంఉంటుందని సూచించింది. మధ్యంతర ఆర్థిక నిర్మాణ క్రమాన్ని పునరుద్ధరించాలని, మూడునుంచి ఐదేళ్లకాలానికి రాబడులు, వ్యయంపైనా, రుణాలపైనా ఈ మధ్యంతర ఆర్థిక పరిపుష్టిని పెంచుకో వాలనిసూచించింది. ప్రస్తుతం జిడిపితో పన్నుల నిష్పత్తి తక్కువగా ఉందని రానున్న కాలంలో ఇతర వర్ధమాన దేశాలతో పోల్చి పెంచుకోవాలిసన అవసరం ఉందని సిఐఐ వెల్లడించింది. అలాగే విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో ప్రభుత్వ వ్యయసామర్థ్యం పెరగాలిస ఉంటుందని కేంద్ర ప్రాయోజిత పథకాలను సమీక్షించుకుంటూ డిజిటల్ పర్యవేక్షణ పెరగాలని కోరింది. రాష్ట్రాల్లో కూడా ఆర్థికపరంగా సంస్కరణలు అవసరమని, క్రమశిక్షణ మరింతగా ఉండాలని సిఐఐ అభిప్రాయపడింది. విభిన్న రేటింగ్ ఏజెన్సీల రేటింగ్స్ తీసుకుని వాటిని కేంద్ర సహాయం కోసం వీటిని లింక్‌చేయాలని తెలిపింది. అంతేకాకుండా అర్బన్ ఫైనాన్స్‌కోసం నేషనల్ డిజిటల్ అర్బన్ ప్లాట్‌ఫామ్, ఫిస్కల్ హెల్త్ సూచీలను పట్టణ స్థానిక సంస్థలకోసం ఏర్పాటుచేయాలని ప్రభుత్వ వ్యయం పటిష్టంచేసి ప్రైవేటు పెట్టుబడులను మరింతగా ప్రోత్సహించాలని సిఐఐ అభిప్రాయపడింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.